RNI.No. APTEL/2014/57702
ESTD: 1999
www.voodayam.com
Postal Regd. No. GTR/117/2025-27




# వుదయం




గుంటూరు | 29-01-2026 గురువారం | సంపుటి : 12 | సంచిక : 335 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Follow us on



## చిన్న వ్యాపారులకు చేయూత ఇవ్వండి

### బ్యాంకర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు

**వుదయం, అమరావతి:** రుణాల రీషెడ్యూల్‌తో రూ.1,108 కోట్ల మేర ఆదా చేయగలిగామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. ఎంఎస్ఎంఈలు, వివిధ కీలక రంగాలు అభివృద్ధి జరిగేలా బ్యాంకర్ల సహకారం అందించాలని కోరారు. వ్యాపారాల్లో బల హీనవర్గాలకు చేయూతనిచ్చే ఎంఎస్ఎంఈలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అమరావతిలో బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో సీఎం మాట్లాడారు. "ఎంఎస్ఎంఈలకు ప్రభుత్వం, బ్యాంకర్లే వెన్నుదన్నుగా నిలవాల్సిన అవసరముంది. వాటి పోత్సాహంతో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుంది. వైకాపా పాలనలో వ్యవస్థలు గాడి తప్పి ప్రభుత్వానికి క్రెడిబులిటీ పోయింది. పెద్ద ఎత్తున వడ్డీలకు అప్పులు తెచ్చారు. క్రెడిబులిటీ ఉంటే తక్కువ వడ్డీలకు రుణాల తీసుకురావొచ్చు. రాష్ట్రంలో 2 లక్షల కోట్ల మేర రుణాలను రీషెడ్యూల్ చేసుకునే అవకాశం ఉందని అంచనా వేశాం. ఇప్పటి వరకు రూ.49వేల కోట్లు రీషెడ్యూల్ చేశాం. ప్రకృతి సేద్యం మరింత విస్తరించేందుకు బ్యాంకర్ల నుంచి ప్రోత్సాహం అందాలి. ఇకపై బ్యాంకర్ల సమావేశానికి జిల్లా కలెక్టర్లను కూడా ఆహ్వానించాలి'' అని చంద్రబాబు సూచించారు.

**చంద్రబాబు ట్వీట్..**

'ఆజాద్ హింద్ ఫౌజ్' ఏర్పాటు చేసి భరత మాత దాస్య శృంఖలాలను తెంచేందుకు నిర్విరామ కృషి చేసిన మహనీయుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని చంద్రబాబు కొనియాడారు. 129వ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నాను. ఆయన పోరాట పటిమ దేశ పౌరుషానికి ప్రతీకగా ఈనాటికీ చెప్పుకుంటున్నామంటే అది ఆయన ప్రత్యేకత. భారత జాతి కోసం ప్రాణాలకు తెగించి పోరాడతానని ప్రతిజ్ఞ చేసి కార్యాచరణలో చూపిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ మనకు ప్రాత:స్మరణీయుడు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు.

**నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు చంద్రబాబు, లోకేశ్ నివాళులు**

నేతాజీ సుభాష్ చంద్రబోస్ 29వ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబా బు నాయుడు విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ నివాళులు అర్పించారు. నేతాజీ పోరాట పటిమ దేశ పౌరుషానికి ప్రతీకగా నేటికీ చెప్పుకుంటున్నామని, స్వాతం త్ర్యం కోసం అవిశ్రాంతంగా పోరాడిన యో ధుడు నేతాజీ అంటూ ఎక్స్‌లో సీఎం, మంత్రి పోస్టు చేశారు.

## పిఠాపురాన్ని ఆదర్శ స్టేషన్‌గా అభివృద్ధి చేయండి

### ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్

- బీసీ మహిళలకు సబ్ కోటాలేని మహిళా బిల్లును మేం అంగీకరించం
- ఫిబ్రవరి మొదటి వారంలో వేలాది మంది మహిళలతో పార్లమెంటు ముట్టడిస్తాం
- బీసీ మహిళా సంఘం సమావేశంలో జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి సారించినట్లు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా కీలక వివరాలను వెల్లడించారు. కేంద్ర రైల్వే మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్‌ను కలిసినట్లు పేర్కొంటూ, రాష్ట్రంలోని పలు ముఖ్యమైన రైల్వే ప్రాజెక్టులపై చర్చించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్యంగా పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి, అలాగే రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం అంశాలపై చర్చ జరిగినట్లు పవన్ కళ్యాణ్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా భక్తులు సందర్శించే ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పిఠాపురాన్ని అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఒక ఆదర్శ స్టేషన్‌గా అభివృద్ధి చేయాలని తాను అభ్యర్థించినట్లు తెలిపారు. అలాగే రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని పీఎం గతి శక్తి కార్యక్రమం కింద చేపట్టాలని కోరినట్లు పేర్కొన్నారు.
ఈ చర్చలు సానుకూల, నిర్మాణాత్మక వాతావరణంలో జరిగాయని పవన్ కళ్యాణ్ తెలిపారు. ప్రతిపాదనలపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందించారని, వాటిని తగిన విధంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో భారతీయ రైల్వేలు బలమైన అభివృద్ధి లక్ష్యంతో ముందుకు సాగుతున్నాయని పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు. కాకినాడ జిల్లా సహా రాష్ట్రవ్యాప్తంగా రైల్వే అభివృద్ధికి అందిస్తున్న మద్దతుకు అశ్విని వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మరో కీలక సమావేశం గురించి కూడా పవన్ కళ్యాణ్ ఎక్స్‌లో వెల్లడించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ఆయన నివాసంలో సమావేశం జరిగిందని తెలిపారు. ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న సమస్యలు, ప్రజలకు పరిపాలనకు సంబంధించిన అనేక ముఖ్యమైన అంశాలపై సమగ్రంగా చర్చ జరిగినట్లు పేర్కొన్నారు.

ముఖ్యంగా ఉప్పాడ సముద్ర రక్షణ గోడకు సంబంధించిన ప్రతిపాదనను జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ సాంకేతిక సలహా కమిటీ ముందు సమర్పించేందుకు కాకినాడ జిల్లా పరిపాలనకు అవకాశం కల్పించినందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు పవన్ కళ్యాణ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## ఫేక్ న్యూస్ పెట్టే వారిపై కఠిన చర్యలు

- మంత్రి నారా లోకేష్ అధికారులకు ఆదేశం
- సుప్రీంకోర్టు గైడ్ లైన్స్‌ను పరిగణలోకి తీసుకుని మార్గదర్శకాలు
- వివిధ దేశాల్లో చట్టాలను పరిశీలించండి
- మంత్రుల బృందం సమావేశంలో కీలక నిర్ణయాలు..



**అమరావతి, జనవరి 28 :** నిర్ణీత వయసు కలిగిన మైనర్లను సోషల్ మీడియాకు దూరంగా ఉంచే విషయమై విధివిధానాలను రూపొందించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. చిన్నారులపై సోషల్ మీడియా నిషేధం విధించే అంశంపై సింగపూర్, ఆస్ట్రేలియా, మలేషియా, ఫ్రాన్స్‌లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని చెప్పారు. సోషల్ మీడియా జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడంపై బుధవారం సచివాలయంలో మంత్రి లోకేష్ అధ్యక్షతన మంత్రుల బృందం సమావేశం అయింది. చిన్నారులపై సోషల్ మీడియా నిషేధం విధించే అంశంపై సుప్రీంకోర్టు గైడ్ లైన్స్‌ను పరిగణలోకి తీసుకుని మార్గదర్శకాలు రూపొందించాలని అధికారులను కోరారు. చిన్నారులను సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలని మంత్రుల బృందం ఏకాభిప్రాయానికి వచ్చింది. అయితే ఎంత వయోపరిమితి విధించాలనే విషయమై వివిధ దేశాల్లో చట్టాలను పరిశీలించాల్సిందిగా మంత్రుల బృందం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. మలేషియాలో మై డిజిటల్ ఐడీ, పాస్‌పోర్టు వివరాలతో ఈ-కేవైసీ అనుసంధానం ద్వారా 16 సంవత్సరాలు పైబడిన వారికి మాత్రమే సోషల్ మీడియా యాక్సెస్ ఉందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఇక, సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ పోస్టు చేసే వారితో పాటు కులం, మతం, ప్రాంతం పేరుతో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే హెబిచ్యువల్ అఫెండర్స్(పదేపదే నేరాలకు పాల్పడే వారు)ను కట్టడి చేసేందుకు కఠిన చర్యలు చేపట్టాలని మంత్రి లోకేష్ అధికారులను ఆదేశించారు. దీనిపై చర్చించేందుకు గూగుల్, మెటా, ఎక్స్ వంటి సోషల్ మీడియా ప్లాట్ ఫాం కంప్లయన్స్ ఆఫీసర్లను కూడా వచ్చే జీవోఎం సమావేశానికి రప్పించాలన్నారు. సోషల్ మీడియాలో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసేవారిపై చర్యలు తీసుకునేందుకు సెక్షన్-46 ఐటీ యాక్ట్ ప్రకారం రాష్ట్రస్థాయి నిర్ధారణ అధికారి (అడ్జుడికేటింగ్ ఆఫీసర్) నియామకంపై నోటిఫికేషన్ విడుదల చేయాలని సమావేశంలో నిర్ణయం జరిగింది. కేంద్రప్రభుత్వ అధీనంలోని సహయోగ్ పోర్టల్ ద్వారా కొన్ని కేసుల విషయంలో చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు అధికారులు మంత్రుల బృందానికి తెలిపారు. ఇక, ఈ సమావేశంలో కంప్యూటర్ రిలేటెడ్ ఎఫెండర్స్, సైబర్ లా ఎఫెండర్స్ కట్టడి, సైబర్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటు తదితర అంశాలపై చర్చ జరిగింది.

## ఫిబ్రవరి 11 నుంచి బడ్జెట్ సమావేశాలు

- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ప్రభుత్వం షెడ్యూల్ ఖరారు
- సభలో ప్రవేశపెట్టనున్న మంత్రి పయ్యావుల కేశవ్
- ప్రభుత్వ విధానాలు, భవిష్యత్ ప్రణాళికలపై సీఎం కీలక ప్రసంగం




**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ప్రభుత్వం షెడ్యూల్ ఖరారు చేసింది. ఫిబ్రవరి 11వ తేదీ నుంచి ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం నుంచి అసెంబ్లీ వర్గాలకు బుధవారం అధికారిక సమాచారం అందింది. ఫిబ్రవరి 11వ తేదీ ఉదయం 10 గంటలకు రాష్ట్ర గవర్నర్ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. గవర్నర్ ప్రసంగంతో బడ్జెట్ సమావేశాలు అధికారికంగా ప్రారంభం కానున్నాయి.
ఫిబ్రవరి 12వ తేదీన గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టనున్నారు. అదే రోజు మొత్తం ఈ తీర్మానంపై సభ్యులు విస్తృతంగా చర్చ జరపనున్నారు. ఫిబ్రవరి 13వ తేదీన గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సభలో మాట్లాడనున్నారు. ప్రభుత్వ విధానాలు, భవిష్యత్ ప్రణాళికలపై సీఎం కీలక ప్రసంగం చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.
ఫిబ్రవరి 14వ తేదీన 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సభలో ప్రవేశపెట్టనున్నారు. అదే రోజున వ్యవసాయ బడ్జెట్‌ను మంత్రి అచ్చెన్నాయుడు ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుత సమాచారం ప్రకారం ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సుమారు నాలుగు వారాల పాటు, అంటే మార్చి 12వ తేదీ వరకు కొనసాగే అవకాశం ఉంది. ఈ సమావేశాల్లో కీలక బిల్లులు, విధాన నిర్ణయాలు, అభివృద్ధి అంశాలపై విస్తృత చర్చ జరగనుంది.

## ఘోర విమాన ప్రమాదం అజిత్ పవార్ దుర్మరణం

- బారమతిలో కూలిపోయి దగ్ధమైన లియర్ జెట్ 45 విమానం
- అజిత్ పవార్‌తో పాటు విమానంలోని మిగిలిన నలుగురు మృతి
- ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి రేవంత్ తదితర ప్రముఖుల సంతాపం



**ముంబై, జనవరి 28:**
మహారాష్ట్ర ఉపముఖ్య. మంత్రి, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అజిత్ పవార్ (66)బుధవారం నాడు ఉదయం బారామతి వద్ద విమాన ప్రమాదంలో హఠాన్మరణం పాలవడం అత్యంత విషాదకర ఘటన.మంచి రాజకీయ భవితవ్యం కలిగిన నాయకుడు ఘోర ప్రమాదానికి గురి కావడం ఒక బాధాకర పరిణామమైతే దేశంలో విమానయనం తరచూ విషాద భరితం కావడం మరొక ఆవేదనాభరితమైన అంశం.దేశీయ విమానయానాన్ని అందనంత ఎత్తులకు తీసుకుపోనున్నారని, 80-150 సీట్ల విమానాలను తయారు చేయబోతున్నామనే వార్తలు సంతోషం కలిగిస్తున్న తరుణంలో ఇటువంటి ప్రమాదాలు ముందుకు వెళుతున్నామో వెనుకకు పోతున్నామో తెలియని అయోమయాన్ని కలిగిస్తాయి.భద్రత లేని అభివృద్ధి నిష్ప్రయోజనకరం.
విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మరణించడాన్ని విశ్వసించలేకపోతున్నానని, తాను ఒక మంచి మిత్రుడిని కోల్పోయానని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ అన్నారు. నేడు (జనవరి 28) ప్రభుత్వ శలవు ఉంటుందని, పవార్ పట్ల గౌరవసూచకంగా మూడు రోజుల సంతాపదినాలుగా పాటించనున్నట్టు ఆయన ప్రకటించారు. ఆయనతో స్నిహితంగా పని చేసిన తర్వాత ఆయన లేరంటే నమ్మలేకపోతున్నానని, ఆయన లేని లోటు పూడ్చలేదని ఆయన అన్నారు. ఈ ప్రమాద విషయాన్ని తాను ప్రధాని మోడీకి, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు తెలియచేశానన్నారు. అలాగే, అజిత్ కుమారుడు పార్థ్ పవార్‌తోనూ, సోదరి సుప్రియా శూలేతోనూ మాట్లాడానని
చెప్పారు. ఈ విషాద క్షణాలలో మొత్తం రాష్ట్రం పవార్ కుటుంబానికి, అతడి ఎన్సీపీకి అండగా నిలుస్తుందన్నారు. రాష్ట్రానికి చెందిన పలువురు మంత్రులు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ సంతాపంః బారామతి విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మరణవార్త పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. అజిత్ పవార్ ప్రజా నాయకుడని, క్షేత్ర స్థాయితో ఆయనకున్న అనుబంధం గొప్పదని అభివర్ణించారు. ప్రజాసేవ పట్ల అజిత్‌కు ఉన్న నిబద్ధత ఎనలేదని, ఆయన పని తీరు, పాలనాపరమైన అవగాహన, సమాజంలోని బడుగువర్గాలను ఉద్ధరించేందుకు ఆయన చేసిన కృషి
ఎనలేనివని ప్రధాని అన్నారు. ఆయన హఠాన్మరణం, దిగ్భ్రాంతిని కలిగించిందని, అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు, ఆయన సన్నిహితులకు నా ప్రగాఢ సంతాపం, ఓం శాంతి అంటూ సామాజిక మాధ్యమం ఎక్స్ పై ఆయన పోస్ట్ చేశారు.

**మమత అనుమానాలు..**

మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అధిపతి అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మరణించాడన్న వార్తలు వెలువడగానే, సుప్రీం కోర్టు పర్యవేక్షణలో ఈ ఘటనపై కూలంకషమైన దర్యాప్తు జరిపించాలని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ డిమాండ్ చేశారు.ఈ విషాదం పట్ల దిగ్భ్రమను వ్యక్తం చేస్తూ, రాజకీయ నాయకులు సహా ఈ దేశ ప్రజల భద్రత గురించి ఆమె ఆందోళనలు వ్యక్తం చేశారు. కనీసం రాజకీయ నాయకులు కూడా భద్రత లేకుండా పోతోంది. ప్రతిపక్ష పార్టీ విషయమేమిటో అర్థం కావడం లేదని ఆమె అన్నారు. ఇటీవలి రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ, అజిత్ పవార్ అధికార బీజేపీ కూటమి తప్పుకోవాలనుకుంటున్నారని సూచించే వార్తలను సామాజిక మాధ్యమాలలో తాను చదివానని అన్నారు. ఈ ఘటన అత్యంత దురదృష్టకరమని పేర్కొంటూ, సుప్రీం కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని ఆమె అన్నారు. దర్యాప్తును ఏజెన్సీలకు అప్పగించకూడదని, ఎందుకంటే తన ఉద్దేశంలో వారు అమ్ముడు పోయారని ఆమె ఆరోపించారు. ప్రజలు విశ్వసించేందుకు మిగిలింది సుప్రీం కోర్టు పర్యవేక్షణే అని ఆమె అన్నారు. ఈ నేపథ్యంలో పారదర్శకత, జవాబుదారీ తనం అవసరాన్ని నొక్కి చెప్పారు.

**ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ:**

మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి శ్రీ అజిత్‌రావ్ పవార్‌జీ, ఆయన తోటి ప్రయాణీకులూ నేటి విమాన ప్రమాదంలో మరణించారన్న వార్త అత్యంత బాధాకరమైంది. ఈ విషాద సమయంలో మహారాష్ట్ర ప్రజలకు అండగా నిలబడుతున్నాను. ఈ సంక్లిష్ట సమయంలో మొత్తం పవార్ కుటుంబానికి, ఆయన సన్నిహితులకు సంతాపాన్ని తెలియచేస్తున్నాను అంటూ ఆయన సామాజిక
ఎక్స్‌పై హిందీలో పోస్ట్ చేశారు.

**కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే :**

విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మరణించడం దిగ్భ్రాంతికి గురి చేసింది. అత్యంత బాధకరమైన పరిణామమిది. సుదీర్ఘమైన రాజకీయ జీవితం మిగిలి ఉండగా ఒక నాయకుడు ఇలా వెళ్లిపోవడం విషాదకరం. ఆయన ఆత్మ శాంతితో ఉండుగాక అంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే సంతాపాన్ని వ్యక్తం చేశారు.
తెలంగాణ ముఖ్యమంత్రి :
అజిత్ పవార్ హఠాన్మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి ప్రయాణిస్తున్న విమానం బారామతిలో కుప్పకూలిందన్న వార్త తనను దిగ్భ్రమకు గురి చేసింది, క్లిష్ట సమయంలో కుటుంబానికి తన సంతాపాన్ని తెలియచేస్తున్నానని సామాజిక మాధ్యమం ఎక్స్‌పై ఆయన పోస్ట్ చేశారు.




మిగతా 2లో

# పోలీసుల అండతో కడపలో అర్ధరాత్రి అరాచకాలు

- గంజాయి బ్యాచ్‌ను పెంచి పోషిస్తున్న కడప ఎమ్మెల్యే అనుచరులు..
- అర్ధరాత్రి ఇల్లు కూల్చివేత సూత్రధారులు, పాత్రధారులు, గంజాయి బ్యాచ్ అందరిని అరెస్టు చేయాల్సిందే
- ఇల్లు కూల్చివేత స్థల పరిశీలనలో అఖిలపక్ష నేతలు..
- బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతి





**కడప, జనవరి 28, (వుదయం ప్రతినిధి)** కడపలో కొత్తగా అర్ధరాత్రి అరాచకాల గూండా గిరి సంస్కృతి మొదలైందని, కంది పాలెం దళిత కుటుంబం ఇల్లు కూల్చివేత కు కారకులైన గుండాగిరి అల్లరి మూకలను అందరిని కఠినంగా శిక్షించాల్సిందేనని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, మహాజనరాజ్యం పార్టీ సంగటి మనోహర్, ఎస్సీ ఎస్టీ రాయలసీమ హక్కులనేత జేవి రమణ, టిడిపి నేతలు జయచంద్ర, కొండా సుబ్బయ్య, వైసీపీ నేతలు సుబ్బరాయుడు, త్యాగరాజు , శ్యామ్‌సన్ లు డిమాండ్ చేశారు. బుధవారం ఎర్రముక్కపల్లె కంది పాలెం లో దళిత కుటుంబం శెల్వి భాస్కర్ ఇంటి కూల్చివేత ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం బాధిత కుటుంబంతో కలిసి అఖిలపక్ష నేతలు జిల్లా కలెక్టర్ శ్రీధర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరంలోని ఎర్రముక్కపల్లిలో అర్ధరాత్రి దారుణ ఘటనకు కడప ఎమ్మెల్యే అనుచరులు పోలీసుల కుమ్మక్కుతోనే జరిగిందన్నారు. రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే గుంటి ప్రసాద్ బామ్మర్ది కుటుంబానికి చెందిన ఈ ఇంటిని నేలమట్టం చేసిన దుండగుల అందరిని గుర్తించి అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ కు కూత వేటు దూరంలో మెయిన్ రోడ్డులో ఈ అమానుష ఘటనలో పాల్గొన్న దాదాపు వంద మంది అల్లరి మూకలు ఇంట్లో ఉన్న మహిళలు, పిల్లలు, వృద్ధులను బయటకు లాగి భాస్కర్, లక్ష్మీ చలపతి, భావిని దళిత కుటుంబానికి చెందిన ఇల్లు ధ్వంసం చేయడం దారుణమన్నారు. దొంగ రిజిస్ట్రేషన్లతో భూమి కబ్జా ప్రయత్నమని బాధితుల ఆరోపణ చేస్తున్నారని,ఇల్లు కూల్చడం వెనుక శ్యామ్ సుందర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, ద్వారకనాథరెడ్డి ఉన్నారని పరోక్షంగా కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, వారి భర్త టిడిపి నేత శ్రీనివాసుల రెడ్డి హస్తముందన్నారు. జిల్లా స్థాయి పోలీస్ యంత్రాంగం నిష్పక్షపాతంగా విచారించి ఈ అమానుష ఘటనకు కారకులైన సూత్రధారులను పాత్రధారులను కఠినంగా శిక్షించాలన్నారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం న్యాయం జరిగేటట్లు జిల్లా యంత్రాంగం స్పందించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి యస్ వెంకట శివ, సహాయ కార్యదర్శి మద్దిలేటి, లోకేశ్వర్ ,శ్రీకృష్ణ, అడ్వకేట్ అమీన్ పీరా, అంబేద్కర్ నేషనల్ కాంగ్రెస్ నేత వనం లోకేష్, సిపిఐ ప్రజాసంఘాల నాయకులు వీరశేఖర్ ,గంగా సురేష్, మల్లికార్జున, భాగ్యలక్ష్మి, మునయ్య, మధు, అరుణ, దళిత నాయకులు సుబ్బరామయ్య, హరికృష్ణ మాజీ కౌన్సిలర్ పుత్తుర్దీన్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థి ఉద్యమాలతోనే ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యం

- ఫిబ్రవరి 11, 12,13 న ఆర్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బైక్ జాత
- ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి. యం. ఓబులేసు యాదవ్

**కడప, జనవరి 28, (వుదయం ప్రతినిధి)** విద్యార్థి ఉద్యమాలతోనే ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యమని, అవిధంగా కడప ఉక్కు పరిశ్రమ, కడప బెంగళూరు రైల్వే లైన్, పులివెందుల మెడికల్ కళాశాల కోసం ఉద్యమించాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి. యం. ఓబులేసు యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం కడపలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో సమావేశం జరిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధి లో కీలకమైన కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం పూర్తైతే అప్పటి సామర్థ్యం ప్రకారం 10 వేల మందికి ఉద్యోగాలు, లక్ష మందికి ఉపాధి దొరుకుతుందని, ఇంకా దానికి అనుభందం గా కొన్ని వేల కుటుంబాలు బాగు పడతాయాన్నారు. ఈ ప్రాంతం పారిశ్రామి ఖంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అదేవిధంగా కడప బెంగళూరు రైల్వే లైన్ నిర్మాణం పూర్తైతే మెట్రో పాలిటన్ సిటీ అయినా బెంగళూరు కు రవాణా సులభతరం అయ్యి విద్యార్థులకు, ఉద్యోగులకు, వ్యాపారాలకు, ఇక్కడి వ్యవసాయ ఉత్పత్తులకు చాలా ఉపయోగ పడుతుంది, కానీ 2014 సం. కి పూర్తి కావాల్సిన రైల్వే లైన్ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికీ పూర్తి కాలేదు. అదేవిధంగా వైద్యం పరంగా ప్రాజలకు ఎంతో ముఖ్యమైంది, కానీ ప్రభుత్వం మెడికల్ కళా శాలలు ప్రయివేట్ చేయడం వలన వైద్యం ఖరీదై వైద్యం, వైద్య విద్య డబ్బున్న వాళ్ళకే అన్నట్లు అవుతుంది... ప్రభుత్వం వెంటనే వీటిపై స్పందించాలని బైక్ యాత్ర చేస్తున్నట్లు ప్రకటించారు..ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి, నగర అధ్యక్షులు బాలు విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు సమస్యను పరిష్కరించండి

**ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి**



**కడప, జనవరి 28, (వుదయం ప్రతినిధి)** 40 సంవత్సరాలుగా నడుస్తున్న రోడ్డును బడా బాబులు మింగేస్తున్నారని, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్ రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని కమీషనర్ ను కలిసి శివానంద పురం రోడ్డు సమస్యను పరిష్కరించాలని, తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నగరంలోని 15వ డివిజన్ శివానందపురం నందు 40 సంవత్సరాలుగా నడుస్తున్న రోడ్డును, కొంతమంది పెద్దలు ఇది మాది అని ఫెన్సింగ్ వేయుట కొరకు ఫోల్లను పాతారని, ఆయన తెలిపారు.ఊరు ఏర్పడింది మొదలు కొని ఈ రాస్తా ఉన్నదని, ఈ రస్తాపై అనేక సార్లు గ్రావెల్ తో రోడ్డులు వేశారాని, విద్యుత్తు స్తంభాలు, మంచినీటి పైపులైను, డ్రైనేజీ కాలువలు, మొదలైన వన్నీ ఏర్పాటు చేశారని, ఈ రహదారి ద్వారా సుమారు నూరు కుటుంబాలకు పైగా ప్రజలు తిరుగుతూ ఉంటారని, ఈ దారి అక్రమాలకు గురి అయితే నూరు కుటుంబాల వారికి దారి లేకుండా పోతుం దని, మున్సిపల్ అధికారులు దీనిపై సమగ్రమైన విచారణ జరిపి, అది పట్టాస్థలం అయినా కూడా, అవసరమైతే ప్రభుత్వం కొనుగోలు చేసి, రోడ్డును కొనసాగించాలని, ఆయన కోరారు. ఈ సమస్యపై అనేకసార్లు సంబంధిత మున్సిపల్, కలెక్టర్ అధికారులకు తెలియజేశామని అయినా సమస్యను పరిష్కరించలేదని, ఆ కారణం చేతనే బడా బాబులు రోడ్లను మింగేస్తున్నారని, ఈ సమస్యను సకాలంలో స్పందించకపోతే గ్రామస్తులతో కలసి కార్పొరేషన్ నందు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో, ఆర్ సి పి నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్, రవి, విజయ్, శివరాం, గ్రామస్తులు పాల్గొన్నారు.



## క్రీడాకారులకు ఎలాంటి కొదవ లేదు

- కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి
- ఏఏబి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన వైనం

**కావలి, జనవరి 28, వుదయం న్యూస్:** కావలి నియోజకవర్గంలో ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఎలాంటి కొదవ లేదని కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం కావలి పట్టణంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ మైదానంలో కావలి ఎంసిసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏఏబి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ను ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి, టాస్ వేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో కలిసి సరదాగా క్రికెట్ ఆడుతూ ఉత్సాహం నింపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మిత్రుల జ్ఞాపకార్థంగా ఇలాంటి క్రీడా టోర్నమెంట్ లను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ముగ్గురు మిత్రుల మరణానంతరం వారి స్మారకార్థంగా ప్రతి సంవత్సరం టోర్నమెంట్ నిర్వహించడం గొప్ప సంప్రదాయమని కొనియాడారు. మిత్రులను కోల్పోయినప్పటికీ వారి జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలిపేలా ఈ టోర్నమెంట్ నిర్వహించడం ఎంతో సంతోషకరమన్నారు.ఇటీవల అండర్–14 విభాగంలో కావలి నుంచి ఏడుగురు, అండర్–19లో ముగ్గురు రాష్ట్ర స్థాయిలో పాల్గొనడం గర్వకారణమన్నారు. విశాఖపట్నంలో జరిగిన పోటీల్లో కావలి పిల్లలు ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి వరకు వెళ్లడం ఆనందదాయకమని చెప్పారు. కావలిలో కోచింగ్ సదుపాయాలు అందుబాటులో ఉండి యువతకు శిక్షణ అందిస్తున్నారని, అలాగే గ్రామీణ ప్రాంతాల్లో గురువులు లేకపోయినా స్వయంగా సాధన చేసి అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్టుగా ఆటగాళ్లు రాణించడం ప్రశంసనీయమన్నారు. ఇటీవల కావలి స్టేడియంలో జరిగే మ్యాచ్‌లను వీక్షించేందుకు మూడు నుంచి నాలుగు వేల మంది ప్రేక్షకులు హాజరు కావడం ప్రజల్లో క్రీడల పట్ల ఉన్న ఆసక్తికి నిదర్శనమన్నారు. క్రీడాకారులు ఇంకా మరింత కృషి చేసి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కావలి పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబు రావు, వల్లేరి వెంకట కిరణ్, షేక్ హాజరత్, సుకుమార్, ఎల్లంటి వెంకటేశ్వరులు, ఆత్మకూరు నాగలక్ష్మి, మస్తాన్‌తో పాటు నిర్వాహకులు షేక్ ఇలియాజ్, అబ్దుల్ హాఫీజ్, నవీద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



## వెటర్నరీ కాలేజ్‌లో కిసాన్ మేళా

**ప్రొద్దుటూరు, జనవరి 28, (వుదయం ప్రతినిధి)** శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొద్దుటూరులోని పశువైద్య కళాశాలలో ఈ నెల 30న హైదరాబాద్ ఐసిఏఆర్ నేషనల్ మీట్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ స్పాన్సర్‌షిప్‌తో కిసాన్ మేళాను నిర్వహిస్తుందని కళాశాల అసోసియేట్ డీన్ శ్రీనివాస కుమార్, కన్వీనర్, కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ కె. రాజ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర పశువైద్య కళాశాల వైస్ ఛాన్సిలర్ జె.వి. రమణ, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, వెంకటేశ్వర పశువైద్య కళాశాల డైరెక్టర్ ఆఫ్ ఎక్స్ టెన్షన్ ప్రొఫెసర్ శోభామణి, గెస్ట్ ఆఫ్ హానర్ హైదరాబాద్ ఐసిఏఆర్ నేషనల్ మీట్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ బసవ రెడ్డి, ఉటుకూరు ప్రిన్సిపాల్ సైంటిస్ట్ ప్రభాకర్ రెడ్డి, కడప జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్, జిల్లా ఎస్సీ కార్పోరేషన్ ఎగ్జిక్యూటివ్ అండ్ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్యలక్ష్మి, జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి, జిల్లా డ్వామా పిడి ఆదిశేష రెడ్డి, జిల్లా ఏపి ఎంఐపి పిడి వెంకటేశ్వర రెడ్డి, జిల్లా ఉద్యానవన అధికారి సతీష్, జిల్లా సెరీ కల్చర్ అధికారి రామశివ దీక్షిత్ హాజరవుతారని వివరించారు. పశుపోషకులు, రైతులు పాల్గొని ఈ కిసాన్ మేళాలో పశువుల మేత, సమతుల్య ఆహారం, ఆధునిక యాజమాన్య పద్ధతులపై నిపుణుల ప్రసంగాలని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసిన ముస్లిం నాయకులు



**కడప, జనవరి 28, (వుదయం ప్రతినిధి)** మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసిన ముస్లిం స మైక్యా వేదిక రాష్ట్ర అధ్యక్షులు మరియు రాష్ట్ర కమిటీ సభ్యులు కలిసి గుంటూరు అంజిమన్ భూముల వ్యవహారానికి సంబంధించి భూములు కాపాడుకునే ప్రయత్నంలో భాగంగా బుధవారం మాజీ ముఖ్యమంత్రివర్యులు జగన్మోహన్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఆయన కూడా సానుకూలంగా స్పందించి మీ ఉద్యమానికి మా పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.అలాగే మా ప్రభుత్వం రాగానే జీవో ను తొలింగిస్తాము అని ప్రకటించారు. లీజు దారులకు హెచ్చరిక చేసినరూ ముస్లిం సమైక్యా వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు సర్దార్ అబ్దుల్ కలాం మౌల బేగ్ అజీజ్ నసీమా బేగం పాల్గొన్నారు.

## ఖాజీపేటలో యూరియా దోపిడీ



**ఖాజీపేట, జనవరి 28, (వుదయం ప్రతినిధి)** కడప జిల్లా మండల కేంద్రమైన ఖాజీపేట లో యూరియా ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తూ కొందరు వ్యాపారులు రైతులను నిస్సిగ్గుగా మోసం చేస్తున్నారు. ప్రభుత్వ ధర ప్రకారం బస్తాకు రూ.267 మాత్రమే వసూలు చేయాల్సి ఉండగా, అక్రమంగా రూ.400 వరకు వసూలు చేస్తూ రైతుల రక్తం మాంసాలు భుజిస్తున్నారు . ఈ దోపిడీపై రైతులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మౌనం వహిస్తే వ్యాపారుల అక్రమాలకు అడ్డుకట్ట ఎలా పడుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు కావున తక్షణమే సంబంధిత ఉన్నత అధికారులు స్పందించి తనిఖీలు చేపట్టి, అధిక ధరలకు యూరియా అమ్ముతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోకపోతే రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోతారని రైతులు హెచ్చరిస్తున్నారు రైతు లేనిదే రాజ్యం లేదు రైతు దేశానికి వెన్నెముక అనే మాటలు నీటి మూటలుగా మిగిలిపోతున్నాయని అవి చెప్పుకోవడానికే తప్ప క్షేత్రస్థాయిలో చూస్తే అందుకు పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని ఇటువంటి మాటలు పత్రికలకు పరిమితం కావడమే తప్ప ఆచరణ శూన్యమని రైతులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు మైదుకూరు ఎమ్మెల్యే రైతు బాంధవుడు అవినీతికి వ్యతిరేకి అయిన పుట్టా.సుధాకర్ యాదవ్ అవినీతి అంటే సహించేది లేదని పదేపదే చెబుతున్నా కూడా ఆయన మాటలను ఏమాత్రం లెక్కచేయకుండా తుంగలో తొక్కుతున్నారని రైతులు వాపోతున్నారు అవినీతి చేసిన వారు అధికారులు కావచ్చు మరి ఎవరైనా ఎంతటి వారైనా కావచ్చు అటువంటి వారిపై చర్యలు తప్పవని అనేకసార్లు చెబుతున్నా కూడా వారి ఆదేశాలు లెక్కచేయకుండా చెలరేగిపోతున్నారు కావున అధిక ధరలతో అమ్ముతున్న ఎరువులు యూరియా దుకాణ దారులపై చర్యలు తీసుకుని మళ్లీ ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.



## 650 మంది తిరుమల పాదయాత్ర

- ప్రతి సంవత్సరం భక్తి భావంతో దేవదేవుని దర్శనం ఆనందకరం
- ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

**ప్రొద్దుటూరు, జనవరి 28, (వుదయం ప్రతినిధి)** ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఈ సందర్భంగా స్థానిక టిటిడి కల్యాణ మండపం నుండి తిరుమలకు 5వ సారి ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాదాపు 650 మందిని ప్రొద్దుటూరు నుండి తిరుమలకు అన్ని సౌకర్యాలతో పాదయాత్ర గా తీసుకుని వెళ్ళి, దర్శన భాగ్యం కల్పించడం ప్రశంసనీయమన్నారు. ఈయనకు, ఈయన కుటుంబానికి దేవదేవుని ఆశీస్సులు వుండాలని ఆకాంక్షించారు. అనంతరం టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి మాట్లాడుతూ భక్తి భావంతో శివాలయం ఛైర్మన్ వంగల నారాయణరెడ్డి నిర్వహించే పాదయాత్ర ద్వారా ప్రతి సంవత్సరం భక్తి భావంతో ప్రజలు దేవదేవుని దర్శనం చేసుకోవడం ఆనందకరమన్నారు. అనంతరం ప్రొద్దుటూరు టిడిపి అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, అనంతరం కార్యక్రమ నిర్వాహకులు వంగల నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఈ పాదయాత్ర ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి ఆధ్వర్యంలో జరుగుతోందనివివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి నంద్యాల రాఘవ రెడ్డి, కౌన్సిలర్లు వంగనూరు మురళీధర్ రెడ్డి, జిలానీ, కొత్తపల్లి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రా రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, రాజుపాలెం మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వర రెడ్డి, నాయకులు నంద్యాల ఆనంద భార్గవ రెడ్డి, నంద్యాల హరినాథరెడ్డి, ఇ. వి. సుదాకర్ రెడ్డి, గంజికుంట ఆంజనేయులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అండర్ బ్రిడ్జి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలి

**కలెక్టర్‌కు సీపీఐ వినతి**



**కడప, జనవరి 28, (వుదయం ప్రతినిధి)** భాకరాపేట వైపు పెండింగ్ లో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి రోడ్డు నిర్మాణానికి అడ్డంకి గా ఉన్న సంబంధిత ఇళ్ల యజమానులకు నష్టపరిహారం చెల్లించి నిర్దిష్ట కాలపరిమితితో రైల్వే బ్రిడ్జి రోడ్డును వెంటనే పరిపూర్తి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ బంగ్లాలో బంగ్లాలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ కు సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, నగర కార్యదర్శి యన్.వెంకట శివ, నగర సౌత్ జోన్ సిపిఐ కార్యదర్శి పగడపూల మల్లికార్జున, హరికృష్ణ లు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గాలి చంద్ర మాట్లాడుతూ రైల్వే,రెవెన్యూ, కార్పొరేషన్, ఆర్ అండ్ బి అధికారుల సమన్వయ లోపంతో ఎర్రముక్కపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి పనులు సకాలంలో పూర్తికాక రాకపోకలకు జనం ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.కార్పొరేషన్ పరిధిలోని మూడు డివిజన్ ల ప్రజానీకం చింతకొమ్మదిన్నె పరిధిలోని పలు గ్రామాల ప్రజానీకం కడప నగరంలోకి ఈ బ్రిడ్జిరోడ్డు ద్వారానే రాకపోగాలు కొనసాగిస్తున్నారన్నారు. రైల్వే బ్రిడ్జి పనులు ప్రారంభించక ముందే రోడ్డు నిర్మాణానికి అడ్డంకి గా ఉన్న ఇళ్లను తగు నష్ట పరిహారం ఇచ్చి తొలగించాల్సిన సంబంధిత అధికార యంత్రాంగం నిర్లక్ష్యం స్థానిక ప్రజానీకానికి శాపంగా మారిందన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించి ఎర్రముక్కపల్లె రైల్వే అండర్ బ్రిడ్జి రోడ్డు నిర్మాణం పరిపూర్తికి సకాలంలో చిత్తశుద్ధితో కృషి చేయాలని వారు కోరారు. భూ సేకరణ ద్వారా సంబంధికులకు నష్టపరిహారం చెల్లించి వెంటనే రైల్వే బ్రిడ్జి రోడ్డు పరిపూర్తికి సంబంధిత ప్రక్రియ కొనసాగుతోందని బ్రిడ్జి రోడ్డు పరిపూర్తికి తగు చర్యలు వేగవంతంగా చేపట్టినట్లు కలెక్టర్ వివరించినట్లు వారు పేర్కొన్నారు.



## ఖాజీపేట టీడీపీ మండల అధ్యక్షుడిగా తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి

**శాలువా కప్పి పూలమాలలతో సత్కరించిన నంద్యాల బాలరాజు యాదవ్**

**ఖాజీపేట, జనవరి, 28, (వుదయం ప్రతినిధి)** కడప జిల్లా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి పై నమ్మకం ఉంచి రెండవసారి కూడ తననే ఖాజీపేట మండలానికి అధ్యక్షునిగా నియమించిన శుభ సందర్భంగా మంగళవారం రోజున ఖాజిపేట మండల పరిధిలోని పుల్లూరు పంచాయతీ రహమత్ ఖాన్ పల్లె గ్రామానికి చెందిన టిడిపి నాయకులు నంద్యాల బాలరాజు యాదవ్ ఆయనకు శాలువ కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా టిడిపి నాయకులు నంద్యాల. బాలరాజు యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ తిప్పిరెడ్డి.లక్ష్మిరెడ్డి పై నమ్మకం ఉంచి ఆయన మండల ప్రజలకు చేస్తున్న సేవలను దృష్టిలో పెట్టుకుని రెండవసారి కూడ మండల అధ్యక్షుని పదవిని కట్టబెట్టినందుకు చాలా సంతోషంగా ఆనందం గా ఉందని వారు కొనియాడారు కార్యక్రమంలో పుల్లూరు పంచాయతీ రహమత్ ఖాన్ పల్లె గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ యువ నాయకులు నంద్యాల. రవి యాదవ్ కృష్ణారెడ్డి జానకిరామ్ శ్రీరాములు రెడ్డి పాల్గొన్నారు.

## వైఎస్సార్సీపీ కడప జిల్లా యువజన విభాగ జాయింట్ సెక్రెటరీగా కుంట్లపల్లి వెంకటేశ్వర రెడ్డి నియామకం



**కడప, జనవరి 28, (వుదయం ప్రతినిధి)** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కుంట్లపల్లి వెంకటేశ్వర రెడ్డి ని వైయస్సార్ కడప జిల్లా యువజన విభాగం జాయింట్ సెక్రెటరీగా నియమించినందుకు వైయస్ఆర్సిపి కడప జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్ రెడ్డి ని కలిసి శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేసినందుకు కడప జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నన్ను గుర్తించి నియమించారు. మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని మనస్ఫూర్తిగా పార్టీ కోసం కష్టపడి పని చేస్తాను. మీ అందరి నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. ఎప్పటికీ మీ ఆశీస్సులు, మద్దతు ఇలాగే నాపై ఉండాలని కోరుకుంటున్నానాన్నరు. నిరంతరం పార్టీ అభివృద్ధికి పాటుపడుతానని తెలిపారు.

## సీఐ శ్రీరామ్ బదిలీ అక్రమార్కులకు సహకరించడానికే..

**బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా కార్యదర్శి, ప్రొద్దుటూరు ఇంచార్జ్ తీట్ల రవి కుమార్**



**ప్రొద్దుటూరు, జనవరి 28, (వుదయం ప్రతినిధి)** ప్రొద్దుటూరు పట్టణం లోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీరామ్ ని విధుల్లో చేరిన 40 రోజులు కూడా పూర్తికాకముందే బదిలీ చేయడం వెనుక ప్రజాహితం లేదని, ఇది కేవలం మద్యం వ్యాపారులు, సెటిల్మెంట్ నాయకులు, అక్రమ దందాలు చేసే వర్గాలకు మేలు చేయడానికే జరిగిన చర్యగా కనిపిస్తోందని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా కార్యదర్శి, ప్రొద్దుటూరు ఇంచార్జ్ తీట్ల రవి కుమార్ తీవ్రంగా విమర్శించారు. నిజాయితీగా, నిక్కచ్చిగా విధులు నిర్వర్తించే అధికారులను రాజకీయ ఒత్తిడితో బదిలీ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. శ్రీరామ్ బదిలీకి కారణమైన వారు అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని తెలిపారు.నిజాయితీగా పనిచేసే అధికారులకు బదిలీలు, సస్పెన్షన్లు సరైన పరిష్కారం కాదని స్పష్టం చేశారు. అలాంటి అధికారులను వేధించే వారు రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్య విలువలను గౌరవించని వారు రాజకీయాలను విడిచిపెట్టి నియంతృత్వ దేశాలకు వలస వెళ్లడం సమాజానికి మేలని ఈ సందర్భంగా ఆయన హితవు పలికారు.



## తీర గ్రామాల రక్షకునిలా కృష్ణారావు నిలిచారు

**ఎంవీ కృష్ణారావు సేవలు స్మరించుకున్న సొర్లగొంది గ్రామ మండలి అభిమానులు**

**అవనిగడ్డ జనవరి28 (వుదయం ప్రతినిధి):** ప్రకృతి విపత్తుల నిలయమైన దివిసీమలో తీర గ్రామాలకు రక్షకునిలా ఎంవీ కృష్ణారావు నిలిచారని సొర్లగొంది గ్రామ మండలి అభిమానులు స్మరించుకున్నారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, దివిసీమ పునర్నిర్మాత స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం వంతెన సెంటరులో ఎంవీ కృష్ణారావు విగ్రహానికి నాగాయలంక మండలం సొర్లగొంది గ్రామ మండలి అభిమానులు, కూటమి నాయకులు కారాణి రామ్ కుమార్, తమ్ము వెంకటేశ్వర రావు, కొక్కిలిగడ్డ నాగేశ్వరరావు, కారాణి వీర వెంకటేశ్వరరావు, సైకం వీరబాబు, కారాణి సరస్వతి, కారాణి నాగేశ్వరరావు, కారాణి నాగరాజు, రాజారావు, ఖాదర్ బాబు, తమ్ము మణి, కారాణి జాహ్నవి, సైకం వీరకుమారి, కారాణి ప్రసాద్, ఆదినారాయణ, జరాలు, కొక్కిలిగడ్డ వెంకట్రావు, కారాణి వెంకటేశ్వరమ్మ, కీర్తన, నాగరాజు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.మండలి వెంకట కృష్ణారావు శత జయంతి కమిటీ, గాంధీ క్షేత్రం కమిటీ, మండలి అభిమానుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, జనసేన ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, పీఏసీఎస్ చైర్మన్లు యలవర్తి చిన్నా, మాదివాడ రత్నారావు, యర్రంశెట్టి సుబ్బారావు, గాంధీ క్షేత్రం ప్రధాన కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, లంకమ్మ దేవస్థానం చైర్మన్ అన్నపరెడ్డి వెంకటస్వామి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మానేపల్లి కోటయ్య, గాంధేయవాది గరికపాటి సీతారామయ్య, ప్రముఖ న్యాయవాది బొప్పన వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు, కూటమి నాయకులు బండే రాఘవ, బచ్చు శ్రీహరి, దేగల రాఘవ, పులిగడ్డ బాలు శ్రీనివాస్, ఆకుల సీతామహాలక్ష్మి, డైరెక్టర్ వెంకటేశ్వరమ్మ, బాలమ్మ, కూనపరెడ్డి చంద్రశేఖర్, మండలి రామ్మోహనరావు, విశ్వనాధుని మురళీ మోహన్, కూనపరెడ్డి చంద్రశేఖర్, లుక్కా పిచ్చియ్య, చెన్ను గాంధీ, భోగాది బాలకృష్ణ, గుగ్గిలం శ్యాంకుమార్, షేక్ మొగల్ మురాద్ బేగ్, సోమిరెడ్డి, గుడివాక నరహరి, బచ్చు ఆదినారాయణ, యాసం శ్రీరాములు, మైలా హరిబాబు, వాహేదుల్లా తదితరులు పాల్గొన్నారు.

## నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

**ప్రొద్దుటూరు, జనవరి 28, (వుదయం ప్రతినిధి)** ఈనెల 29 గురువారం స్థానిక మునిసిపల్ కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ నందు సాధారణ సమావేశం నిర్వహిస్తున్నామని మునిసిపల్ ఛైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో అజెండా లోని 25 అంశాలపై ప్రధానంగా చర్చ జరుగుతుందని వివరించారు. కావున కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, అధికారులు, సిబ్బంది తప్పక హాజరు కావాలని సూచించారు.

## అమిన్ పీర్ దర్గాను దర్శించుకున్న సుమతి శతకం మూవీ టీం



**కడప, జనవరి 28, (వుదయం ప్రతినిధి)** ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం కడప అమీన్ పీర్ దర్గాను సుమతి శతకం మూవీ టీం చిత్ర యూనిట్ బుధవారం పెద్ద దర్గాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాలలో ఒకటైన కడప అమీన్ పీర్ పెద్ద దర్గాను దర్శించుకోవడం మా పూర్వజన్మ సుకృతమన్నారు. ఈ దర్గాను దర్శించుకోవడం వల్ల మనసుకు ప్రశాంతత కలిగిందన్నారు. ఈ దర్గాను దర్శించుకున్న వారు ఎంతో ప్రఖ్యాతగాంచారన్నారు. ముఖ్యంగా ఎంతో మంది సంగీత దర్శకులు సినీ నటులు డైరెక్టర్లు రాజకీయ నాయకులు ఎంతో మంది ప్రముఖులు ఇక్కడికి వచ్చి దర్శించుకోవడం వారి కోరికలు నెరవేరాయని తెలిసి మేము దర్శించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అమీన్ పీర్ పెద్ద దర్గా మేనేజర్ దగ్గరుండి ప్రార్థనలు చేయించారు.

## గ్రామస్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలి

**బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు సగిలి గుర్రప్ప**



**కడప, జనవరి 28, (వుదయం ప్రతినిధి)** బహుజన సమాజ్ పార్టీ మైదుకూరు అసెంబ్లీ కమిటీ సమావేశం మైదుకూరు స్థానిక బిఎస్పి కార్యాలయం జిల్లా ఇంచార్జ్ డీఎస్. జయరాం అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు సగిలి గుర్రప్ప, జిల్లా ఇన్చార్జి బాలచంద్ర హాజరై వారు మాట్లాడుతూ భారతదేశంలో 85శాతం గా ఉన్న బహుజన కులాలను పాలకులుగా చూడాలనే బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎన్నో కలలు కన్నారు కానీ ఈ మనువాద పాలకవర్గాలు బహుజన కులాలను ఎన్నికల అప్పుడు మందు బిర్యాని పైసలు ఆశ చూపించి అమ్ముడు పోయే సమాజంగా మార్చేశారు. ఈ అమ్ముడుపోయే సమాజం అందరి దగ్గర అన్ని చూసుకుంటూ ఒక్కొక్క సారి ఒక్కరికి బంధ పెడుతూ గద్దె దింపుతారు.రేపు అన్ని పార్టీల దగ్గర అన్ని తీసుకొని పార్టీలన్నిటికీ బొంద పెట్టి బహుజన సమాజ్ పార్టీని అధికారంలోకి తేవడానికి సిద్ధంగా ఉన్నారు. ఇద్దరి దగ్గర డబ్బులు తీసుకొని ఒకరికి మాట తప్పేవాడు రేపు ఇద్దరికి మాట తప్పడని గ్యారెంటీ లేదు ఇది కాన్షీరాం పని విధానం అని వారికి ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బేబీ, జిల్లా నాయకులు ఓబులేష్, అసెంబ్లీ అధ్యక్షులు రాజా, ఉపాధ్యక్షులు వీరయ్య, మహిళ కన్వీనర్ లావణ్య, కో కన్వీనర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మె లో వీఆర్ఏలు, ఆశ వర్కర్లు



**ఆత్మకూరు రూరల్ అనంతసాగరం (వుదయం ప్రతినిధి) జనవరి 28వ తేదీ** ముందస్తుగా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం మరియు ఆశ వర్కర్ల సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో అనంతసాగరం మండల తహసిల్దార్ గారికి సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ ల సంఘం అనంతసాగరం మండల అధ్యక్షులు చాపల రవి, వీఆర్ఏల సంఘం మండల నాయకులు మొహిద్దీన్ మరియు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అన్వర్ బాషా మరియు ఆశా వర్కర్స్ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి జ్యోతి ఈ కార్యక్రమంలో పాల్గొంటారు .

# ఎస్‌హెచ్‌జీ మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

- జ్యూట్ అండ్ కాటన్ బ్యాగ్స్, గిఫ్ట్ ఆర్టికల్స్, హెర్బల్ ప్రొడక్ట్స్ తయారీ విధానం పై శిక్షణ
- ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఐదు రోజులు పాటు శిక్షణా కార్యక్రమం
- హెర్బల్ ప్రొడక్ట్స్ తయారీ లో శిక్షణ పొందుతున్న 25 మంది ఎస్‌హెచ్‌జి మహిళలు
- ప్రారంభించిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సీ.కత్తిరేషన్



**విజయవాడ జనవరి 28 వుదయం న్యూస్ బ్యూరో :** ఎంపీ కేశినేని శివనాథ్ సారథ్యంలో కేశినేని ఫౌండేషన్ మరియు ఎన్.ఐ.ఆర్.డి సంయుక్త ఆధ్వర్యంలో జ్యూట్ అండ్ కాటన్ బ్యాగ్స్, గిఫ్ట్ ఆర్టికల్స్, హెర్బల్ ప్రొడక్ట్స్ తయారీ విధానం పై ఐదు రోజుల పాటు శిక్షణ పొందేందుకు హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డికి వెళ్లిన 50 మంది ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఎస్.హెచ్.జి మహిళలకు శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభం అయ్యాయి. 10వ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కు వెళ్లిన వీరికి జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఐదు రోజులు పాటు జ్యూట్ అండ్ కాటన్ బ్యాగ్స్ తయారీ విధానం పై శిక్షణ వుంటుంది. ఈమేరకు ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ ఐదు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం ప్రారంభ సమావేశం ఎన్.ఐ.ఆర్.డి.పి.ఆర్. లో బుధవారం అసోసియేట్ ప్రొపెసర్ (సి.ఐ.ఎ.టి.ఎస్.జె –హెడ్) డాక్టర్ సి.కత్తిరేషన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రమేష్ శక్తివేల్, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ మహ్మద్ ఖాన్ శిక్షణ తీసుకునే 50 మంది ఎస్.హెచ్.జి మహిళలకు ముందుగా జ్యూట్ అండ్ కాటన్ బ్యాగ్స్ , గిఫ్ట్ ఆర్టికల్స్, హెర్బల్ ప్రొడక్ట్స్ తయారీ విధానం శిక్షణ తరగతుల కార్యక్రమాల గురించి, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ అండ్ పంచాయతీ రాజ్ గురించి వివరించారు. జ్యూట్ అండ్ కాటన్ బ్యాగ్స్ , గిఫ్ట్ ఆర్టికల్స్ తయారీ శిక్షణను 25 మంది, హెర్బల్ ప్రొడక్ట్స్ తయారీ శిక్షణను 25 మంది తీసుకుంటున్నారు.

హెర్బల్ ప్రొడక్ట్స్ తయారీ లో శిక్షణ పొందే వారికి మొదటి రోజు శిక్షణలో భాగంగా ఆయుష్ పరిచయం , ఔషధ మొక్కల ఉత్పత్తుల ప్రాముఖ్యత , ఔషధ మొక్కల ఉత్పత్తుల పై అవగాహన, వాటి ప్రయోజనాలు, ఆర్గానిక్ సబ్బుల తయారీకి సంబంధించి దశలవారీ తయారీ విధానం, ఫెయిర్‌నెస్ ప్యాక్ తయారీ విధానం, వివిధ రకాలైన చర్మాల కోసం ఫార్ములేషన్ల కి సంబంధించి అవగాహన తరగతులతో పాటు ప్రాక్టికల్ గా కూడా చూపించటం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమం మెడిహెర్బ్స్ కి సంబంధించిన జాన్సీ లక్ష్మీ బాయి ఆధ్వర్యంలో జరిగింది.



### జ్యూట్ అండ్ కాటన్ బ్యాగ్స్, గిఫ్ట్ ఆర్టికల్స్

జ్యూట్ అండ్ కాటన్ బ్యాగ్స్, గిఫ్ట్ ఆర్టికల్స్ తయారీ లో శిక్షణ పొందే వారికి మొదటి రోజు శిక్షణలో భాగంగా జ్యూట్ క్రాఫ్టెడ్ ఉత్పత్తుల పరిచయం, జ్యూట్ క్రాఫ్టెడ్ ఉత్పత్తుల తయారీకి సంబంధించిన వివిధ ప్రక్రియలపై అవగాహన, భారతదేశంలోని జ్యూట్ హస్తకళా ఉత్పత్తులపై అవగాహన, జ్యూట్ బ్యాగ్స్ తయారీ కోసం ఉపయోగించే సాధనాలు, పరికరాల పరిచయం , ఫైబర్లు, నూలు రకాల ప్రాముఖ్యత, కుట్టు విధానంలోని వివిధ పద్దతులు, ఉత్పత్తి నాణ్యతకు అవసరమైన కనీస ప్రమాణాలు , కుట్టు యంత్రాల నిర్వహణకు మార్గదర్శకాలు, కుట్టు యంత్రంలోని వివిధ భాగాల విధులు, ప్రాథమిక కొలతల అవగాహన, ఫ్రేమ్‌ల వంటి పరికరాల వినియోగంపై ప్రదర్శన, ముడి పదార్థాల ఎంపిక పై అవగాహన తరగతులతో పాటు ప్రాక్టికల్ తరగతులు జరిగాయి. ఈ శిక్షణ కార్యక్రమం ఎథ్నిక్ క్లాత్ బ్యాగ్ యూనిట్ కి చెందిన డా. జి. అంబిక ఆధ్వర్యంలో జరిగింది. స్వయం ఉపాధి నెలకొల్పుకునేందుకు శిక్షణ కార్యక్రమంకు పంపించినందుకు ఎంపీ కేశినేని శివనాథ్ తో పాటు కేశినేని ఫౌండేషన్, ఎన్.ఐ.ఆర్.డికి శిక్షణ పొందుతున్న మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎస్సీ కార్పొరేషన్ రుణాలను మంజూరు చేయాలి

## కలెక్టర్ హేమావతి




**సిద్దిపేట, జనవరి 28 (వుదయం ప్రతినిధి)** ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించి, లబ్ధిదారులకు ఉపాధి మార్గాలను కల్పించాలని జిల్లా కలెక్టర్ కె. హేమావతి బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బ్యాంకర్లతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు పెండింగ్ దరఖాస్తులు: 2020–21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డైరీ ఫార్మ్ ఏర్పాటుతో పాటు ఇతర ఆర్థిక సహాయ పథకాలకు సంబంధించిన పలు దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లో ఉండటంపై కలెక్టర్ సమీక్షించారు. ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీతో కలిపి అందే ఈ రుణాల కోసం నిరుపేద లబ్ధిదారులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని, వారికి బ్యాంకర్లు చేయూతనివ్వాలని కోరారు. ముఖ్యంగా ఎస్బీఐ, యూబీఐ, టీజీబి బ్యాంకుల్లో ఎక్కువ దరఖాస్తులు ఉన్నాయని గుర్తించిన కలెక్టర్, ఆయా దరఖాస్తులను పునఃపరిశీలించి అర్హులైన వారికి వెంటనే రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఒకవేళ ఎవరైనా అనర్హులుగా తేలితే, అందుకు గల కారణాలను వారికి స్పష్టంగా వివరించాలని ఆదేశించారు. పేద ప్రజల ఆర్థికాభివృద్ధికి బ్యాంకులు అందించే సహకారం ఎంతో కీలకం. అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో రుణాలు అందేలా చూడాలి అన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడి విజయ్ భార్గవ్, ఎల్డిఎం హరిబాబు, వివిధ బ్యాంకుల రీజినల్ మేనేజర్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- సర్పంచ్ భవాని బాలకిషన్
- అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా సీమంతాలు, అన్నప్రాసన

**పాములపర్తి (మర్కుక్) జనవరి 28 (వుదయం ప్రతినిధి)** సిద్ధిపేట జిల్లా మర్కుక్ మండలం పాములపర్తి గ్రామంలోని 3వ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ దెబోరా రాణి, అంగన్‌వాడీ టీచర్లు సంతోష, సుజాత, జైబునీసా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సర్పంచ్ భవాని బాలకిషన్, ఉపసర్పంచ్ జుట్టు సుధాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గర్భిణీలు, బాలింతలు పోషకాహారం తీసుకోవడం వల్ల తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ పేర్కొన్నారు. చిరుధాన్యాల వినియోగం: ఆహారంలో చిరుధాన్యాలు, పప్పుదినుసులు, ఆకుకూరలు చేర్చుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని, బీపీ, షుగర్ వంటి వ్యాధులు దరిచేరవని సూచించారు. విధి నిర్వహణలో భాగంగా నూతన సర్పంచ్, ఉపసర్పంచ్‌లను అంగన్‌వాడీ టీచర్లు శాలువాలతో ఘనంగా సత్కరించారు. సీసీ ఉమ, ఉపాధ్యాయులు నర్సింలు, శ్రీనివాస్ రెడ్డి, హేమ, సుచిత, రమాదేవి, ఐకేపీ వీఓఏలు బాలమణి, రవళి, ఆయా మమత మరియు ప్రీస్కూల్ తల్లిదండ్రులు, గర్భిణీలు పాల్గొన్నారు.

## ఇద్దరు గిరిజన యువకుల మృతికి కారణమైన వారిపై

# ఎస్సీ , ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



**ఉదయగిరి రూరల్ వరికుంటపాడు (వుదయం ప్రతినిధి) జనవరి 28వ తేదీ** తూర్పు రొంపి దొడ్ల గ్రామంలో బాధితులను పరామర్శించిన కొప్పాల రఘు, కేసి. పెంచలయ్య (వరిగుంట పాడు మండల కేంద్రం) తూర్పు రొంపి దొడ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని బోణిగాలరావుపాడులో కంది చేను చుట్టు భూయజమాని నిర్లక్ష్యంగా ఏర్పాటు చేసిన అక్రమ విద్యుత్ షాక్ తో నిన్న ఆదివారం ఇద్దరు గిరిజన యువకులు ఐన మేకల గణేష్ (18), తలుపుల రమేష్ (18) అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలిసిన వెంటనే ఘటనపై స్పందించిన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ మాజీ సభ్యులు కొప్పాల రఘు, గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసి పెంచలయ్య వారి బృందంతో సోమవారం బాధిత రెండు కుటుంబాలను కలిసి పరామర్శించడం జరిగింది.ఈ మేరకు ఉదయగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట్రావును కలిసి బాధ్యత కుటుంబాలకు న్యాయం చేయాలని ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కింద యాడ్ చేసి క్వారీ యజమాని, ట్రాన్కో అధికారులపై కేసు నమోదు చేయాలని కోరడమైనది. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు చెంబెట్టి ఉష, తిరుపతి జిల్లా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు పుత్తూరు శ్రీనివాసులు, ఎర్రగుంట మాధవరావు, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్-న్యూజిలాండ్ టీ20 మ్యాచ్ వీక్షించిన ఏసీఏ అధ్యక్షుడు, సెక్రటరీ



**విజయవాడ జనవరి 28 వుదయం న్యూస్ బ్యూరో:** – వైజాగ్ ఏసీఏ–వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఐ.డి.ఎఫ్.సి ఫస్ట్ బ్యాంక్ టి–ట్వంటీసిరీస్ లో భాగంగా భారత్–న్యూజిలాండ్ మధ్య బుధవారం జరిగిన 4వ టీ–ట్వంటీ మ్యాచ్ ను ఏసీఏ సెక్రటరీ, రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు, వైస్ ప్రెసిడెంట్ బండారు నరసింహారావు, బిసిసిఐ అపెక్స్ కౌన్సిల్లో భారత క్రికెటర్ల సంఘం (ఐసీఏ) ప్రతినిధి చాముండేశ్వరినాథ్ లతో కలిసి ఏసీఏ అధ్యక్షుడు ఎంపీ కేశినేని శివనాథ్ వీక్షించారు. వీరికి ఏసీఏ అపెక్స్ సభ్యులు సాదర స్వాగతం పలికారు. మ్యాచ్ ప్రారంభానికి ముందు ఏసీఏ అపెక్స్ సభ్యులతో కలిసి ఏసీఏ ప్రెసిడెంట్ కేశినేని శివనాథ్, సెక్రటరీ సానా సతీష్ బాబు స్టేడియం లోపల, వెలుపల ఏర్పాట్లను క్షుణ్ణంగా పర్యవేక్షించారు. ప్రేక్షకులకు అవసరమైన తాగునీరు, శౌచాలయాలు, వైద్య సౌకర్యాలతోపాటు అగ్నిమాపక భద్రత వంటి కనీస వసతులు సరిగా ఉన్నాయా లేదా అని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.



# నిత్యావసర సరుకులు పంపిణీ

**ఆత్మకూరు రూరల్ (వుదయం ప్రతినిధి) జనవరి 28వ తేదీ** అప్పారావుపాలెం ఎస్సీ కాలనీకి చెందిన ధన్యాసి ఆనంద్ ఒక సంవత్సరం క్రితం పక్షవాతంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యారు. కుటుంబానికి ఆధారమైన ఆయనే ఇలా అశక్తుడవడంతో, ఆయన భార్య ధన్యాసి లక్ష్మమ్మ ఒక్కరే భర్తను చూసుకుంటూ, జీవన పోరాటాన్ని నిశ్శబ్దంగా. ధైర్యంగా.. కన్నీళ్లను లోపలే దాచుకుని కొనసాగిస్తున్నారు. ఈ బాధాకర పరిస్థితిని గ్రామానికి చెందిన వెంకటేష్ మరియు సాయి ద్వారా తెలుసుకున్న డాక్టర్ వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ప్రణీత్ , ఆలస్యం చేయకుండా మానవత్వంతో స్పందించి, ఆ పేద కుటుంబానికి మూడు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులను అందజేశారు.ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అప్పారావుపాలెం ఎస్సీ కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో హాజరై, డాక్టర్ ప్రణీత్ సేవా భావనకు, ట్రస్ట్ చేస్తున్న నిరంతర సేవలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఎస్సీ విద్యార్థుల ఉపకారవేతనాల కోసం ఆధార్ అనుసంధానం త్వరగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ ఆదేశం



**సిద్దిపేట, జనవరి 28 (వుదయం ప్రతినిధి)** అనుసూచిత కులాల (ఎస్సీ) సంక్షేమ వసతి గృహాలలో చదువుతున్న పదవ తరగతి లోపు విద్యార్థుల ఉపకారవేతనాలకు సంబంధించి, పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు ఆధార్ సంఖ్యను త్వరగా అనుసంధానించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సంక్షేమ మరియు విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న 863 మంది విద్యార్థుల ఉపకారవేతనాలు, వారి బ్యాంకు ఖాతాలకు ఆధార్ సంఖ్య జత చేయకపోవడం వల్లనే నిలిచిపోయాయని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు కలెక్టరేట్‌లోని జాతీయ సమాచార విజ్ఞాన కేంద్రంలో ప్రత్యేకంగా గణక యంత్రాలను (కంప్యూటర్లు) ఏర్పాటు చేశారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారులు వెంటనే సమన్వయం చేసుకొని విద్యార్థుల ఖాతాల ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి హమీద్ , ఇతర అధికారులు పాల్గొన్నారు.

# క్యాంపస్ డ్రైవ్‌లో విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

## యోగి వేమన విశ్వవిద్యాలయం




**కడప, జనవరి 28, (వుదయం ప్రతినిధి)** విద్యార్థులకు విద్యతోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా విశ్వవిద్యాలయం పనిచేస్తుందని యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాల ప్రిన్సిపాల్ టి. శ్రీనివాస్ అన్నారు. బుధవారం క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ ను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులు క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ లో పాల్గొనడం ద్వారా ఉద్యోగ నైపుణ్యాలు అలవడతాయన్నారు. విశ్వవిద్యాలయం కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్లేస్మెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయభారతి మాట్లాడుతూ విద్యార్థుల ప్రయోజనార్థం నిరంతరము క్యాంపస్ డ్రైవ్లు నిర్వహిస్తామన్నారు. 24/7.ఎఐ ఎంఎన్సి కంపెనీ ప్రతినిధి, సీనియర్ హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ ప్రణవ్ మాట్లాడుతూ కంపెనీ గురించి పరిచయం చేశారు. ఆర్గనైజేషన్లో చేరిన తర్వాత ఒక ఉద్యోగిగా ఎదగడానికి ఉన్న అవకాశాల గురించి కూలంకషంగా వివరించారు. రిలయన్స్ కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ క్యాంపస్ ప్లేస్మెంట్స్చక్కగా ఉపయోగించుకుని కెరీర్ కి బాటలు వేసుకోవాలని విద్యార్థులతో వివరంగా తెలిపారు. ఈ ప్లేస్మెంట్ డ్రైవ్ లో 144 మంది విద్యార్థులు పాల్గొనగా నెలకి రూ. 31 వేలు జీతం తో 10 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ అభినందించారు. ఈ కార్యక్రమం లో ప్లేస్మెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయభారతి పాల్గొన్నారు.



# రామవరం పాడు గ్రామంలో స్కూల్ గేట్‌కి తాళం

## స్కూల్ బయట రోడ్ పక్కన పిల్లలకు పాటలు చెపుతున్న ఉపాధ్యాయులు

**వీఆర్ పురం జనవరి 28 వుదయం న్యూస్ :** పోలవరం జిల్లా వి ఆర్ పురం మండలం రామవరం పాడు గ్రామంలో జిపిఎస్ పాఠశాల కు ఆ స్థలం ఇచ్చిన దాత పాఠశాల కు తాళం వేసినారు.స్కూల్ విద్యార్థులు అందరూ వేరే గచ్చింత్రం లేక చెట్టుకింద్ద క్లాసులు జరిగిస్తున్నారు.గతంలో ఇదే విధంగా జరిగింది అని విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.పాఠశాలకు వచ్చిన విద్యార్థులు తరగతి గదులు లేక రోడ్డు పక్కన కూర్చోవలసి వచ్చింది.ఎన్నో సంవత్సరాల నుండి ఈ విధముగా ఉంటే ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు అని ప్రజలు ఆలోచన అసలు ఇంత కాలం నుండి ప్రభుత్వం పాఠశాల కు స్థలం ఎందుకు తీసుకోలేదు ,

విద్యార్థులకు ఇలాంటి పరిస్థితి రావటానికి కారణం ఎవరు.పెద్దవాళ్ళు విభేదాలకు చిన్నారులు,విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం మరక రిపీట్ అవ్వకుండా ప్రభుత్వం విద్యార్థులకు స్థలం,మంచి స్కూల్ బిల్డింగ్ కట్టించి బావితరనికి మంచి పునాది వెయ్యాలి అని ఆ గ్రామ ప్రజలు ప్రభుత్వం ను కోరుచున్నాను.

# సాబీర్ ను పరామర్శించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



**ధర్మపురి,జనవరి 28(వుదయం ప్రతినిధి):** ధర్మపురి పట్టణానికి చెందిన తబ్లీఖ్ జమాత్ అమీర్ సాబీర్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కొప్పు ల ఈశ్వర్ బుధవారం వారిని పరామర్శించారు. గత కొన్ని రోజు లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సాబీర్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నారు.ఈ విషయం తెలియగానే మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ తో కలిసి ఆసుప త్రికి వెళ్లారు.ఈ సంద ర్భంగా సాబీర్ ఆరోగ్య పరిస్థితిని కొప్పుల ఈశ్వర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు.వారికి అందుతు న్న వైద్య సేవలను,కోలుకుంటున్న తీరును వైద్యులతో చర్చించారు. ఈ పరామ ర్శలో పలువురు స్థానిక నాయకు లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీలోకి చేరికలు

- 9వ వార్డు నుండి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ సమక్షంలో చేరిక
- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన మధూకర్

**మంథని, జనవరి 28 వుదయం ప్రతినిధి** మంథని మున్సిపల్ ఎన్నికల నగారా మోగిన వేళ, పట్టణంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. బుధవారం మంథని మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డుకు చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మంథని పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే నివాసం 'రాజగృహ'లో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు పుట్ట మధూకర్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. 9వ వార్డుకు చెందిన దాసరి మల్లేష్ (పుష్ప), పల్లె బాపు, పుల్ల రాజబాబు, చిప్ప వేణు, దాసరి నరేందర్ తదితరులు బీఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో చేరారు.మంథని అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం: పుట్ట మధూకర్ ఈ సందర్భంగా పుట్ట మధూకర్ మాట్లాడుతూ.. మంథని పట్టణ అభివృద్ధి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని, ప్రజలు మళ్లీ అభివృద్ధి వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. 9వ వార్డుతో పాటు మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. మంథని గడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, 9వ వార్డు కార్యకర్తలు మరియు ముఖ్య అనుచరులు పాల్గొన్నారు.





# 'చిన్న మేడారం' జాతరకు పోటెత్తిన భక్తులు



**వుదయం , సిద్దిపేట ప్రతినిధి, జనవరి** నంగునూరు మండలంలోని అక్కనపల్లి (ఆరెపల్లి) గ్రామంలో నిర్వహించనున్న శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతరకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఈ జాతరను స్థానికులు చిన్న మేడారం జాతరగా పిలుస్తుండగా, పరిసర గ్రామాలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. జాతర సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, బోనాలు, మొక్కులు చెల్లించే కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోగా, భక్తుల రద్దీతో గ్రామమంతా కోలాహలంగా మారింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ కమిటీ సభ్యులు, ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, విద్యుత్, పారిశుధ్య ఏర్పాట్లు కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ జాతరలో పాల్గొనడం వల్ల అమ్మవారి కటాక్షం లభించి కుటుంబాలకు శుభఫలితాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తూ పెద్ద ఎత్తున హాజరవుతున్నారు.






# గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు

## దేవదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్

**జగిత్యాల జనవరి 28 (వుదయం ప్రతినిధి)** 2027 లో గోదావరి పుష్కరాలు జరుగనున్న నేపథ్యంలో పుష్కరాలను పకడ్బందీగా నిర్వహించే క్రమంలో బుధవారం జిల్లా కలెక్టర్లు సంబందిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు జగిత్యాల జిల్లా నుండి జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ పాల్గొన్నారు ఈ సందర్భంగా దేవదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్ మాట్లాడుతూ తెలంగాణలో 2027 లో జరగబోయే గోదావరి పుష్కరాలకు సంబంధించి గోదావరి ప్రవహించే జిల్లాల్లో పుష్కరాలకు సంబందించిన ఏర్పాట్లలో భాగంగా పుష్కర ప్రదేశాలను టైర్ 1, టైర్ 2 , టైర్ – 3 లుగా విభజించి వాటికనుగుణంగా వ్యూహాత్మక ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు చేపట్టబోయే పనులు సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు గోదావరి పుష్కరాలకు లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలని కోరారు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి రాజ గౌడ్ ఆర్డీవో మధు సూదన్ ఈఈపీఆర్ ఈ ఈ ఆర్ అండ్బీర్ ఈఆర్డబ్ల్యూఎస్ ధర్మపురి ఆలయ ఈవో కలెక్టరేట్ ఏవో తదితరులు పాల్గొన్నారు

# మున్సిపల్ పోరుకు గులాబీ శ్రేణుల సమరోత్సాహం

- అభ్యర్థుల పేర్లను ఖరారు చేసిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- వార్డుల వారీగా ఇంచార్జ్‌ల నియామకం
- బీఆర్ ఎస్ గెలుపే లక్ష్యంగా వ్యూహరచన



**ధర్మపురి, జనవరి 28 (వుదయం ప్రతినిధి):** ధర్మపురి మున్సిపాలిటీ ఎన్నికల నగారా మోగడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. బుధవారం పట్టణంలో బీఆర్ ఎస్ పార్టీ నిర్వహించిన కీలక సమావేశంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మున్సిపాలిటీ ఇంచార్జ్ రఘువీర్ సింగ్‌లు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను నాయకు లు అధికారికంగా ఖరారు చేశారు.రాబోయే ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పార్టీ నాయక త్వం,గెలుపు గుర్రాలకే ప్రాధాన్యం ఇచ్చింది.ఖరారు చేసిన అభ్యర్థు ల్లో కొందరు అప్పుడే తమ నామి నేషన్లను దాఖలు చేసి ప్రచార పర్వానికి సిద్ధమయ్యారు. ప్రతి ఓటరును ప్రసన్నం చేసుకునేలా వార్డుల వారీగా ప్రత్యేక ఇంచా ర్జులను నియమించారు. నియోజకవర్గ స్థాయిలోని ముఖ్య నాయ కులకు ఆయా వార్డుల పర్యవేక్షణ బాధ్యతలను అప్పగిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు.ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ ధర్మపురి అభి వృద్ధికి కట్టుబడి ఉన్న బలమైన స్థానిక నాయకత్వాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యం అని,క్షేత్రస్థా యిలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు అహర్నిశలు కృషి చేయాలి. సమన్వయంతో ముందుకు సాగి అఖండ విజయా న్ని సాధించాలి అని పిలుపుని చ్చారు.సమావేశం అనంతరం పోటీ చేస్తున్న అభ్యర్థులకు నాయకులు శుభాకాంక్షలు తెలుపుతూ, విజయ దుందుభి మోగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ మున్సి పల్ చైర్మన్ సంగి.సత్తెమ్మ, మాజీ ఎంఎంసి చైర్మన్ అయ్యోరి. రాజేష్, వైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు మురికి.శ్రీనివాస్, నాయకులు,కార్య కర్తలు పాల్గొన్నారు.



నేను రెండవ సారి అమెరికా అధ్యక్షపదవి స్వీకరించి నిన్నటితో ఏడాది నిండింది. వైట్ హౌస్ కి తిరిగి వచ్చి నేటితో 12 మాసాలు గడిచింది. ఈ రోజున అమెరికా ఆర్థిక వ్యవస్థ ప్రకాశవంతంగా ఉన్నది. వృద్ధి ఘనంగా పుంజుకుంటున్నది. ఉత్పత్తి పెరుగుతున్నది. పెట్టుబడిపై మెట్టులో ఉన్నది. ద్రవ్యోల్బణం తోకముడిచింది. గతంలో తెరుచుకొని ఉన్న మన సరిహద్దు ఇప్పుడు ఇతరులకు దుర్భేద్యంగా మారింది. అమెరికా ఇప్పుడు తన చరిత్రలోనే ఎన్నడూలేని విధంగా అత్యంత వేగవంతమైన వృద్ధి వికాసం మధ్యలో ఉన్నది. బైడెన్ పాలనలో దేశం తక్కువ వృద్ధి, ఎక్కువ ద్రవ్యోల్బణంలో కొట్టుమిట్టాడింది.

దావోస్‌లో ట్రంప్ (21 జనవరి 2026)

## వేమన పద్యం

పెట్టిపోయలేని వట్టినరులు భూమి
పుట్టనేమి వారు గిట్టనేమి
పుట్టలోన జెదలు పుట్టవా? గిట్టవా?
విశ్వదాభిరామ వినురవేమ.



## సంపాదకీయం

# విమానమెక్కితే అంతేనా?

మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి, మహారాష్ట్ర అధికార నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అజిత్ పవార్ (66) మృతి దిగ్భ్రాంతికరం. బుధవారం నాడు ఉదయం బారామతి వద్ద సంభవించిన విమాన ప్రమాదంలో హఠాన్మరణం పాలు కావడం అత్యంత విషాదకర ఘటన. మంచి రాజకీయ భవితవ్యం కలిగిన నాయకుడు ఘోర ప్రమాదానికి గురి కావడం ఒక బాధాకర పరిణామమైతే దేశంలో విమానయానం తరచూ విషాద భరితం కావడం మరొక ఆవేదనాభరితమైన అంశం. దేశీయ విమానయానాన్ని అందనంత ఎత్తులకు తీసుకుపోతున్నామని, 80150 సీట్ల విమానాలను తయారు చేయబోతున్నామనే వార్తలు సంతోషం కలిగిస్తున్న తరుణంలో ఇటువంటి ప్రమాదాలు ముందుకు వెళుతున్నామో వెనుకకు పోతున్నామో తెలియని అయోమయాన్ని సృష్టిస్తాయి. భద్రత లేని అభివృద్ధి నిష్ప్రయోజనకరం. బుధవారం ఉదయం 8.48 గంటలకు విమానం బారామతి విమానాశ్రయంలో దిగడానికి ముందు కమ్ముకున్న పొగమంచులో రన్‌వేని పైలట్ గుర్తించలేకపోవడం వల్ల ప్రమాదం జరిగినట్టు చెబుతున్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రి వై ఎస్ రాజశేఖర రెడ్డి ప్రాణాలు తీసిన విమాన ప్రమాదం గుర్తుకు రావడం సహజం.

ఇటీవల రాజకీయనేతలను బలి తీసుకొంటున్న విమాన ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. విమాన ప్రమాదాలను అదుపు చేయడంలో మన వైఫల్యాన్ని అంగీకరించి తీరాలి. దేశ ఆర్థికరాజధాని ముంబై ముఖ్యనగరంగా ఉన్న మహారాష్ట్ర కు గల ప్రాధాన్యం వివరించనక్కరలేదు. ప్రధాన పక్షాలు శివసేన, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్ సి పి )లు చీలిపోయిన తర్వాత అక్కడ అజిత్ పవార్ ప్రాధాన్యం విశేషంగా పెరిగింది. శరద్ పవార్ చాటు నాయకుడుగా కాకుండా స్వతంత్రంగా చక్రం తిప్పగల నేతగా నిరూపించుకొన్నారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కు సన్నిహితుడుగా చెబుతున్న అజిత్ మరణం ఆ వర్గానికి నష్టదాయకమని అంటున్నారు. ఇప్పుడిక మాజీ ముఖ్యమంత్రి షిండే వర్గానిది పైచేయి అవుతుందని భావిస్తున్నారు. అలాగే రెండు ఎన్ సి పి వర్గాల విలీనాన్ని అజిత్ మరణం ప్రభావితం చేస్తుంది. అజిత్ పవార్ మరణం వెనుక రాజకీయ కుట్ర ఉందని, సుప్రీం స్వతంత్ర విచారణ జరపాలని ప్రభుత్వ దర్యాప్తు సంస్థల మీద తమకు నమ్మకం లేదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ విమర్శించారు. అదేమైనప్పటికీ తరచూ విలువైన ప్రాణాలు బలితీసుకొంటున్న విమాన ప్రమాదాల జోరుకు అడ్డుకట్ట వేయాలి.

### రచనలు పంపండి

ఉదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలు పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

## భారత పత్రిక రంగ పితామహుడు
# జేమ్స్ అగస్టస్ హిక్కీ

ఉదయం తలుపులు తెరవగానే వార్తాపత్రిక శుభోదయం అంటూ ముడిచుకుపోయి పలకరిస్తుంది. ప్రతి రోజు ఉదయం వార్తల విందును వడ్డిస్తుంది. దినపత్రిక చూడని రోజు ఏదో తెలియని వెలితి వెంటాడుతుంది. వార్తాపత్రిక రాని వేళ మనసు నిలవదు, దినచర్య సజావుగా సాగదు. కాఫీ చప్పరిస్తూ పేపర్ చదివితే ఆ మజానే వేరు. దినపత్రిక ఉషోదయాన చదవడమనే అలవాటు ఉన్న వారు ఎందరో. ప్రజాస్వామ్య సౌధానికి, పార్లమెంటరీ వ్యవస్థకు 4వ పిల్లర్‌గా పిలువబడే మీడియా నేడు పలు సవాళ్లను ఎదుర్కొంటున్నది. ఇలాంటి పలు రకాల మీడియాల్లో వార్తాపత్రికలు ప్రముఖంగా నిలబడుతూ ప్రతి దినం ప్రపంచ వార్తలను మన కళ్ల ముందు ఉంచుతాయి. దేశ గళాలుగా పత్రికలు నిలుస్తున్నాయి. ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య పటిష్టమైన వారధిగా పత్రికలు సేవలు చేస్తున్నాయి. అవినీతిని బయట పెట్టడం, అక్రమార్కుల భరతం పట్టడం, సమ్మిళిత అభివృద్ధికి ఉత్ప్రేరకంగా నిలవడం, పేదల పక్షాన నిలబడి పోరాడడం లాంటి ప్రధాన కర్తవ్యాలను నిర్వహిస్తున్న వార్తాపత్రికల మనుగడను నేటి డిజిటల్ సాంకేతిక వేదికలు మసకబార్చుతున్నాయి. భావ ప్రకటన స్వేచ్ఛకు ప్రతిరూపంగా వార్తాపత్రికలు నిలవాలి. నేటి ఆధునిక భారతంలో వార్తాపత్రికలు ప్రభుత్వాలకు వంత పలకడం, ఏదో ఒక పక్షాల నిలిచి వార్తలను తమకు అనుకూలంగా రాయడం లాంటి పోకడలతో ప్రజల్లో వార్తాపత్రికల మీద ఉన్న సదాభిప్రాయాన్ని సన్నగిల్లేలా చేస్తున్నానే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. విలువలతో కూడిన నిష్పక్షపాత వార్తలను అందించే పత్రికలు రోజు రోజుకు తగ్గుతున్నాయనే అభిప్రాయం కూడా క్రమంగా బలపడుతున్నదని నిపుణులు, విశ్లేషకులు వాపోతున్నారు.

**భారత తొలి వార్తాపత్రిక 'హిక్కీస్ బెంగాల్ గెజిట్':**

మానవాళి ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, సామాజిక న్యాయాలు, ప్రభుత్వ పాలనలో మంచి చెడ్డలు, పౌరసమాజాన్ని జాగ్రుత పరచడం, పౌరులకు అవసర సమాచార వితరణ లాంటి ప్రధాన భూమికలు నిర్వహిస్తున్న నేటి వార్తాపత్రిక ప్రాధాన్యాన్ని ప్రచారం చేయడంతో పాటు జర్నలిస్టులు, ఎడిటర్లు, పబ్లిషర్ల అమూల్య సేవలను ప్రస్తుతించడానికి ప్రతి ఏట 29 జనవరి రోజున మన దేశంలో "భారతీయ వార్తాపత్రికల దినోత్సవం(ఇండియన్ న్యూస్ పేపర్స్ డే)" నిర్వహించుట ఆనవాయితీగా మారింది. భారత దేశంలో తొలిసారి జేమ్స్ ఆగస్టస్ హెక్కీ నాయకత్వంలో "హిక్కీస్ బెంగాల్ గెజిట్" అనే వారపత్రిక కలకత్తా నుంచి 29 జనవరి 1780న వెలువడింది. ఈ వార్తాపత్రిక నిష్పక్షపాతంగా, నిక్కచ్చిగా వార్తలను ప్రజలకు చేర్చడంతో భయపడిన నాటి బ్రిటీష్ ప్రభుత్వం 1782లో దానిని రద్దు చేయడం కూడా జరిగింది. భారతీయ వార్తాపత్రికల దినోత్సవం2026 ఇతివృత్తంగా "సాధికారత, విషయ చైతన్యం కలిగిన సమాజం కోసం విశ్వసనీయమైన జర్నలిజం" అనబడే అంశాన్ని తీసుకోవడం ద్వారా దాని ప్రాముఖ్యతను తెలియజేసినట్లు అవుతున్నది.

# 'స్వీట్ స్పాట్' లో బడ్జెట్ 2026-27

ఆర్థిక మంత్రి ముందున్నది సవాలేనా? రానున్న ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టనున్నారు. స్థూల ఆర్థిక నేపథ్యంలో ప్రవేశపెట్టనున్న ఈ బడ్జెట్ ప్రపంచానికి అసూయను కలిగించనుంది. ఐఎంఎఫ్ వంటి అగ్ర సంస్థలు భారత వృద్ధి రేటును ఊర్ధ్వగతికి సవరించాయి. త్రైమాసిక జీడీపీ గణాంకాలు కూడా ఊర్ధ్వగతినే సూచిస్తున్నాయి. పైగా ద్రవ్యోల్బణం అతి తక్కువ స్థాయిలకు పడిపోయింది. కాగా, ఆర్‌బిఐకి సౌకర్యవంతంగా ఉండే స్థాయికన్నా తగ్గడం గమనార్హం. ఈ రకంగా అధిక వృద్ధి, తక్కువ ద్రవ్యోల్బణాన్ని గోల్డిలాక్స్ఆ ర్థికశాస్త్ర నమూనాలో స్వీట్ స్పాట్ అంటారు. స్థూల ఆర్థిక నిర్వహణ అన్నది బానే ఉంది, ఈ గమనాన్ని పరిరక్షించవలసిన బాధ్యత విధానానిదే అన్న భావనకు రావడమే స్వీట్ స్పాట్ అన్న దానికి అర్థం. అయితే, దీనిని మరింత జాగ్రత్తగా పరిశీలించవలసి ఉంది. శీర్షికలలో వచ్చే గణాంకాలు తప్పు కాదు కానీ, వాటిని ఉత్పత్తి చేస్తున్న శక్తులు అసమతులంగా, తిరిగి మారే సంభావ్యత ఉండి, కలుపుకుపోయే సమృద్ధికి దారి తీయనప్పుడు పరిస్థితి తిరగబడుతుంది. ప్రస్తుతం లభించిన అవకాశాన్ని ఆర్థిక వ్యవస్థ పునాదులను బలోపేతం చేసేందుకు బడ్జెట్ ప్రయత్నించాలి.

మొదటగా అర్థం చేసుకోవలసిన విషయం తక్కువ ద్రవ్యోల్బణం లేదా స్వల్ప ద్రవ్యోల్బణం. అక్టోబర్ 2025లో ద్రవ్యోల్బణం 0.25శాతంగా నమోదైంది. దీనికి కారణం ఆహార ధరలని చెప్పుకోవచ్చు. అక్టోబరు 2024లో ద్విసంఖ్యలో ఉన్న ద్రవ్యోల్బణం ఒక ఏడాది తర్వాత ప్రతిద్రవ్యోల్బణంతో, 5శాతం ప్రతికూలంగా మారింది. వినిమయ ధరల సూచీ (సిపిఐ) బాస్కెట్ లో ఆహారానికి అధిక ప్రాముఖ్యత ఉంది. ఆహార ద్రవ్యోల్బణంపై వినిమయ వాస్తవికత ఆధిపత్యం వహిస్తుంది. ఆహారం, ఇంధనం ఆవల మూల ద్రవ్యోల్బణం దాదాపు 4 శాతంగా నిలిచి తగ్గడం లేదు. స్వల్ప సిపిఐ ద్రవ్యోల్బణం అన్నది వ్యవసాయ ధరల చక్రం గురించి చెప్తుంది. సరఫరా పరిస్థితులు, అంతర్గతంగా ఉన్న బలహీనమైన డిమాండ్ ఈ చక్రంలో ఉన్నాయి.

అందుకే విత్త విధానంపై చర్చలో అసాధారణమైన జాగ్రత్త కనిపిస్తోందే తప్ప ఉత్సాహం లేదు. అధిక వృద్ధి చెందుతున్న దేశానికి అతి తక్కువ ద్రవ్యోల్బణం అనేది మంచిది కాదని ఆర్‌బిఐ విత్త విధాన కమిటీ సభ్యుడు ఒకరు వాదించారు. ఎందుకంటే, అది బలహీనమైన డిమాండ్ కు చిహ్నమని ఆయన అన్నారు. ఈ హెచ్చరిక విత్త విధాన కల్పనలో కూడా అప్రమత్తతను కలిగి ఉండాలని సూచిస్తోంది. ప్రధానంగా వ్యవసాయ ధరలు పడిపోవడం లేదా స్తంభించడం కారణంగా ఏర్పడిన తక్కువ ద్రవ్యోల్బణం అలా శాశ్వతంగా ఉంటుందని చెప్పలేం. ఎందుకంటే, ఈ ధరలు తిరిగి పెరగవచ్చు. గ్రామీణ వేతనాలు, దుర్బలమైన డిమాండ్ ఇక రెండవ అంశం వ్యవసాయంలో వేతనాలకు సంబంధించింది. ఆహారంలో ప్రతిద్రవ్యోల్బణం సిపిఐని తగ్గిస్తుంది, కానీ రైతుల ఆదాయాలను కూడా కుదిస్తుంది. కనుక, తక్కువ ఆహార ద్రవ్యోల్బణం అనేది గ్రామీణ దుస్థితితో కలిసి ఉంటుంది. ఎందుకంటే, ఆహారాన్ని ఉత్పత్తి చేసేవారు ఎక్కువ ప్రయోజనాన్ని పొందలేరు. ఇది బడ్జెట్‌కు సహేతుకమైన అంశం అవుతుంది. ఎందుకంటే, అధిక వృద్ధిపై విశ్వసనీయత అనేది విస్తృమైన డిమాండ్‌పై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ గ్రామీణ ఆదాయాలు, వేతనాలు స్తంభిస్తే,



వినిమయం దుర్బలంగా మిగులుతుంది. ఒకవేళ వినిమయం దుర్బలంగా ఉంటే, ప్రైవేటు పెట్టుబడులు పెరగడానికి ఆస్కారముండదు. ప్రస్తుత క్షణంలో ఉన్న పరిస్థితిని గురించి, స్థూల సుస్థిరతను సాధించామని సులువుగా చెప్పడం సరికాదు. దీనిని వృద్ధి ప్రక్రియ అసమతులంగా ఉందనేందుకు ఒక సంకేతంగా భావించాలి. అంటే, కొన్ని రంగాలలో బలంగా, కొన్నింటిలో బలహీనంగా ఉందనేందుకు సంకేతంగా భావించాలి. గ్రామీణ వేతనాల వృద్ధి దుర్బలంగా సాగడం అన్నది ముఖ్యమైన హెచ్చరిక,ఒక ఆందోళనగా పరిగణించాలి. గ్రామీణ వేతన సరళుల విశ్లేషణ చూసినప్పుడు గత కొన్ని సంవత్సరాలుగా గ్రామీణ వేతనాలు అతి స్వల్పంగా పెరిగాయి, కానీ వాస్తవ వేతనాలు సుదీర్ఘకాలం పాటు యధాతథంగా ఉండటమో లేదా ప్రతికూలంగా ఉండటమో జరిగాయి. ఆహార ధరలు 2023- 24లో వేగంగా పెరిగినప్పుడు, అవి నామమాత్రపు వేతనాలలో స్వల్ప వృద్ధిని తినేసి, వాస్తవ వేతనాలు యధాతథంగా కొనసాగేలా చేశాయి. గ్రామీణ వేతనాలలో ప్రతిస్తంభన అన్నది కోవిడ్ కాలం కన్నా కొన్ని సంవత్సరాల ముందు నుంచీ కొనసాగుతోంది. దీనికి రెండు కారణాలు ఉండవచ్చు. మొదటగా, కార్మికుల సరఫరా విస్తృతమైంది, మహిళా కార్మిక వర్గం కూడా ఇందులో భాగస్వాములయ్యారు. ఇది కూడా గ్రామీణ దుస్థితి కారణంగాను, కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవడానికీ జరిగింది. ఎన్‌ఆర్‌ఇజిఎలో కల్పించే ఉపాధిలో 57 శాతం మంది మహిళలు ఉన్నారు. రెండవది, ఇటీవలి కాలంలో జరిగిన భారత వృద్ధి తక్కువ మానవ శ్రమ కారణంగా జరిగింది. మూలధన వ్యయం కారణంగా వేగవంతమైన వృద్ధి కనిపించినా, అది ముఖ్యంగా ప్రభుత్వ రంగ సంస్థలలో జరిగింది. ఉపాధి పెరుగుదల, వేతన బేరసారాలు చేసే శక్తి లేకుండానే ఉత్పత్తి పెరగవచ్చు. బడ్జెట్ గ్రామీణ ఆదాయాలను మూల స్థూల చరరాశిగా పరిగణించాలి. బహిర్గత ప్రమాదాలు, నామమాత్రపు వృద్ధి మూడవ ఆందోళన బహిర్గతమైంది: రూపాయ సాపేక్ష బలహీనత, దిగుమతి చేసుకున్న ద్రవ్యోల్బణపు అవ్యక్త ప్రమాదం. సిపిఐ ద్రవ్యోల్బణం సున్నా వద్దే ఉన్నప్పటికీ, రూపాయ విలువ తగ్గింది. ఇది ఎందుకు ఇతర రంగంలోకి విస్తరించ లేదు అన్న ప్రశ్న తలెత్తడం సహజమే. దీనికి జవాబులో ఒక భాగం ఆహార ప్రతిద్రవ్యోల్బణం దేశీయ దృగ్విషయం. ఇదే సిపిఐ కథనంలోని అతి ముఖ్య అంశం, ముడి చమురు ధరలు సాపేక్షంగా స్థిరంగా ఉండడం కూడా ఒక అంశం. కానీ, ఇదే పరిస్థితి కొనసాగుతుందని భావించలేం. వ్యవసాయ ధరలు త్వరగా పెరగవచ్చు, లోహాలు, విలువైన లోహాల ధరలు ద్రవ్యోల్బణం, వ్యయంలోకి ప్రవేశించే అవకాశం ఉంది. ఆహార ద్రవ్యోల్బణం అధిక సానుకూల సంఖ్య నుంచి ప్రతికూలమైన దానిలోకి వస్తే,మూల ప్రభావాల కారణంగా అవి తిరిగి పెరిగే అవకాశం ఉంటుంది. దీనికిఅదనంగా, సిపిఐ బాస్కెట్‌ను సవరించనున్నారు. కాగా, బడ్జెట్ స్థూల ప్రతిపాదనలను 02 శాతం ద్రవ్యోల్బణం చుట్టూ నిర్మించకూడదు. అంతిమంగా, జిడిపి వృద్ధి నామమాత్రంగా ఉంది. ద్రవ్యోల్బణం అసాధారణంగా తక్కువ ఉన్నప్పుడు, వాస్తవ, నామమాత్రపు జిడిపిల మధ్య ఉన్న లోటు దాదాపు తగ్గుతుంది. దీనివల్ల తక్షణ విత్త పరిణామాలు ఉంటాయి. ఎందుకంటే, పన్నుల వసూళ్లనేవి నామమాత్రపు ఆదాయాలను బట్టే ఉంటాయి తప్ప వాస్తవ ఆదాయాలను బట్టి గాదు. ఒకవేళ ఈ నామమాత్రపు వృద్ధి ఆశించినంతగా రాణించనప్పుడు రెవిన్యూ పెరగుదల నిరాశపరుస్తుంది, వ్యయ వత్తిళ్లు యధాతథంగా ఉంటాయి. అత్యధిక సంక్షేమ అంచనాలు ఉన్న వాతావరణంలో, విత్తలోటు లెక్కలు క్లిష్టమవుతాయి. ఒకవేళ లోటు అనుకోకుండా పెరిగితే, అవి ద్రవ్యోల్బణం, కరెన్సీ ప్రతికూల విలువగా మారవచ్చు. సాధారణంగా విధానకర్తలు నివారించాలనుకునేవి పరిణామాలు ఇవి.

బడ్జెట్ ఏం చేయాలి? కనుక, బడ్జెట్ అనేది వాస్తవికంగా, బలమైన పునాదిని నిర్మించేలా ఉండాలి. తొలుత సాధారణీకరణను కోరుకునే స్థూల భావనలను నిర్మించాలి.ద్రవ్యోల్బణం 4శాతానికి, ఆ పైకి తిరిగి వస్తుందని భావించడం శ్రేయస్కరం. రెండవది, గ్రామీణ వేతనాలను, సుసంపన్నమైన ఉపాధి వృద్ధిని కేంద్రం లక్ష్యాలుగా పెట్టుకోవాలి.ఆర్జించే సామర్థ్యాలను పెంచే జోక్యాలపై బడ్జెట్ దృష్టి పెట్టాలి. గ్రామీణ మౌలిక సదుపాయాలు, నీటిపారుదల, నిల్వ, విలువ ఆధారిత లంకె అభివృద్ధి, గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయేతర క్లస్టర్లు, ఎంఎస్‌ఎంఇ రుణాల ఇకోసిస్టమ్‌లు కల్పించడంపై దృష్టి పెట్టాలి తప్ప గ్రామీణ దుస్థితిని సంక్షేమ దృష్టితో చూడకూడదు. మూడవది, మూలధన వ్యయం ఇంకా అవసరమే, కానీ అది ఉపాధి సృష్టి దిశగా ఉండాలి. గృహనిర్మాణం, లాజిస్టిక్స్, పట్టణ ప్రజా సేవలు, వికేంద్రీకృత శక్తిపై దృష్టి ఉండాలి. నాలుగవది, కరెన్సీ స్థిరత అన్నది విత్త విశ్వసనీయత విధి అని గుర్తించాలి. ఐదవది, ప్రజలకు సమాచారం ఇచ్చేటప్పుడు క్లుప్తంగా, సూటిగా ఉండాలి. తక్కువ ద్రవ్యోల్బనం అంటే తక్కువ జీవన వ్యయం అని కాదు. ఒకవేళ తమ జీవన వ్యయం అధికంగా, వేతనాలు బలహీనంగా ఉన్నాయని పౌరులు భావించినప్పుడు, అవి ఎంత సరైన సూచీలు అయినా వారు స్థూల కథనాలను విశ్వసించరు.

- ఉదయ

# వ్యూహాత్మక ముందడుగు

రెండు పెద్ద ఆర్థిక శక్తులుగా పేరు తెచ్చుకున్న భారత్, యూరోపియన్ యూనియన్‌ల మధ్య తాజాగా మరో చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందం నిజరూపై దాల్చడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దాదాపు రెండు దశాబ్దాల చర్చల ఫలితంగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఖరారు కావడం ఇరుపక్షాలకు శుభ పరిణామమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారతదేశం, యూరోపియన్ యూనియన్‌ల మధ్య జరిగిన ఈ ఒప్పందాన్ని "మదర్ ఆఫ్ ఆల్ డీల్స్" లేదా "అన్ని ఒప్పందాలకు తల్లి" లాంటిదని కూడా అభివర్ణించడం సముచితంగా ఉన్నది. భారత్, ఈయులు కలిసి దాదాపు 191 కోట్ల జనాభా (ప్రపంచ జనాభాలో 23 శాతం), పెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన దేశాల కూటములుగా నిలుస్తున్నాయి. భారతదేశానికి 2వ అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా దాదాపు మొత్తం 11.5 శాతం వాణిజ్యం జరుగుతున్నది.

**"అన్ని ఒప్పందాలకు తల్లి" లాంటిది:**

భారత్ నుంచి ఈయూ దేశాలకు యంత్రాలు, ఉపకరణాలు, రసాయనాలు, మూల లోహాలు, ఖనిజ ఉత్పత్తులు, వస్త్రాల ఎగుమతులు జరుగుతున్నాయి. ఈయూ నుంచి భారత్‌కు దిగుమతుల జాబితాలో యంత్రాలు, ఉపకరణాలు, రవాణా పరికరాలు, రసాయనాలు లాంటివి జరుగుతున్నాయి. ఇటీవల ఈయూ నుంచి దిగుమతులతో పోల్చితే భారత ఎగుమతులు అధికంగా ఉండడం విశేషం. తాజాగా జరిగిన భారత్ ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని "అన్ని ఒప్పందాలకు తల్లి" లేదా "మదర్ ఆఫ్ ఆల్ డీల్స్" అని పిలుస్తున్నారు. రానున్న రోజుల్లో భారతదేశానికి ఈయూ కీలకమైన ఆర్థిక & వ్యూహాత్మక భాగస్వామిగా నిలువనున్నది. ఈయూ కమీషన్ అధ్యక్షురాలు "ఉర్సులా వాన్ డెర్ లోయన్"తో కలిసి ఈయూ కౌన్సిల్ అధ్యక్షులు "ఆంటోనియో కోస్టా" భారత 77వ రిపబ్లిక్ డే సంబరాలకు ముఖ్య అతిథులుగా హాజరై "అన్ని ఒప్పందాలకు తల్లి" లాంటి అతి ముఖ్యమైన ఒప్పందం చేసుకొని భారత్ ముందుకు సాగుతున్నాయి. నేడు జరిగిన ఒప్పందాలకు అధికారిక ముద్ర వేయాల్సి ఉంది. దీని కోసం ఈయూ, భారత్ పార్లమెంట్లు కూడా ఆమోదం తెలుపవలసిన ఉంది.



**అంతర్జాతీయ అనిశ్చితి నడుమ వ్యూహాత్మక ముందడుగు:**

202425లో ఈయూతో భారత వస్తు వ్యాపారం దాదాపు $ 136.53 బిలియన్లుగా ఉన్నది. ఇందులో ఎగుమతులు $ 75.85 బిలియన్లు, దిగుమతులు $ 60.68 బిలియన్లుగా నమోదు అయ్యింది. ఈ వాణిజ్య ఒప్పందంతో భారతదేశానికి ఈయూ అతి పెద్ద వస్తువుల మార్కెట్‌గా నిలువనున్నది. 2024లో ఈయూతో ఐటీ, టెలీకమ్, వ్యాపార సేవల వాణిజ్యం $ 83.10 బిలియన్లుగా విస్తరించింది. భారత మొత్తం ఎగుమతుల్లో 17 శాతం వాటా ఈయూతో ముడిపడి ఉన్నది. ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్, స్వీడెన్, పోలాండ్‌లతో సహా 27 దేశాల యూరోపియన్ యూనియన్ మొత్తం జనాభా 45 కోట్ల ఉండగా, భారతదేశ జనాభా నేడు దాదాపు 146 కోట్లు ఉన్నది. ఈ రెండు కూటములు కలిపి ప్రపంచ జీడీపీలో 21 శాతంగా నమోదు అవుతున్నది. ఈ ఒప్పందం ద్వారా సుంకాలు తగ్గడం, నిబంధనలు సరళీకృతం కావడం, సేవల మార్కెట్ ఇరువైపులా బలపడడం లాంటి లక్ష్యాలు నెరవేరనున్నాయి. దీని ద్వారా ఈయూ మార్కెట్‌లో భారత ఉత్పత్తులకు గిరాకీ పెరగనుంది. భారత్, ఈయూలు ప్రత్యర్థులు కాదు, విలువ గొలుసు యొక్క విభిన్న దశలపై పని చేసే భాగస్వాములు అని భావించాలి. ఈ చారిత్రాత్మక ఒప్పందం అమెరికన్ ట్రంప్‌ను ఇరకాటం పెట్టడంతో పాటు యూఎస్ సుంకాల కొరడా భారత్‌పై జులపడానికి ముక్కుతాడు వేయడం జరిగింది. ఈ ఒప్పందం వల్ల రక్షణ రంగం, క్లీన్ ఎనర్జీ, డిజిటల్ టెక్నాలజీ, స్పేస్ టెక్నాలజీ రంగాల్లో ఇరు పక్షాల మధ్య పెరుగుతున్న వ్యూహాత్మక బంధానికి నిదర్శనంగా నిలువనుంది. ఈ ఒప్పందం అమలు జరిగితే, దశాబ్దాల చర్చలకు ముగింపు పలకడంతో పాటు రెండు అతి పెద్ద ప్రజాస్వామ్య మార్కెట్ల మధ్య సరి కొత్త అధ్యాయం మొదలుకానుంది. ఈ డీల్‌తో డొనాల్డ్ ట్రంప్ దూకుడుకు భారత్ ధీటైన సమాధానం ఇచ్చినట్లు అయ్యింది.



డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# పోరాట యోధుడు చోళ లింగయ్య

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, ఖాసిం రజ్వీ ఆధ్వర్యంలో రజాకార్ల దౌర్జన్యాలను ఎదిరించడానికి, నైజాం సర్కారు అంతానికి, హైదరాబాద్ రాజ్య, తెలంగాణ ప్రాంత విమోచోద్యమం నిర్వహించారు. ఎందరో ఎన్నో పోరాట రూపాలను నిర్వచించారు. ఎందరో ఎన్నో త్యాగాలు చేశారు. అలాంటి త్యాగమూర్తులలో చోళ లింగయ్య ఒకరు. నేతాజీ స్ఫూర్తితో, ఇండియన్ నేషనల్ ఆర్మీ లో పని చేస్తున్న లింగయ్య తన ఉద్యోగానికి తృణప్రాయంగా త్యజించి, అర్మీలో తనకున్న అనుభవంతో, సాయుధ పోరాటానికి తెర లేపి, రక్షణ దళాలను ఏర్పాటు చేశారు. హైదరాబాదు సంస్థానాధీశుడు ఏడవ నిజాం నవాబు ఉస్మాన్ ఆలీ ఖాన్ నుంచి విముక్తి కోసం సంస్థాన ప్రజలు 1946 నుంచి 1948 మధ్య చేసిన వీరోచిత పోరాటమే తెలంగాణ విమోచనోద్యమం. భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినా, నిజాం సంస్థానంలోని ప్రజలకు మాత్రం స్వాతంత్ర్యం లేకపోవడాన్ని ఇక్కడి ప్రజలు జీర్ణించు కోలేక పోయారు. దేశమంతటా స్వాతంత్ర్యోత్సవాలతో ప్రజలు ఆనందంతో మునిగితేలగా, నిజాం సంస్థాన ప్రజలు మాత్రం నిరంకుశ బానిసత్వం నుండి స్వేచ్ఛా వాయువులు పీల్చ లేక పోయారు. నిజామ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ రాజ్యాన్ని సొంతం చేసుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తూ రజాకార్లను ఉసిగొల్పాడు. నిజాం ఇచ్చిన స్వేచ్ఛ తో, ఖాసిం రజ్వీ నేతృత్వంలోని రజాకార్లు గ్రామాలపైబడి దోపిడి చేయడం, ఇండ్లు తగలబెట్టడం, మాన భంగాలు, లూటీలు లాంటి నానా అరాచకాలు సృష్టించారు. మతోన్మాద చర్యల కారణంగా ప్రజల నుండి బలవంతపు వసూలు చేసుకున్న సొమ్ముతో విలాసాలు, జల్సాలు, భోగభాగ్యాలు చేసుకొనేవారు. దీనితో రామానందతీర్థ నేతృత్వంలో ఆర్యసమాజ్ ఉద్యమాలు, కమ్యూనిష్టుల ఆధ్వర్యంలో సాయుధ పోరాటాలు ఉధృతమయ్యాయి. మొదట నల్గొండ జిల్లాలో ప్రారంభమైన ఉద్యమం శరవేగంగా నైజాం సంస్థానం అంతటా విస్తరించింది.

తెలంగాణ సాయుధ పోరాటంలో పురుషులు, స్త్రీలు, పిల్లలు అనే తేడాలు లేకుండా తుపాకులు, బడిసెలు పట్టి రజాకార్ల మూకలను తరిమి కొట్టారు. మహబూబ్ నగర్ జిల్లాలో అప్పంపల్లి, ఆదిలాబాదు జిల్లాలో నిర్మల్, సిర్పూర్, కరీంనగర్ జిల్లాలో మంథని, మహమ్మదాపూర్, నల్గొండ జిల్లాలో మల్లారెడ్డిగూడెం, నిజామాబాదు జిల్లా ఇందూరు, తదితర ప్రాంతాలలో పోరాటం పెద్దఎత్తున సాగింది. జమలాపురం కేశవరావు, లక్ష్మీ నరసయ్య, ఆరుట్ల కమలాదేవి, రావి నారాయణరెడ్డి, ధర్మబిక్షం, చంద్ర రాజేశ్వరరావు, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మొహియుద్దీన్, షోయబ్ ఉల్లా ఖాన్, మల్లు స్వరాజ్యం రాంజీగోండ్, విశ్వనాథ్ సూరి, దొడ్డి కొమరయ్య, బెల్లం నాగయ్య, కిషన్ తదితరులు తెలంగాణ విమోచనానికి కృషిచేశారు. వీరందరి కృషి, దాశరథి, కాళోజీల కవితల స్ఫూర్తితో సామాన్య ప్రజలు సైతం ఊరుఊరున, వాడవాడన నిజాం పాలనపై తిరగబడ్డారు. కర్రలు, బరిసెలు, గుత్పలు, కారం ముంతలు, చేతికి అందుబాటులో ఉందల్లా ఆయుధాలుగా మలుచుకొని



పోరాడారు. తుపాకులను సంపాదించుకొని యుద్ధరంగంలోకి దిగారు. ఇలా వివిధ జిల్లాలలో తెలంగాణ విమోచన పోరాటాలు కొనసాగాయి. అందులో భాగంగానే మెదక్ పట్టణానికి చెందిన చోళ లింగయ్య ఇండీయన్ నేషనల్ ఆర్మీలోని ఇంజనీర్ ఉద్యోగానికి రాజీనామా చేసి తనకున్న మిలటరీ పరిజ్ఞానంతో రజాకార్ల దాడులను తిప్పికొట్టడం కోసం రక్షణ దళాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణ విమోచన పోరాట యోధునిగా పేరు పొందిన చోళ లింగయ్య జూన్ 13, 1913న మెదక్ పట్టణంలో జన్మించారు. పాఠశాల దశలోనే విద్యార్థి సంఘాలను ఏర్పాటు చేశారు. గాంధీ నెహ్రూ చిత్రపటాలను ఆవిష్కరించినందుకు పాఠశాల నుంచి బహిష్కృతులైనారు. 1942లో భారత వైమానిక దళంలో చేరారు. ఇండియన్ నేషనల్ ఆర్మీ ఎయిర్ ఫోర్స్ గ్రౌండ్‌లో పనిచేసిన చోళ లింగయ్య... సుభాష్ చంద్రబోస్ పిలుపును అందుకొని ఉద్యోగానికి రాజీనామా చేశారు. బోస్ ఆచూకీ లభ్యం కాని స్థితిలో ఆయన హైదరాబాదుకు వచ్చి తెలంగాణ విమోచన ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. 1947, ఆగస్టు 15న మెదక్ పట్టణంలోని పటేల్ కుంటలో జాతీయ జెండాను ఆవిష్కరించిన పిదప అరెస్ట్ వారెంట్ జారీ కావడంతో అజ్ఞాతంలోకి వెళ్ళారు. నిజాం సర్కారు లింగయ్యను 1947 సెప్టెంబరు 10న అరెస్ట్ చేసి 7 నెలల పాటు హైదరాబాదులోని చంచల్‌గూడ జైలులో ఉంచింది. విమోచన అనంతరం లింగయ్య హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెస్ సభ్యులుగా, ఆలిండియా కాంగ్రెస్ డెలిగేట్‌గా, 1977లో మెదక్ జిల్లా పార్టీ కోశాధికారిగా పనిచేశారు. 2010 జనవరి 29న పోరాట యోధుడు లింగయ్య మరణించారు.

చివరికి భారత ప్రభుత్వం సర్దార్ పటేల్ నేతృత్వంలో సైనిక చర్యతో నైజాం సంస్థానాన్ని 1948 సెప్టెంబర్ 18న భారత్ యూనియన్‌లో విలీనం చేసుకుంది.



సంగన భట్ల



# జాతీయం- అంతర్జాతీయం



## అజిత్ మృతిలో కుట్ర ఏమీలేదన్న శరద్ పవార్



**ముంబై, జనవరి 28 :** తన అన్న కుమారుడు అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మరణించిన విషయంపై సీనియర్ నాయకుడు శరద్‌పవార్ ఉద్వేగంగా స్పందించారు. అది ప్రమాదం మాత్రమేనంటూ, కుట్ర కోణాలను ఆయన కొట్టిపారేశారు. అన్నీ మనచేతిలో ఉండవు. ఏడవడం సిగ్గుపడే విషయంలా అనిపించవచ్చు. కానీ, కొన్ని ఘటనల వెనుక రాజకీయాలు ఉండవు. ఈ విషయంపై నా వైఖరిని నేను స్పష్టంగా వెల్లడించాను. ఇందులో ఎటువంటి కుట్రా లేదు, ఇది ప్రమాదం మాత్రమే. ఈ బాధను మహారాష్ట్ర, మనందరం కూడా శాశ్వతంగా భరించవలసిందే అని ఆయన అన్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి ఇందులో కుట్ర ఉందంటూ చేసిన ఆరోపణలను శరద్ పవార్ కొట్టిపారేశారు. ఇందులో ఏవో రాజకీయాలు ఉన్నాయని కోల్‌కొతలో ఊహాగానాలు సాగుతున్నాయి. కానీ అటువంటిదేం లేదు. ఇందులో రాజకీయం లేదు. అది ప్రమాదం. రాజకీయాలను ఇందులోకి తేవద్దని విజ్ఞప్తి చేస్తున్నాను అని సీనియర్ పవార్ అన్నారు. ముంబై నుంచి బారామతి వెడుతున్న చార్టర్డ్ విమానం బుధవారం ఉదయం 8.48 కుప్పకూలి అజిత్ పవార్ మరణించిన విషయం తెలిసిందే. జిల్లా పంచాయత్ ఎన్నికల ప్రచారం కోసం ఆయన బయలుదేరారు. ఇందులో ఎటువంటి కుట్రా లేదు, ఇది ప్రమాదం మాత్రమే, అజిత్ పవార్ మరణంతో మహారాష్ట్ర తీవ్రమైన నష్టాన్ని ఎదుర్కొంటోంది. ఒక సమర్థుడైన నాయకుడు నేడు మనల్ని వదిలి వెళ్లిపోయాడు. మహారాష్ట్ర ఒక గొప్ప వ్యక్తిత్వాన్ని కోల్పోయింది. ఆ నష్టాన్ని ఎప్పటికీ పూరించలేమంటూ శరద్ పవార్ పేర్కొన్నారు. ఎన్సీపీ చీలిపోయినప్పటికీ,ఇటీవల పూణె, పింప్రీ చించ్‌వాడలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో కలిశాయి.

## మరణించిన సభ్యులకు లోక్‌సభ నివాళులు



**ముంబై, జనవరి 28 :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తొలి రోజున, లోక్‌సభ బుధవారం నాడు మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రికి, ఇటీవలి కాలంలో మరణించిన మాజీ సభ్యులకు నివాళులు అర్పించింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పవార్, శాలినీ పటేల్, భానుప్రకాష్ మిర్ధా, సత్యేంద్రనాథ్ బ్రొహ్మో చౌదరి, సురేష్ కల్మాడి, కబీంద్ర పురకాయస్తలకు నివాళులు అర్పిస్తూ వారు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. అజిత్ పవార్ బారామతి నుంచి 10వ లోక్‌సభకు ఎన్నికయ్యారని, ఆరుసార్లు మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా పని చేశారని, రాష్ట్రప్రభుత్వంలో మంత్రిగా ఎనలేని సేవలను అందించారని అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీకి ఎనిమిది సార్లు ఎన్నికైన ఆయన చేసిన సేవలను, ప్రజా జీవితంలో ఆయన చూపిన నిబద్ధతను మరువలేనివి అంటూ ఆయనకు నివాళి అర్పించారు. ఏడవ లోక్‌సభ సభ్యురాలు అయిన శాలినీ పాటిల్‌కు, 11వ లోక్‌సభ సభ్యుడైన భాను ప్రకాష్ మిర్ధాకు, 10వ లోక్‌సభ సభ్యుడైన సత్యేంద్రనాథ్ బ్రహ్మో చౌదరికి, 11, 14, 15వ లోక్‌సభలలో సభ్యుడిగా ఉన్న సురేష్ కల్మాడీకి, 10, 12, 15వ లోక్‌సభలో సభ్యుడైన కబీంద్ర పురకాయస్థకు దిగువ సభ నివాళులర్పించింది. బాంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలేదా జియాకు నివాళులు అర్పించింది. మరణించిన సభ్యుల గౌరవార్థం సభ కొద్ది క్షణాలు మౌనం పాటించింది. తదనంతరం లోక్‌సభను స్పీకర్ వాయిదా వేశారు.

## నాన్నా డిప్యూటీ సీఎంతో బారామతి వెళ్తున్నా..

### విమానం అటెండెంట్ పింకీ మాలి చివరి మాటలు



**ముంబై:** బారామతిలో బుధవారం జరిగిన విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌తో పాటు మరణించిన మరో నలుగురిలో పింకీ మాలి ఉన్నారు. విమాన అటెండెంట్‌గా ఆమె అజిత్ పవార్‌తో పాటు విమానంలో వెళ్లారు. దీనికి ఒకరోజు ముందే పింకీ మాలి తన తండ్రి శివకుమార్‌తో ఫోనులో మాట్లాడారు. 'నాన్నా డిప్యూటీ సీఎంతో బారామతి వెళ్తున్నాను' అని చెప్పారు. అయితే విమాన ప్రమాద దుర్ఘటనలో పింకీ కన్నుమూయడం ఆమె కుటుంబాన్ని విషాదంలో ముంచెత్తింది. తనతో మాట్లాడిన మాటలే తన కుమార్తె చివరి మాటలు అవుతాయని అనుకోలేదంటూ శివకుమార్ కన్నీరుమున్నీరయ్యారు. ఇక ఎప్పటికీ రాదంటూ భావోద్వేగానికి గురయ్యారు.

'నిన్న అమ్మాయి నాకు ఫోన్ చేసింది. అజిత్ పవార్‌తో కలిసి బారామతి వెళ్తున్నాను. అక్కడి నుంచి నాందేడు వెళ్లాలి. హోటల్‌కు చేరుకోగానే ఫోన్ చేస్తాను' అని పింకీ చెప్పినట్టు శివకుమార్ గుర్తుచేసుకున్నారు. అయితే బుధవారం ఉదయమే తమ కలల సౌధాలన్నీ కుప్పకూలిపోయాయని, టీవీలో విమాన ప్రమాదం వార్త చూడగానే తన నవనాడులూ కుంగిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల్లో తన కుమార్తె కూడా ఉందని తెలిసి చిగురుటాకులా వణికిపోయాయని కన్నీరు మున్నీరయ్యాడు. విమానం అటెండెంట్‌గా పింకీ మాలి తన బాధ్యతల్లో భాగంగా అజిత్ పవార్‌తో తరచు వెళ్లేవారు. గత ఐదేళ్లుగా విమానం అటెండెంట్‌గా పింకీ పని చేస్తోందని, తొలుత ఎయిరిండియాలో పనిచేసి ఆ తర్వాత ప్రైవేటు విమానయాన సంస్థలో చేరిందని శివకుమార్ తెలిపారు. ప్రమాదం ఎలా జరిగిందో తనకు తెలియదని, తన కుమార్తె మృతదేహాన్ని అప్పగించగానే గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహిస్తానని చెప్పారు.

## ఈయూతో ట్రేడ్ డీల్ వల్ల భారత్‌కే లాభం

### అమెరికా

**వాషింగ్టన్ :** భారత్ – ఐరోపా సమాఖ్యల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. దీనిపై అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఒప్పందం భారత్‌కే ఎక్కువ అనుకూలంగా ఉందని అన్నారు. ఓ ఇంటర్వ్యూలో గ్రీర్ మాట్లాడుతూ.. 'ఈ ఒప్పందానికి సంబంధించి కొన్ని వివరాలు నేను పరిశీలించా. దీనిలో భారత దేశం పైచేయిగా నిలుస్తుందని భావిస్తున్నా. ఐరోపా మార్కెట్‌లో భారత ఉత్పత్తులకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి' అని పేర్కొన్నారు. భారతీయ నిపుణులకు ఐరోపా దేశాల్లో ఎక్కువ అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దేశీయ ఉత్పత్తులకు ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. దేశంలోకి దిగుమతయ్యే వస్తువులపై టారిఫ్‌లు విధిస్తుండటంతో.. పలు దేశాలు తమ ఉత్పత్తుల కోసం ఇతర మార్కెట్ల వైపు చూస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే ఈయూ.. భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుందన్నారు.



## 'అర్ధరాత్రి'కి ఇంకా చేరువైన డూమ్స్‌డే గడియారం




**వాషింగ్టన్ :** ప్రపంచం మునుపెన్నడూ లేనంతగా విధ్వంసానికి చేరువైందని 'బులెటిన్ ఆఫ్ ద అటామిక్ సైంటిస్ట్స్' అనే స్వచ్ఛంద సంస్థ పేర్కొంది. అమెరికా, రష్యా, చైనా, ఇతర దేశాలు దుందుడుకుగా వ్యవహరించడం, శత్రుభావాలు, జాతీయవాదం పెరగడం వంటివి ఇందుకు కారణమని వివరించింది. దీంతో 'డూమ్స్‌డే గడియారం'లో అర్ధరాత్రికి 85 సెకన్ల దూరంలోనే ఉంది. వినాశనానికి మానవాళి ఎంత దూరంలో ఉందన్నది బులెటిన్ ఆఫ్ ద అటామిక్ సైంటిస్ట్స్ విశ్లేషిస్తుంది. ఒక ఊహాజనిత గడియారంపై అర్ధరాత్రి 12 గంటల సమయాన్ని వినాశనానికి సూచికగా అభివర్ణిస్తుంది. దీన్ని డూమ్స్‌డే క్లాక్‌గా పిలుస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిస్థితులకు అనుగుణంగా ఈ సమయాన్ని ముందుకు, వెనక్కి జరుపుతుంటుంది. గత ఏడాది గడియారాన్ని అర్ధరాత్రికి 89 సెకన్లకు చేరువ చేసింది. అణ్వస్త్ర దేశాలతో ప్రమేయమున్న ఘర్షణలు పెరిగే ప్రమాదం ఉందని సంస్థ తెలిపింది. ఈ సందర్భంగా రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని ప్రస్తావించింది. భారత్, పాకిస్థాన్ మధ్య గత ఏడాది మే నెలలో జరిగిన ఘర్షణలనూ ఉదహరించింది. అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల తర్వాత ఇరాన్ అణ్వస్త్రాన్ని సమకూర్చుకోవచ్చన్న ఆందోళన పెరిగిందని తెలిపింది. మొత్తంమీద అణుయుద్ధం ముప్పు, వాతావరణ మార్పులు, బయోటెక్నాలజీని దుర్వినియోగం చేసే అవకాశం, సరైన నియంత్రణలు లేకుండా కృత్రిమ మేధ(ఏఐ) వాడకం వంటివి పెరిగాయని వివరించింది. ఈ నేపథ్యంలో డూమ్స్‌డే గడియారంలోని సమయాన్ని అర్ధరాత్రికి మరో 4 సెకన్ల మేర ముందుకు జరిపినట్లు వివరించింది.

# అజిత్ పవార్ రాజకీయ ప్రస్థానం



**ముంబై, జనవరి 28 :** మహారాష్ట్ర ముఖ్యమంత్రి అజిత్ పవార్ మరణంతో పార్టీ వర్గాలలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రాజకీయ వర్గాలలోనూ, పార్టీలోనూ దాదాగా ప్రాచుర్యం పొందిన అజిత్ పవార్ రాష్ట్ర రాజకీయాలపై తనదైన ముద్రవేశారు. మహారాష్ట్ర రాజకీయాలలో నేటి భీష్మపితామహుడి వంటివాడైన శరద్ పవార్ పెద్దన్న అనంతరావ్ కుమారుడైన అజిత్, తన బాబాయి శైలిలోనే తన రాజకీయ జీవితాన్ని మలచుకున్నారు. ముఖ్యంగా మహారాష్ట్రలోని సహకార రంగంపై గట్టి పట్టును సాధించి, నెమ్మదిగా రాజకీయాలలో తనదైన ముద్రవేశారు. మహారాష్ట్రలో 2023లో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో బాబాయి శరద్‌పై తిరుగుబాటు చేసి ఎన్సీపీని నిలువుగా చీల్చివేశారు. అనంతరం ఆయన ఎన్డీయేలో చేరారు. అహ్మద్‌నగర్ జిల్లాలోని దియోలాలీ ప్రవరలో జులై 22, 1959న జన్మించిన అతడు, మహారాష్ట్రలో అత్యంత ప్రభావం కలిగిన రాజకీయ కుటుంబానికి చెందిన వాడు. వ్యవసాయం, సహకార రంగంతో పవార్లకు సన్నిహిత అనుబంధం ఉంది. ఇదే అజిత్ తొలి రాజకీయ అభిప్రాయాలను మలచి, అతడి రాజకీయ జీవితానికి పునాది వేసింది. ముంబైలోని రాజ్‌కమల్ స్టూడియోస్‌లో పని చేసిన తండ్రి అనంతరావ్ పవార్ మరణించిన అనంతరం అజిత్ దాదా రాజకీయాలలోకి ప్రవేశించారు. అంటే, అజిత్ కేవలం ఎస్సెస్సీ వరకు మాత్రమే చదువుకోగలిగారు. కాగా, మహారాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో అప్పటికే ప్రముఖంగా బాబాయి శరద్ పవార్ వెలుగొందుతున్నారు. బహుశ అందుకేనేమో, తన కెరీర్‌ను ప్రారంభించేటప్పుడు అజిత్ పెద్దగా సవాళ్లను ఎదుర్కోలేదు. అత్యంత పిన్న వయసులో (23) ఏళ్లకే అతడు బారామతిలోని సహకార చక్కెర పరిశ్రమ బోర్డుకు ఎన్నికయ్యారు. కాగా, బారామతి నుంచి 1991లో లోక్‌సభకు ఎన్నిక కావడంతో అతడి తొలి ప్రధాన రాజకీయ విజయం నమోదైంది. కేవలం ఒక్కసారి మాత్రమే అతడు లోక్‌సభకు పోటీ చేశాడు. అనంతరం, అతడు నిర్ణయాత్మకంగా మహారాష్ట్ర రాజకీయాలలోకి ప్రవేశించి, పవార్లకు కంచుకోట అయిన బారామతి అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొందాడు. బారామతి నుంచి ఎనిమిది సార్లు ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కాగా, 1999లో శరద్ పవార్ కాంగ్రెస్ నుంచి చీలిపోయి ఎన్సీపీని ఏర్పాటు చేసినప్పుడు అజిత్ అతడిని అనుసరించాడు. వ్యూహాత్మక ఎత్తుగడలతో త్వరలోనే అజిత్ ఎన్సీపీలోని అత్యంత ప్రభావవంతమైన నాయకులలో ఒకరయ్యాడు. కేవలం 40 ఏళ్ల వయసులోనే నాటి విలాస్‌రావ్ దేశ్‌ముఖ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో నీటిపారుదల మంత్రిత్వ శాఖ మంత్రిగా పని చేశారు. ఒక దశాబ్దకాలం పాటు వివిధ ప్రభుత్వాలలో ఆయన నీటి సరఫరా, గ్రామీణాభివృద్ధి, ఆర్థిక, ఇంధనం సహా పలు మంత్రిత్వ శాఖలను నిర్వహించారు. మహారాష్ట్రలో, ముఖ్యంగా పశ్చిమ మహారాష్ట్రలో సహకార సంస్థలు, స్థానిక సంస్థలపై నియంత్రణ ద్వారా తనదైన రాజకీయ పునాదిని ఏర్పాటు చేసుకున్నాడు.

ఎన్నడూ అధికారంలో లేకుండా ఉండని వ్యక్తి అజిత్ ప్రభావం పెరిగిన కొద్దీ, పవార్ కుటుంబంలో ఉద్రిక్తతలు పెరిగాయి. శరద్ పవార్ కుమార్తె సుప్రియా శూలే ఎదుగుదల కుటుంబంలో సంబంధాలను మరింత సంక్లిష్టం చేసింది. వారసత్వం, నియంత్రణ విషయంలో కుటుంబంలో చీలికలు రావడం, అవి బహిరంగం కావడం కూడా తెలిసిందే. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వంలో అజిత్ పవార్ ఉపముఖ్యమంత్రిగా ఉన్నారు. ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన, బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు నిరాకరించడంతో ఇది జరిగింది. అనంతరం ఉద్ధవ్ కాంగ్రెస్, ఎన్సీపీల మద్దతుతో ముఖ్యమంత్రి అయినప్పుడు కూడా అజిత్ ఉపముఖ్యమంత్రిగానే ఉన్నారు. కాగా, ఎన్సీపీ నుంచి ఒక వర్గంతో 2023లో అజిత్ చీలిపోయి, బీజేపీ–శివసేన కూటమిలో చేరినప్పుడు అందరూ ఆశ్చర్యపోయారు. శివసేన గత ఏడాది చీలిపోయిన సంగతి తెలిసిందే. అజిత్ తిరిగి ఉపముఖ్యమంత్రి అయ్యారు. 2024లో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో మహాయుతి నిర్ణయాత్మకంగా గెలిచిన తర్వాత కూడా ఆయన ఉపముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. మాజీ మహారాష్ట్ర మంత్రి పదమ్ సిన్హ్ బాజీరావ్ పాటిల్ కుమార్తె సునేత్ర పవార్ ను అజిత్ వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సునేత్ర రాజ్యసభ ఎంపీ. కుమారుడు పార్థ్ పవార్ రాజకీయాలలోకి ప్రవేశించి 2019 లోక్‌సభ ఎన్నికలలో పోటీ చేసినప్పటికీ సఫలం కాలేదు. మరొక కుమారుడు జయ్ పవార్ వ్యాపారవేత్త. బుధవారం మహారాష్ట్ర ఒక గొప్ప రాజకీయ నాయకుడిని కోల్పోవడమే కాదు, రైతులు, కార్మికులు తమ దాదాను కోల్పోయారు.

## ఆయన మరణం చాలా బాధిస్తుంది..

### అజిత్ పవార్ మృతిపై సచిన్ సంతాపం



**ముంబై, జనవరి 28 :** మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ బుధవారం జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆయనతో పాటు మరో నలుగురు ఈ ప్రమాదంలో మరణించారు. ఇక అజిత్ పవార్ మృతిపై సినీ, రాజకీయ, క్రీడా రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు స్పందిస్తున్నారు. టీమిండియా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్.. అజిత్ పవార్ మృతిపై ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా అజిత్ పవార్‌కు నివాళులర్పించారు. 'అజిత్ పవార్ అకాల మరణం గురించి తెలిసి చాలా బాధపడుతున్నాను. ప్రజల కోసం అంకితభావంతో పని చేసిన ఓ మంచి నాయకుడిని మహారాష్ట్ర కోల్పోయింది. ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులకు నా ప్రగాఢ సానుభూతి. ఓం శాంతి' అని సచిన్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మహారాష్ట్రలోని జిల్లా పరిషత్ ఎన్నికలకు ముందు వరుస బహిరంగ సభల కోసం డిప్యూటీ సీఎం అజిత్ పవార్ బారామతికి ప్రయాణిస్తుండగా ఈ ఘోర ప్రమాదం జరిగింది. ఆయన చార్టర్డ్ బాంబార్డియర్ లియర్‌జెట్–45 అనే విమానంలో ప్రయాణిస్తున్నప్పుడు ఆ ఫ్లైట్ సాంకేతిక సమస్యలను ఎదుర్కొన్నట్లు సమాచారం. బారామతి విమానాశ్రయంలో విమానం అత్యవసరంగా ల్యాండింగ్‌కు ప్రయత్నించిందని అధికారులు నిర్ధారించారు. రెండవసారి దిగడానికి ప్రయత్నించినప్పుడు, విమానం కూలిపోయింది. ఫలితంగా ఫ్లైట్‌లో ఉన్న అజిత్ పవార్‌తో సహా ఐదుగురు మరణించారు.

## అజిత్ వార్ మృతిలో కుట్రకోణం

### మమతాబెనర్జి కీలక వ్యాఖ్యలు



**కోల్‌కతా :** విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్‌పవార్ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పందిస్తూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. పవార్ మృతిలో కుట్రకోణం ఉందనే అనుమానం వ్యక్తం చేశారు. మమత మీడియాతో మాట్లాడుతూ.. పవార్ మరణ వార్త విని తాను తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానన్నారు. ఈ ప్రమాదం దేశంలోని రాజకీయ నాయకుల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతుందన్నారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. అత్యున్నత న్యాయస్థానం పైనే తమకు నమ్మకం ఉందన్నారు. మరే ఇతర దర్యాప్తు సంస్థల పైనా తమకు విశ్వాసం లేదని.. అవి వాటి స్వేచ్ఛను కోల్పోయాయని ఆరోపించారు. ఈ సందర్భంగా పవార్ భాజపాను వీడాలని ఆలోచిస్తున్నారని ఇటీవల జరిగిన ప్రచారం గురించి మమత ప్రస్తావించారు. ఇక, పవార్ విమాన ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరపాలని పలువురు రాజకీయ నాయకులు కూడా డిమాండ్ చేశారు. ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్, కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్‌లు ఎక్స్ వేదికగా పవార్ మృతికి సంతాపం తెలిపారు. ఈ ఘటనపై పారదర్శకమైన దర్యాప్తు చేయాలని కోరారు.

## బారామతి విమానాశ్రయంలో విజిబులిటీ తగ్గింది

### కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు



**న్యూఢిల్లీ :** మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందిస్తూ.. ప్రాథమిక వివరాలను వెల్లడించారు. ప్రమాదం జరిగిన సమయంలో బారామతి విమానాశ్రయంలో విజిబులిటీ తగ్గినట్లు తేలిందని మంత్రి తెలిపారు.

ల్యాండింగ్ సమయంలో రన్‌వే స్పష్టంగా కనిపిస్తుందా లేదా అని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అధికారులు పైలట్లను ప్రశ్నించారని, రన్‌వే కనిపించడం లేదని వారు సమాధానం ఇచ్చినట్లు వెల్లడించారు. దీంతో భద్రతా కారణాల దృష్ట్యా విమానం కొంత సేపు గాల్లోనే చక్కర్లు కొట్టినట్లు ఆయన చెప్పారు. అనంతరం రెండోసారి ల్యాండింగ్‌కు ప్రయత్నించే సమయంలో మళ్లీ రన్‌వే కనిపిస్తుందా అని ఏటీసీ ప్రశ్నించగా, పైలట్లు సానుకూలంగా సమాధానం ఇచ్చారని, దాంతో ల్యాండింగ్‌కు అనుమతి ఇవ్వగా, ఆ క్షణాల్లోనే విమానం ప్రమాదానికి గురైందని తెలిపారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో లోతైన విచారణ చేపడతామని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. పూర్తి వివరాలు సేకరించిన తర్వాత వాస్తవాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు. ఇప్పటికే డీజీసీఏతో పాటు ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరోకి చెందిన ప్రత్యేక బృందాలు పుణెకు చేరుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించారు. ఇదే అంశంపై డీజీసీఏ వర్గాలు కూడా స్పందించాయి. ల్యాండింగ్ సమయంలో రన్‌వేను స్పష్టంగా గుర్తించడంలో పైలట్లకు ఇబ్బందులు ఎదురైనట్లు తెలిపాయి. అయితే అత్యవసర పరిస్థితిని సూచించే మేడే కాల్స్ పైలట్ల నుంచి అందలేదని అధికారులు పేర్కొన్నట్లు సమాచారం. ఈ ఘటనపై మరిన్ని వివరాలు వెలుగులోకి రావాల్సి ఉందని, దర్యాప్తు పూర్తయ్యాకే ప్రమాదానికి గల అసలు కారణాలు తేలుతాయని అధికారులు చెబుతున్నారు.

## హానెస్టీ బాక్స్.. విద్యార్థుల నిజాయితీకి 'పరీక్ష'!

### సీసీటీవీ కెమెరాలు, యాప్ ఆధారిత ట్రాకింగ్ వ్యవస్థ



**లక్నో :** ఫిబ్రవరిలో నిర్వహించనున్న పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు మధ్యప్రదేశ్ ప్రభుత్వం అన్ని ఏర్పాటు చేస్తోంది. విద్యార్థులు కాపీ కొట్టకుండా సీసీటీవీ కెమెరాలు, యాప్ ఆధారిత ట్రాకింగ్ వ్యవస్థను అధికారులు సిద్ధం చేశారు. వీటితోపాటు విద్యార్థుల నిజాయితీ, నైతిక విలువలను పరీక్షించేందుకు మరో వినూత్న ప్రయత్నం చేస్తున్నారు. అదే 'హానెస్టీ బాక్స్'. ప్రతి పరీక్ష కేంద్రం ప్రవేశద్వారం వద్ద ఈ బాక్స్‌ను అమర్చనున్నారు. విద్యార్థులు ఎవరైనా చిట్టీలు, కాపీయింగ్‌కు దోహదపడే పరికరాలు తీసుకొస్తే ఈ పెట్టెలో వేసి పరీక్ష హాలులోకి వెళ్లవచ్చు. దీనివల్ల శిక్షల నుంచి తప్పించుకోవడంతో పాటు నిజాయితీతో పరీక్ష రాయాలనే అవగాహన పెంచడమే లక్ష్యంగా బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ హానెస్టీ బాక్స్.. విద్యార్థుల్లో నిజాయితీని, నైతిక బాధ్యతను గుర్తుచేస్తుందని అధికారులు తెలిపారు.

ఈ విషయంపై మధ్య ప్రదేశ్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ కార్యదర్శి బుద్దేశ్ కుమార్ వైద్య మాట్లాడుతూ.. "పరీక్షలు పూర్తిగా పారదర్శకంగా జరగాలన్నదే మా ఉద్దేశం. ఎవరైనా అనవసరమైన వస్తువులు తెస్తే, పరీక్ష మొదలయ్యే ముందు వాటిని ఈ హానెస్టీ బాక్సుల్లో వదిలేసి, సొంతగా పరీక్ష రాయాలి" అని తెలిపారు. ప్రభుత్వం పరీక్షలను మరింత కట్టుదిట్టంగా నిర్వహించేందుకు హాల్ టికెట్‌లో క్యూఆర్ కోడ్ విధానాన్ని అమలు చేయనుంది. ఇన్విజిలేటర్ ఆ క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి విద్యార్థి వివరాలను ధ్రువీకరించవచ్చు. మరోవైపు ప్రశ్నపత్రాలు లీక్ కాకుండా ఉండేందుకు ట్రాకింగ్ అప్లికేషన్‌ను వినియోగించనుంది.

## ఇరాన్ దిశగా మరిన్ని యుద్ధనౌకలు

### ట్రంప్ హెచ్చరికలు

**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి హెచ్చరికలు చేశారు. మరిన్ని యుద్ధనౌకలు ఆ దేశం దిశగా కదులుతున్నాయని పేర్కొన్నారు. వాటిని వినియోగించే అవసరం రాకూడదని తాను ఆశిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే యూఎస్‌కు చెందిన విమాన వాహకనౌక యూఎస్‌ఎస్ అబ్రహం లింకన్ పశ్చిమాసియాకు చేరుకొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మరిన్ని యుద్ధనౌకల గురించి ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఉద్రిక్తతలను మరింత పెంచాయి. 'ప్రస్తుతం మరో అందమైన యుద్ధనౌక ఇరాన్ వైపు ప్రయాణిస్తోంది. వారు ఒక ఒప్పందం చేసుకుంటారని ఆశిస్తున్నాం. ఇప్పటికే వారు దాన్ని చేసుకోవాల్సి ఉంది. అయితే అందుకు వారు సిద్ధంగా ఉన్నారని నాకు తెలుసు. వాళ్లు నాకు చాలాసార్లు ఫోన్ చేశారు' అని ట్రంప్ అన్నారు. అదనపు వైమానిక రక్షణ వ్యవస్థలను ఈ ప్రాంతానికి తరలిస్తున్నట్లు అమెరికా అధికారి ఒకరు తెలిపారు. ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణల్లో వేల మంది ప్రాణాలు కోల్పోయారు. దీనిపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అబ్రహం లింకన్ వాహక నౌకతో సహా పలు యుద్ధ నౌకలను పశ్చిమాసియాలో మోహరించారు. దీంతో ఇరాన్‌పై యూఎస్ ఏ క్షణాన దాడి చేస్తుందోనన్న భయాందోళనలు నెలకొన్నాయి.





# 'మున్సిపల్'లో జోనల్ అధికారులు కీలక పాత్ర పోషించాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**సూర్యాపేట, జనవరి 28 (వుదయం):**

జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించడంలో జోనల్ అధికారులు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన జోనల్ అధికారులు, ఎఫ్ఎస్టి, ఎస్ఎస్టి, విఎస్టి, వ్యయ పరిశీలకుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి జోన్ పరిధిలో ఎన్నికల ఏర్పాట్లను జోనల్ అధికారులు నేరుగా పర్యవేక్షించాలని, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, సిబ్బంది నియామకంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకుని శాంతిభద్రతలు కాపాడాలని, పోలింగ్ రోజున ఫిర్యాదులకు తక్షణ స్పందన ఇవ్వాలని చెప్పారు. వ్యయ పరిశీలకులు అభ్యర్థుల ఖర్చు పరిమితిని పర్యవేక్షించాలని తెలిపారు. డబ్బు, మద్యం, బహుమతుల అక్రమ పంపిణీని అరికట్టేందుకు ఎఫ్ఎస్టి, ఎస్ఎస్టి బృందాలు సమన్వయంతో పనిచేయాలని, చెక్‌పోస్టుల వద్ద నిరంతర తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ కే. సీతారామారావు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, నగదు, మద్యం పట్టుబడితే వీడియోగ్రఫీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ నోడల్ అధికారి శ్రీధర్‌రెడ్డి, వ్యయ పరిశీలకుల నోడల్ అధికారి ప్రవీణ్ కుమార్, మాస్టర్ ట్రైనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సమస్యలను విస్మరిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్ బాబు

- పుట్ట మధుకర్
- పూర్తయిన ఇళ్లను పంపిణీ చేయకపోవడంపై ఆవేదన
- రింగ్ రోడ్డు నిర్మాణం వల్ల సామాన్యులకు ఇబ్బందులు కలగవద్దు
- అభివృద్ధి పనుల్లో వివక్ష చూపడం సరికాదని విమర్శ

**మంథని, జనవరి 28 (వుదయం):**



మంథని నియోజకవర్గంలో పేద వర్గాల సంక్షేమం, పట్టణ అభివృద్ధి విషయంలో ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు అనుసరిస్తున్న విధానాలు సామాన్యులకు ఇబ్బందికరంగా మారాయని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆరోపించారు. బుధవారం మంథనిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.రింగ్ రోడ్డు నిర్మాణంపై అభ్యంతరం...పట్టణ అభివృద్ధి పేరుతో కొత్తగా చేపడుతున్న రింగ్ రోడ్డు నిర్మాణంపై పుట్ట మధూకర్ స్పందిస్తూ.. ఈ ప్రాజెక్టు వల్ల సామాన్య ప్రజలు తమ భూములను కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తాము కూడా రింగ్ రోడ్డు నిర్మించామని, అయితే ఎవరికీ ఇబ్బంది కలగకుండా ప్రణాళికలు రూపొందించామని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రజల అవసరాల కంటే సొంత ప్రచారానికే ప్రాధాన్యత ఇస్తున్నారని, గరీబోళ్ల భూముల సేకరణ విషయంలో ఎమ్మెల్యే పునరాలోచించాలని కోరారు.

**ఇళ్ల పంపిణీలో జాప్యం...**

గత ప్రభుత్వ హయాంలో పోచమ్మవాడ, కూచిరాజ్‌పల్లి ప్రాంతాల్లో పేదల కోసం నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు అందకుండా జాప్యం చేస్తున్నారని మధుకర్ పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా, ఇప్పటికే పూర్తయిన ఇళ్లను పంపిణీ చేయకుండా కొత్తగా ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు ఇవ్వడం కేవలం ఎన్నికల స్టంట్ అని విమర్శించారు. పేదవాడి సొంతింటి కల నెరవేర్చడంలో ఎమ్మెల్యే చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు.

**వివక్ష లేని అభివృద్ధి కావాలి...**

పట్టణ బ్యూటిఫికేషన్ విషయంలోనూ బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన వంతెనల పట్ల వివక్ష చూపుతున్నారని, ఒక వంతెనకు లైట్లు వేసి మరొకటి వదిలేయడం సరికాదని ఆయన అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మంథని ప్రజలు, మేధావులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు. మంథని పట్టణం సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే నిష్పక్షపాతమైన పాలన అవసరమని ఆయన స్పష్టం చేశారు.




# గురుకుల బాలికలకు షీ టీం భద్రతా అవగాహన

**కోదాడ, జనవరి 28 (వుదయం) :**

జిల్లా ఎస్పీ కె.నరసింహ ఆదేశాల మేరకు కోదాడ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, షీ టీం ఎస్సై మల్లేశం ఆధ్వర్యంలో పట్టణంలోని షిరిడి సాయి నగర్‌లో ఉన్న తెలంగాణ మైనారిటీ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్స్, డ్రగ్స్, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై పోలీసు కళాబృందం ద్వారా అవగాహన కల్పించారు. షీ టీం మహిళా హెడ్ కానిస్టేబుల్ కవిత మాట్లాడుతూ.. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంక్ ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, ఓటీపీ ఇతరులకు తెలియజేయరాదని, అనవసర బ్లూ లింకులను క్లిక్ చేయవద్దని తెలిపారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు, వేధింపులపై 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆకతాయిల వేధింపులపై షీ టీం ఫోన్ నంబర్ 8712686056కు ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. యువత చెడు వ్యసనాలు, లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలని హితవు పలికారు. అనంతరం పోలీసు కళాబృందం సాంస్కృతిక కార్యక్రమాలు, పాటల ద్వారా విద్యార్థినులకు అవగాహన కల్పించింది. ఈ కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపాల్ మాధురి శర్మ, రిటైర్డ్ సీఐ అబ్దుల్ హమీద్, కళాబృందం ఇన్‌చార్జి యల్లయ్యతో పాటు బోధన సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



# సొంత గూటికి చేరిన నాయకులు

**పరకాల జనవరి 28 (వుదయం ప్రతినిధి):**

పరకాల పట్టణం 1వ వార్డుకు చెందిన సీనియర్ నాయకులు బండారి సుగుణాకర్, 5వ వార్డుకు చెందిన యాట ప్రశాంత్ లు బుధవారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీలో చేరారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలపై నమ్మకంతోనే తాము తిరిగి సొంత గూటికి చేరుతున్నామని చేరిన నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నామినేషన్ల స్వీకరణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి, జనవరి- 28 (వుదయం ప్రతినిధి) :**




మినేషన్ల స్వీకరణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అర్బన్ లోకల్ బాడీస్ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేశామని అన్నారు. జిల్లాలోని 3 మున్సిపాలిటీలు, రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో వచ్చిందని కలెక్టర్ తెలిపారు. నేటి నుంచి జనవరి 30 వరకు నామినేషన్లను స్వీకరిస్తున్నామని అన్నారు. పెద్దపల్లి, మంథని సుల్తానాబాద్ మున్సిపాలిటీలలో మున్సిపల్ కార్యాలయాలలో నామినేషన్లు స్వీకరిస్తున్నామని, రామగుండం నగరపాలక సంస్థకు సంబంధించి నామినేషన్ స్వీకరణ కోసం 8 సెంటర్లను ఏర్పాటు చేశామని అన్నారు. జిల్లాలోని 3 మున్సిపాలిటీలు, రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న 124 వార్డుల పరిధిలో 62 రిటర్నింగ్ అధికారులు, 62 అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు నియమించామని తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఎలక్షన్ అబ్జర్వర్లు పద్మజ రాణి, సుజాత, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం, పెద్దపల్లిచే జారీ చేయనైనది.



# సమ్మక్క సారలమ్మ విగ్రహ ప్రతిష్టాపన

- సైనిక్ స్కూల్లో
- ప్రిన్సిపల్ గట్ల సురేందర్

**ఖానాపురం, జనవరి 28 (వుదయం ):**

విద్యార్థులు గిరిజన సంస్కృతి సాంప్రదాయాలను కొనసాగించే విధంగా మేడారం రీతిలోనే సమ్మక్క సారలమ్మ విగ్రహ ప్రతిష్టాపన. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ దామోదర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సుజాత, డ్రాయింగ్ ఉపాధ్యాయుడు సుధాకర్, విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్



- నిబంధనల ప్రకారం నామినేషన్ ప్రక్రియ : జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి.

**కరీంనగర్, జనవరి 28 (వుదయం ప్రతినిధి):**

ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, ఎన్నికల విధుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా హుజురాబాద్, జమ్మికుంట మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటుచేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను కలెక్టర్ బుధవారం సందర్శించారు. నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, నామినేషన్ ఫారాలు, రిజిస్టర్లను పరిశీలించారు. ఆయా వార్డు స్థానాలకు దాఖలైన నామినేషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన తదితర ప్రక్రియలు పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దాఖలైన నామినేషన్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించుకుని, వెంటవెంటనే రోజువారీగా టీ.పోల్ యాప్ లో అప్లోడ్ చేయాలన్నారు. అభ్యర్థులు అన్ని వివరాలతో నామినేషన్ పత్రాలను దాఖలు చేసేలా హెల్ప్ డెస్క్ ద్వారా అవగాహన కల్పించాలని, వారి సందేహాలు నివృత్తి చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి కట్టుబడి, మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఎన్నికల సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 30వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని సూచించారు. నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలన జరిపేలా అవసరమైన సిబ్బందిని నియమించామన్నారు. ఎన్నికల సంఘం నియమ, నిబంధనలను పక్కాగా పాటిస్తూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. కలెక్టర్ వెంట జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ ఎండి. ఆయాజ్, హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్ ఉన్నారు.

# విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలు బిగింపు



**జయశంకర్ భూపాలపల్లి జనవరి 28(వుదయం ):**

మహాదేవపూర్ మండలకేంద్రంలో గ్రామ సర్పంచ్ హసీనా భానో అక్బర్ ఖాన్ విద్యుత్ స్తంభాలకు నూతన వీధి దీపాలు బిగించే కార్యక్రమాన్ని చేపట్టారు గత వారం రోజులుగా మహాదేవపూర్ మండల కేంద్రంలోని విద్యుత్ స్తంబాలకు నూతన వీధి దీపాలు బిగించే కార్యక్రమాన్ని చేపట్టారు దానిలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై వీధులలో బొమ్మపూర్ క్రాస్ వద్ద స్తంభాలకు వీధిలైట్లు గ్రామపంచాయతీ ఎలక్ట్రిషన్ ఠాగూర్ కేసర్ సింగ్ తో పాటు సిబ్బంది కలిసి బిగించారు సర్పంచ్ తోపాటు గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యుల సేవలపై హర్షం వ్యక్తం చేస్తూ అభినందిస్తున్నారు.




# నామినేషన్ కేంద్రాల్లో భద్రతపై ప్రత్యేక దృష్టి

- నామినేషన్ కేంద్రాల పరిశీలన అదనపు కలెక్టర్ రాజా గౌడ్

**ధర్మపురి, జనవరి 28 (వుదయం ప్రతినిధి):**

ధర్మపురిలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను అదనపు కలెక్టర్ రాజా గౌడ్ బుధవారం విస్తృతంగా పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించి, అక్కడ అమలు అవుతున్న ఏర్పాట్లపై అధికారులను వివరాలు తెలుసు కున్నారు.నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులు, వారి ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికా రులను ఆదేశించారు.కౌంటర్ల ఏర్పాటు,క్యూ లైన్ నిర్వహణ, తాగునీరు, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.ఎన్నికల నియమావళి ప్రకారం నామినేషన్లను స్వీకరిం చాలని,ఏ చిన్న లోపం తలెత్త కుండా అప్రమత్తంగా వ్యవహరిం చాలని తెలిపారు.భద్రతాఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని, అనుమ తి లేని వ్యక్తులు నామినేషన్ కేంద్రాల పరిధిలోకి రాకుండా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు.వీడియో గ్రఫీ, సీసీ కెమెరాల పర్యవేక్షణను సమర్థం గా నిర్వహించాలని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, సీఐ రాం నరసింహా రెడ్డి,ఎస్సై మహేష్,ఇతర శాఖల అధికారు లు,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# భక్తులు ప్రశాంతమైన వాతావరణంలో అమ్మవార్లను దర్శించుకోవాలి

- ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం కార్యక్రమం ప్రారంభించిన మంత్రి
- శ్రీ సమ్మక్క సారలమ్మ ఆశీస్సులు నియోజకవర్గ ప్రజల పైన ఉండాలి

**మంథని జనవరి 28 (వుదయం):**



మేడారం వెళ్లే భక్తులు ప్రశాంతమైన వాతావరణంలో అమ్మవార్లను దర్శించుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం మంథని పట్టణం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మేడారం జాతరకు వెళ్లే భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... శ్రీ మేడారం సమ్మక్క సారలమ్మ ఆశీస్సులు నియోజకవర్గ ప్రజల పైన ఉండాలని ఆయన కోరుకున్నారు. మేడారం వెళ్లే భక్తులు జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. చిన్నపిల్లలు, వృద్ధులు జాతరలో అత్యంత జాగురకంగా ఉండాలని పేర్కొన్నారు. మేడారం వెళ్లే భక్తుల కోసం ఆర్యవైశ్య సంఘం సోదరులు ప్రతి సంవత్సరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు. మేడారం వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా బస్సులను అందుబాటులో ఉంచాలని డిపో మేనేజర్ శ్రావణ్ కుమార్ కు మంత్రి తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా జాగ్రత్త తీసుకోవాలని ఆయన సూచించారు. మెడికల్ క్యాంపు గురించి తెలుసుకొని పలు జాగ్రత్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో మంథని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఎల్లంకి వంశీధర్, జిల్లా అధ్యక్షుడు నలుమాసు ప్రభాకర్, వొల్లలా నాగరాజు, రాచర్ల నాగరాజు, కొమురవెల్లి విజయ్ కుమార్, సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



**కరీంనగర్, జనవరి 28 (వుదయం ప్రతినిధి):**

చొప్పదండి మున్సిపాలిటీల్లో జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే బుధవారం పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల్లో ఏర్పాట్లను పర్యవేక్షించారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. హెల్ప్ డెస్క్ వద్ద అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయాలన్నారు. ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని, శాంతియుత వాతావరణంలో నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. దాఖలైన నామినేషన్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలని వెను వెంటనే టీ పోల్ యాప్ లో అప్లోడ్ చేయాలన్నారు. చొప్పదండి మున్సిపల్ పరిధిలోని వార్డు స్థానాలకు దాఖలైన నామినేషన్ వివరాలను ఎన్నికల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

# పైసా ఖర్చు లేకుండా సమ్మక్క సారలమ్మల దర్శనం




- సర్పంచ్ హసీనా బానో అక్బర్ ఖాన్

**జయశంకర్ భూపాలపల్లి జనవరి 28(వుదయం ప్రతినిధి):**

ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన మేడారం సమ్మక్కసారలమ్మల గిరిజన జాతరకు వెళ్లే భక్తులకు పైసా ఖర్చు లేకుండా దర్శనం చేసుకునే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని దానిలో భాగంగానే టీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో మహాలక్ష్మి బస్సులు ఏర్పాటు చేసినట్టు మహాదేవపూర్ సర్పంచ్ హసీనా బానో అక్బర్ ఖాన్ అన్నారు బుధవారం భూపాలపల్లి టిఎస్ఆర్టిసి డిపో మేనేజర్ ఆధ్వర్యంలో మహాదేవపూర్ మండల కేంద్రంలో ఉన్న బస్టాండ్ నుండి బస్సులను ఏర్పాటు చేసే విధంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు



ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న సర్పంచ్ హసీనాబానో అక్బర్ ఖాన్ గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులతో కలిసి మేడారం వెళ్లే బస్సు సర్వీ సులను ప్రారంభించారు ఈ సందర్భంగా సర్పంచ్ హసీనాబానో అక్బర్ ఖాన్ మాట్లాడుతూ మేడారం సమ్మక్కసారలమ్మజాతరకు వెళ్లే భక్తులు బస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని అన్నారు దర్శనానికి వెళ్లే భక్తులకు పైసా ఖర్చు లేకుండా మహాలక్ష్మి పథకం వర్తిస్తుంది అని తెలిపారు మహదేవపూర్ నుంచి వెళ్ళే భక్తులు అధిక సంఖ్యలో ఈ అవకానికి సద్వినియోగం చేసుకొని మేడారం సమ్మక్క సారలమ్మ దీవెలను పొందగలరని అలాగే దర్శన అనంతరం క్షేమంగా గమ్య స్థానాలకు చేరుకునే విధంగా సమ్మక్క సారలమ్మ తల్లుల చల్లని చూపు ప్రజలపై ఉండాలని ఉన్నారు ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పడాల రాజమౌళి, ముహమ్మద్ భీన్ అలీ, గడ్డం వెంకటేశ్వరస్వామి, నల్లభూగ సమ్మయ్య, రాములు,టీ ఎస్ ఆర్ టీ సి సిబ్బంది బి ఎస్ రెడ్డి,నయీం,బాలు, స్వామి, రవిందర్ తోపాటు పాల్గొన్నారు.






# సిద్దిపేటలో గాయత్రి సాహిత విశ్వకర్మ దేవాలయం 10వ వార్షికోత్సవాలు

**సిద్దిపేట, జనవరి 28 వుదయం , ప్రతినిధి :**

సిద్దిపేట పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో గల శ్రీశ్రీశ్రీ గాయత్రి సాహిత విశ్వకర్మ దేవాలయం దశమ (10వ) వార్షికోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ వార్షికోత్సవాల్లో భాగంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మద్ది విరాట్ స్వాముల వారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.కార్యక్రమాల్లో భాగంగా తెల్లవారుజామున సుప్రభాత వేద పారాయణం, శ్రీ లక్ష్మీ గణపతి గాయత్రి మంత్ర పారాయణాలు నిర్వహించారు. అనంతరం



స్వామివారికి పాలాభిషేకాలు నిర్వహించగా ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది.ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ అధ్యక్షులు పప్పోజు యాదగిరి, ఉపాధ్యక్షులు కందారం నాగరాజు, ప్రధాన కార్యదర్శి పుల్లయ్య గారి శ్రీనివాస్, కోశాధికారి మేడోజి నరసింహ చారి, సభాపతి పెంటాచారి, ఉప సభాపతి రంగయ్యలు హాజరై కార్యక్రమాలను పర్యవేక్షించారు.అలాగే కందారం గణేష్ చారి, బీసీ కులాల సంఘాల జేఏసీ చైర్మన్, మనుమయ సంఘ అధ్యక్షులు, వివిధ కుల సంఘాల నాయకులు ఈ వార్షికోత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ భక్తుల సహకారంతో ప్రతి సంవత్సరం దేవాలయ వార్షికోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

# ఉత్తమ ఆర్డీవో సూర్యనారాయణకు ఘన సన్మానం



**కోదాడ జనవరి 28(వుదయం):**

గణతంత్ర దినోత్సవం సందర్భంగా 'ఉత్తమ ఆర్డీవో' అవార్డు అందుకున్న కోదాడ ఆర్డీవో సూర్యనారాయణను విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య మాట్లాడుతూ నిజాయితీగా విధులు నిర్వహించే అధికారులకు ఎప్పుడూ ఆదరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బొల్లు రాంబాబు, కోదాడ యూనిట్ కార్యదర్శి రఘువర ప్రసాద్, ఆర్థిక కార్యదర్శి వీరబాబు, సీనియర్ సిటిజన్ అధ్యక్షులు గడ్డం నర్సయ్య, పొట్టా జగన్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన మంత్రి శ్రీధర్ బాబు



మంథని జనవరి 28 (వుదయం) : తెలంగాణ ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. బుధవారం మంథని మండల పరిధిలోని పుట్టపాక గ్రామంలో సింగర్ కన్నూరి ఆనంద్ తల్లి అనారోగ్యంతో బాధపడుతుండగా ఆరోగ్య పరిస్థితిని మంత్రి శ్రీధర్ బాబు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పుట్టపాక గ్రామ సర్పంచ్ కన్నూరి రాజబాబు, సంపత్ తండ్రి కన్నూరి ఓదెలు మరణించగా వారి కుటుంబ సభ్యులను మంత్రి శ్రీధర్ బాబు పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. ఆయన వెంట మాజీ సింగల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, నాయకులు మంథని సత్యం, మాజీ ఎంపీపీ కొండ శంకర్, సోషల్ మీడియా ఇన్చార్జి ఆరెళ్ళి కిరణ్ గౌడ్, తదితరులు ఉన్నారు..

# భూపాలపల్లిలో గులాబీ జెండా ఎగురవేస్తాం

- కాంగ్రెస్ బెదిరింపు బ్లాక్మెయిల్ రాజకీయాలకు భయపడం
- డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి





జయశంకర్ భూపాలపల్లి జనవరి 28(వుదయం జిల్లా ప్రతినిధి): భూపాలపల్లిలో గులాబీ జెండా ఎగురవేస్తాం కాంగ్రెస్ బెదిరింపు బ్లాక్మెయిల్ రాజకీయాలకు భయపడం అని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి మరియు శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ అన్నారు బుధవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్ కార్యక్రమంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి మరియు శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు రానున్న మున్సిపాలిటీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పై విమర్శలు చేశారు. అనంతరం మీటింగ్ హాల్లో ముఖ్య కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్ని మీ అందరి అభిప్రాయం మేరకు పార్టీ నిర్ణయించిన అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని పిలుపునిచ్చారు.వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో భూపాలపల్లి మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను బిఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుని భూపాలపల్లిలో గులాబీ జెండా ఎగురవేస్తామని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ 26 నెలల కాంగ్రెస్ పాలనలో భూపాలపల్లి అభివృద్ధి పూర్తిగా శూన్యమైందన్నారు. ఎన్నికలు దగ్గరపడుతున్నాయని రోజుకో మంత్రి వచ్చి మున్సిపాలిటీ వందకు పైగా శిలాఫలకాలు వేస్తూ, శిలాఫలకాలు వేసిన కాలనీల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించకపోతే నిధులు కట్ చేస్తామని ప్రజలను బెదిరించడం సిగ్గుచేటని మండిపడ్డారు.బిఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు ఆశావాహులు అధిక సంఖ్యలో ముందుకు వస్తుండడంతో ఓర్వలేని ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిఆర్ఎస్ అభ్యర్థులను బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.బెదిరింపు,బ్లాక్మెయిల్ రాజకీయాలే కాంగ్రెస్ లక్ష్యమని విమర్శించారు.అంబేద్కర్ సెంటర్ నుంచి కేటీకే-2 ఇంక్లైన్ వరకు వేసే రోడ్డుకు నిధులు తీసుకొచ్చింది తానేనని, అప్పట్లో కాంట్రాక్టర్ను బెదిరించి పనులు ఆపివేసిన కాంగ్రెస్ నాయకులు ఎన్నికలు ఉన్నాయనే కారణంతో ఇప్పుడు పనులు ప్రారంభిస్తున్నారని అన్నారు. భూపాలపల్లిలో మెడికల్ కాలేజ్తో పాటు జూనియర్, డిగ్రీ కళాశాలను తీసుకువచ్చి పట్టణాన్ని విద్యా కేంద్రంగా తీర్చిదిద్దింది గుర్తు చేశారు.తాను ఓడిన తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం భూపాలపల్లి అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని, ఎన్నికలు ఉన్నాయనే కారణంతో ఇప్పుడు పనులు మొదలుపెడుతున్నారని అన్నారు. ప్రారంభిస్తున్న పనులకు సంబంధించిన నిధుల వివరాలను ప్రజలకు చూపించాలని డిమాండ్ చేశారు.అనంతరం ఎమ్మెల్సీ, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ మాట్లాడుతూ బిఆర్ఎస్ హయాంలోనే భూపాలపల్లి అత్యంత వేగంగా అభివృద్ధి చెందిందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు 50 శాతం మందికే రైతుబంధు ఇచ్చి మిగిలిన రైతులను మోసం చేసిందని విమర్శించారు.బిఆర్ఎస్ పార్టీ ఆశావాహులను బెదిరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, ఇలాంటి రాజకీయాలకు భూపాలపల్లి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ బెదిరింపులకు భయపడకుండా గులాబీ జెండాను భూపాలపల్లిలో ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధర్మపురిలో భారీ అగ్నిప్రమాదం



- స్టార్ బిర్యానీ సెంటర్ దగ్ధం
- రూ. 25 లక్షల పైగా ఆస్తి నష్టం
- షార్ట్ సర్క్యూటే కారణమని ప్రాథమిక నిర్ధారణ
- బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విన్నపం

ధర్మపురి, జనవరి 28 (వుదయం ప్రతినిధి): ధర్మపురి పట్టణంలో మంగళ వారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమా దం సంభవించింది. స్థానిక స్టార్ బిర్యానీ సెంటర్ లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో బిర్యానీ సెంటర్ లోని వంట సామగ్రి, ఫర్నిచర్ పూర్తిగా కాలి బూడిద య్యాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణ కేంద్రం లోని ఎండి సాబీర్ కు చెందిన స్టార్ బిర్యానీ సెంటర్లో మంగళ వారం అర్ధరాత్రి సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. క్షణాల్లో మంటలు బిర్యానీ సెంటర్ అంతటా వ్యాపించాయి. స్థానికుల సమాచారంతో ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశాయి. అయితే అప్పటికే సెంటర్లోని ఫర్నిచర్, వంట సామాగ్రితో పాటు గల్లా పెట్టెలో ఉన్న రూ. 97 వేల నగదు అగ్నికి ఆహుతయ్యాయని మొత్తం 25 లక్షల ఆస్థి నష్టం జరిగిందని యజమాని సోదరుడు షబ్బీర్ ఆవేదన వ్యక్తం చేశారు.బిర్యానీ సెంటర్ యజమాని సాబీర్ ప్రస్తుతం అనారోగ్యంతో ఆస్ప త్రిలో చికిత్స పొందుతున్నారు. యజమాని ఆస్పత్రిలో ఉన్న సమయంలోనే ఈ ప్రమాదం జరగడం ఆ కుటుంబాన్ని కోలుకో లేని దెబ్బ తీసింది. తమకున్న ఏకైక జీవనాధారం కాలిపోవడం తో, ప్రభుత్వం స్పందించి తమను ఆర్థికంగా ఆదుకోవాలని బాధితు డి కుటుంబ సభ్యులు వేడుకుం టున్నారు.ప్రమాదం జరిగిన తీరును ఎస్సై మహేష్ పరిశీలిం చారు. షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా భావిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వెల్లడించారు.

# మోడీకి బుద్ధి చెప్పాలి





- జూపాక శ్రీనివాస్
- కరీంనగర్ ఉమ్మడి జిల్లా

పెద్దపల్లి జనవరి 28 (వుదయం ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు వ్యతిరేక కూలి వ్యతిరేక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కేంద్ర కమిటీ ఈరోజు దేశవ్యాప్తంగా నిరసన దినం పాటించాలని ఇచ్చిన పిలుపులో భాగంగా స్థానిక NTPC గెట్ వద్ద మాస్ లైన్ ఆధ్వర్యంలో నిరసన దినంగా పాటిస్తూ చేపట్టడం జరిగింది ఈ సందర్భంగా మాస్ లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ జిల్లా నాయకులు గుమ్మడి వెంకన్న ఇసంపల్లి రాజేందర్ లు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్నటువంటి ప్రభుత్వం దేశవ్యాప్తంగా కార్మికులకు హక్కులు లేకుండా రక్షణ లేకుండా దుర్మార్గమైన విధానాలు కొనసాగిస్తుందని విదేశీ మరియు స్వదేశీ కార్పొరేట్లకు అనుకూలంగా వారి ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేస్తుందని కార్మికుల హక్కులను కాలరాస్తుందని మరోవైపు దేశవ్యాప్తంగా రైతాంగంపై దాడులు చేస్తుందని ఇంకోవైపు ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి దాని స్థానంలో వి బి జి రామ్ జి చట్టాన్ని ప్రవేశపెట్టిందని కార్పొరేట్ల ప్రయోజనం కోసం పర్యావరణ విధ్వంసాన్ని చేస్తూ ఆదివాసుల హక్కులు కాల రాస్తున్నారు మరోవైపు మతపరమైన దాడులను కొనసాగిస్తుందని ప్రజల హక్కుల్ని కాపాడడం కోసం ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించాలని జూపాక శ్రీనివాస్ పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు గుమ్మడి వెంకన్న ఇసంపల్లి రాజేందర్ ఆడెపు శంకరన్న గొల్లపల్లి చంద్రన్న మార్త రామన్న పొల్లూరి భూషణం రాయమల్లు. పోచం నర్సయ్య లక్ష్మి స్వరూప తదితరులు పాల్గొన్నారు. విప్లవ అభినందనలతో.గుమ్మడి వెంకన్న జిల్లా నాయకులు

# రంజాన్ మాసం సందర్భంగా అన్ని సౌకర్యాలు కల్పించాలి

- అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే





కరీంనగర్, జనవరి 28 (వుదయం ప్రతినిధి): వచ్చే నెల 17 నుండి రంజాన్ మాసం ప్రారంభమవుతున్న దృశ్య జిల్లాలోని మసీదులు, ఈద్గాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సంబంధిత అధికారులను ఆదేశించారు.రంజాన్ మాసం ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో అడిషనల్ కలెక్టర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు.సామూహిక నమాజ్ చేసే ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. మసీదుల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, దోమల సమస్య రాకుండా ఫాగింగ్ చేయాలని కలెక్టర్ సూచించారు. రంజాన్ పర్వదినం నేపథ్యంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని, వీధిలైట్లు మరమ్మతులు ఉన్నచోట కొత్తవి అమర్చాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ప్రార్థన ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని తెలిపారు.ప్రార్థన సమయాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఎలక్ట్రిసిటీ అధికారులను ఆదేశించారు. నగరంలో రద్దీ ఎక్కువగా ఉండే చోట ఉన్న ప్రార్థనా మందిరాల వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని ఏసీపీకి సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డిఓ మహేశ్వర్, అడిషనల్ డిసిపి వెంకట రమణ, మున్సిపల్, ట్రాఫిక్, పోలీస్, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

# పీఎం శ్రీ పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం



కోదాడ జనవరి 28 (వుదయం): పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, కోదాడలో పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం స్టడీ అవర్స్ సమయంలో అల్పాహారం కార్యక్రమాన్ని మండల విద్యాధికారి ఎం.డి. సలీం షరీఫ్ ప్రారంభించారు. రోజుకొక రకం పోషకాహారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు డి. మార్కండేయ, ఉపాధ్యాయులు లింగయ్య, రామకృష్ణ, ఖాజామీయా, కళ్యాణి, కనకమ్మ, సైదయ్య, బడుగుల సైదులు పాల్గొన్నారు.

# వినియోగదారుల ఆర్థిక నేస్తం గాయత్రీ బ్యాంక్

- ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆర్డీవో మున్సిపల్ కమిషనర్ ఏసిపి.





పరకాల జనవరి 28 (వుదయం ప్రతినిధి): పరకాల ది గాయత్రి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు యొక్క శాఖను పరకాల రెవిన్యూ డివిజన్ అధికారి బుధవారం రోజున డాక్టర్ కి నారాయణ చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి పరకాల మున్సిపల్ కమిషనర్ సోముల అంజయ్య పరకాల అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సిర్ర సతీష్ బాబు మరియు బ్యాంక్ పాలకవర్గ సభ్యులు పుర ప్రముఖులు సహకార అధికారులు పాల్గొని బ్యాంకు యొక్క వివిధ విభాగాలను ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో డాక్టర్ కే నారాయణ మాట్లాడుతూ 2000 సంవత్సరములో యూనిట్ బ్యాంకుగా ప్రారంభించబడిన గాయత్రి బ్యాంకుకు వినియోగదారులకు పారదర్శక సేవలు అందించాలని ఉద్దేశంతో కృషి చేస్తూ నేడు మల్టీ స్టేట్ బ్యాంకు గా 78.75 కోట్ల వ్యాపారాన్ని సాధించి ఎనిమిది లక్షల 90000 దారులతో తెలంగాణ లోని ఆపరేటివ్ బ్యాంకులలో మొదటి స్థానంకు చేరుకున్నారని అన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీ సోమిరెడ్డి అంజయ్య మాట్లాడుతూ పరకాల యందు గాయత్రి బ్యాంక్ యొక్క బ్రాంచ్ని ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉందని బ్యాంకు వినియోగదారుల ఆర్థిక అవసరాలను తీరుస్తుందని బ్యాంకుకు పనితీరును అభినందించారు.అనంతరం సిర్ర సతీష్ బాబు మాట్లాడుతూ... బ్యాంకు యందు టెక్నాలజికల్ పేమెంట్ సేవలలో పాటుగా నిరక్షరాస్యులకు సహాయకంగా ఉండేందుకు ప్రత్యేక హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేయడం ఉదయం 10 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు బ్యాంకు సేవలు అందుబాటులో ఉండటం ఖాతాదారులకు అవసరమైతే ఫోటో మరియు జిరాక్స్లను బ్యాంకు ఉచితంగా అందించడం అంటే చాలా సేవలు వినుతంగా ఉన్నాయని గాయత్రి నిర్భయ సేవింగ్ ఖాతా ద్వారా రెండు లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యాలు అందిస్తున్నారని తెలియజేశారు. ఇట్టి సేవలను పరకాల వాసులు వినియోగించుకొని బ్యాంకును ఆదరించాలని కోరారు.

# పోతారాజు అశోక్ కు కాంస్య పతకం



పరకాల జనవరి 28 (వుదయం ప్రతినిధి): ఉదయ్‌పూర్‌లో ఇటీవల నిర్వహించిన ఆల్ ఇండియా ఫైర్ సర్వీస్ కంట్రోల్ బోర్డు మీట్-2026లో 5 కిలోమీటర్ల పరుగుపందెం విభాగంలో హనుమకొండ జిల్లా, పరకాల మండలం, నాగారం గ్రామానికి చెందిన పోతరాజు అశోక్ కాంస్య పతకం సాధించారు. దేశవ్యాప్తంగా పాల్గొన్న ప్రతిభావంతుల మధ్య అశోక్ విజయాన్ని సాధించడం గర్వకారణమని గ్రామస్తులు తెలిపారు. క్రమశిక్షణతో కూడిన నిరంతర సాధన వల్లే ఈ స్థాయికి చేరుకున్నారని పేర్కొన్నారు.ఈ ఘనత పట్ల నాగారం గ్రామ ప్రజలు, స్నేహితులు అశోక్‌కు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఆయన విజయం యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# సిపిఎం అభ్యర్థులను గెలిపించండి





- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోట్ల.చక్రపాణి. పిలుపు.

పరకాల జనవరి 28 (వుదయం ప్రతినిధి ): పరకాల మునిసిపల్ ఎన్నికలలో సిపిఎం పార్టీ మూడు వార్డులలో పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం పార్టీ హనుమకొండ జిల్లా కార్య దర్శి వర్గ సభ్యులు బోట్ల చక్రపాణి పరకాల ఓటర్ మహాశయులకు విజ్ఞప్తి చేశారు. పరకాల పట్టనంలోని స్థానిక అమర దామంలో బొచ్చు హేమంత్ అధ్యక్షతన పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై చక్రపాణి మాట్లాడుతూ... పేదలు కార్మికులు విద్యార్థి యువజన వృత్తిదారుల సమస్యలపై సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం మూలంగా పరకాల అభివృద్ధికి నోచుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు పేదలు నివసించే కాలనీలలో రోడ్లు డ్రైనేజీలు బోర్లు చేతిపంపులు పనిచేయడం లేదని స్మశాన వాటికలు సరైన వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పార్కులు లైబ్రరీలు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయకపోవడం దుర్మార్గమని ఆయన అన్నారు. ఇండ్లు లేని పేదలు అనేక అబస్థలు పడుతున్న వారి సమస్యలు పాలకవర్గాలు పరిష్కరించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలలో ప్రజా సమస్యలను ఏజెండాగా కాకుండా కులం మతం. డబ్బుతో . పేర్లతో ప్రజలను మభ్య పెట్టాలని చూసే పార్టీలకు ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారాన్ని కోసం పోరాటాలు నిర్వహిస్తున్న సిపిఎం పార్టీ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కే లింగయ్య .సిపిఎం పట్టణ కార్యదర్శి బొచ్చు కళ్యాణ్ మడికొండ ప్రశాంత్ బొచ్చు ఈశ్వర్ రాజమౌళి పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే పెద్దికి స్వామివారి కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రిక



- సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు మాడ్రాజు వెంకన్న

ఖానాపురం, జనవరి 28 (వుదయం ): మండలంలోని ధర్మరావుపేట గ్రామంలోని ఫిబ్రవరి 2న నిర్వహించే శ్రీ స్వయంభు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ పగడాల వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవ కార్యక్రమాని తిలకించడానికి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి స్వామివారి కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను అందజేసి కళ్యాణంను తిలకించడానికి రావాల్సిందిగా కోరినట్లు మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు మాడ్రాజు వెంకన్న తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు మాట్లాడుతూ గ్రామంలోని పగడాల గుట్ట వద్ద నిర్వహించే శ్రీ స్వయంభు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ పగడాల వెంకటేశ్వరస్వామి ఐదవ వార్షిక కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో గ్రామస్తులతోపాటు మండల ప్రజలందరూ పాల్గొని కళ్యాణ మహోత్సవాన్ని తిలకించి స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ తక్కలపల్లి రవీందర్ రావు, పట్టణ అధ్యక్షుడు నాగలి వెంకట నారాయణగౌడ్, సీనియర్ నాయకులు మునిగాల వెంకటరెడ్డి, నల్ల మనోహర్ రెడ్డి, మండలం సర్పంచుల ఫోరం ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్, మండల నాయకులు బాధవత్ బాలకిషన్, ఆబోతు అశోక్, లకావత్ ప్రవీణ్, బానోత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వీధులలో తిరిగే జంతువుల పట్ల జాలి చూపాలి





- ఘనంగా జంతు సంక్షేమ పక్షోత్సవాలు.
- పశు వైద్య అధికారి డాక్టర్ శ్రీ లక్ష్మి.

ఖానాపురం, జనవరి 28 (వుదయం ప్రతినిధి): వీధులలో తిరిగి కుక్కలను, పిల్లలను, ఆవులను, గేదెలతో పాటు తదితర జంతువుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండుకుంటూ జాలి చూపాలని జిల్లా పశు వైద్య అధికారి డాక్టర్ ఎం బాల కృష్ణ ప్రజలకు తెలిపారు. మండల కేంద్రంలోని జంతు సంక్షేమ పక్షోత్సవాలను పశు వైద్య మరియు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్లు పశు వైద్య అధికారి డాక్టర్ శ్రీ లక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి పశువైద్యశాల వరకు జిల్లా జంతు హింస నివారణ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులతో రైతులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పశు వైద్యాధికారి మాట్లాడుతూ ఈనెల 31 వరకు జంతు సంక్షేమ పక్షోత్సవాలను నిర్వహిస్తారని తెలుపుతూ, వీధిలో తిరిగే కుక్కలకు రబీస్ వ్యాధి సోకకుండా ఉచితంగా టీకాలను వేసినట్లు తెలిపారు. అలాగే గ్రామ సర్పంచ్ దాసరి రమేష్ మాట్లాడుతూ పక్షులు నివసించే ఆవాసాలైన వృక్షాలను నరక వద్దని తెలుపుతూ పక్షులకు అందుబాటులో నీటి తొట్టీలను ఏర్పాటు చేయాలని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పశు వైద్య అధికారి ఎడి బియన్ రెడ్డి, పశు వైద్య బృందం ఎం. వింధ్య, బి సురేష్. రాధిక, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కత్తి కుమారస్వామి, పంచాయతీ కార్యదర్శి సుప్రజా, ఉప సర్పంచ్ ఉప్పు రాజు, వార్డు సభ్యులు గుల్లపల్లి విజయ్, చలిగంటి మల్లికార్జున్, పశు వైద్య బృందం ఇసాక్, సాయి విశ్వనాథ్, మజీద్, అన్వేష్, గోపాల మిత్ర లక్ష్మీనారాయణ, నరసింహచారి, రైతు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల విద్యార్థి కార్తీక్ కు గ్రామ యువత ఆర్థిక సహాయం



జనవరి 28 (ధర్మసాగర్ వుదయం ) ఈరోజు జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ధర్మసాగర్ లో పదవ తరగతి చదువుతున్న కార్తీక్ జిల్లా ,రాష్ట్రస్థాయి సాఫ్ట్బాల్ ఛాంపియన్షిప్ పోటీలలో రాణించి మార్చి మొదటి వారంలో చతిస్గడ్ రాష్ట్రంలో జరగబోయే జాతీయస్థాయి చాంపియన్షిప్ పోటీలకు తెలంగాణ రాష్ట్ర జట్టు లో సభ్యుడుగా ఎన్నికయ్యారు. ఈ పోటీలలో పాల్గొనేందుకు వీలుగా ధర్మసాగర్ గ్రామ యువ నాయకుడు ప్రణయ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ యువకులు చంద్రశేఖర్, ప్రశాంత్ ,మాచర్ల కుమార్, నక్క శీను, కొలిపాక అశోక్ కౌశిక్ లతోపాటు 4 వార్డ్ మెంబర్ భానుచందర్ 14వ వార్డు మెంబర్ రఘు తదితరులు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ధర్మ ప్రకాష్ అధ్యక్షతన "క్రీడలకు భరోసా" సదస్సు నిర్వహించారు. కార్తీక్కు స్పోర్ట్స్ షూస్ మరియు మూడు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని, అలాగే ఈ పాఠశాల పూర్వ విద్యార్థి భారత రాష్ట్ర సమితి నాయకులు గుడి వెనుక దేవేందర్ తన తోటి పదవ తరగతి బ్యాచ్ మిత్రులు చిలక రవీందర్, జలంధర్ సమక్షంలో కార్తీక్కు 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వీరంతా పాఠశాల విద్యార్థుల క్రీడలు, సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు విద్యాభివృద్ధికి గ్రామ యువతగా, పూర్వ విద్యార్థులుగా సంపూర్ణ సహకారం అందిస్తామని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కవిత, రాజమ్మ ,రామకృష్ణ, రమ్యశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా ఖానాపూర్‌లో శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర



మంథని, జనవరి 28 (వుదయం ప్రతినిధి) : శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర ఖానాపూర్ లో ఘనంగా ప్రారంభమైంది. ప్రధాన పూజారి బిరుదు లచ్చయ్య అమ్మవార్లకు ప్రత్యేక పూజ నిర్వహించారు. జాతరలో భాగంగా తొలి రోజు గ్రామ సర్పంచ్ సంగెం అరుణ గట్టయ్య, మాజీ సర్పంచ్ సేమంతుల ఓదెలు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజ నిర్వహించారు. మంథని మండలంలోని చుట్టుపక్క గ్రామ ప్రజలు అమ్మవార్లను దర్శించుకుని, అక్కడే భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చి తొలి రోజు ఘనంగా విజయవంతం చేశారు. అమ్మ వారి ఆశీస్సులతో గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు వారు తెలిపారు.

# ధర్మపురి మున్సిపాలిటీలో నామినేషన్ల స్వీకరణ ప్రారంభం

- 15వార్డుల్లో.. తొలిరోజు 10 నామినేషన్లు దాఖలు

ధర్మపురి జనవరి 28(వుదయం): ధర్మపురి మున్సిపాలిటీలో బుధవారం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తం 15 వార్డులకు గాను నామినేషన్లు స్వీకరిస్తుండగా, తొలి రోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 10 వార్డుల నుంచి మొత్తం 10 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్లు సమర్పించిన అభ్యర్థులు 9 మంది ఉన్నారు.3వ వార్డులో ఇందారపు వాసు,4వ వార్డులో బాకీ చంద్రశేఖర్,7వ వార్డులో సంగి సత్తెమ్మ,9వ వార్డులో కొంపల పద్మ,10వ వార్డులో మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో సంగి సత్తెమ్మ,ఓడ్నాల మదన్ కుమార్ ఒక్కొక్క నామినే షన్ దాఖలు చేయగా, ఒక డమ్మీ నామినేషన్ ఉంది.11వ వార్డులో జక్కు పద్మ,13వ వార్డు లో చిపిరిశెట్టి రాజేష్,14వ వార్డులో సంగి రేఖ నామినేషన్లు దాఖలు చేశా రు.మొత్తంగా తొలి రోజు 10 నామినే షన్లు స్వీకరించామని ఎన్నికల అధికా రులు తెలిపారు. మిగతా రోజుల్లో నామినేషన్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.



## 10వ వార్డు కౌన్సిలర్: బండారి సమ్మయ్య

.మంథని, జనవరి 27
వుదయం ప్రతినిధి



మంథని మున్సిపాలిటీకి త్వరలో జరగనున్న ఎన్నికల వేళ రాజకీయ సందడి మొదలైంది. పట్టణంలోని 10వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా బండారి సమ్మయ్య పోటీ చేయబోతున్నారు.గతంలో మంథని పట్టణ ఎంపీటీసీగా పనిచేసిన అనుభవం ఉన్న సమ్మయ్యకు వార్డులో మంచి పట్టు ఉంది. నిత్యం ప్రజల మధ్య ఉంటూ, అందరితో కలుపుగోలుగా ఉండే ఆయనను ఈసారి వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా నిలబెట్టాలని అభిమానులు, ఆత్మీయులు పెద్ద సంఖ్యలో కోరడంతో ఆయన ఎన్నికల బరిలో నిలవాలని నిర్ణయించుకున్నారు.ఈ సందర్భంగా బండారి సమ్మయ్య మాట్లాడుతూ.. వార్డు ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉంటూ, వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. తనను ఆశీర్వదించాలని ఆయన కోరుతున్నారు.

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ టి.శ్రీనివాసరావు



గద్వాల జనవరి 28
(వుదయం ప్రతినిధి)

గద్వాల జిల్లాలోని మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్లు ప్రారంభమైన తరుణంలో జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు గద్వాల పట్టణంలోని మున్సిపాలిటీ నామినేషన్ స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ అక్కడ జరుగుతున్న నామినేషన్ ప్రక్రియ గురించి మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ తో చర్చించారు. అలాగే గద్వాల డీఎస్పీ వై. మొగిలయ్యతో నామినేషన్ ప్రక్రియ భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. శాంతియుతంగా, సజావుగా సాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు .అలాగే నామినేషన్ కేంద్రం పరిసరాల్లోని వాహనాల పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించి, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## సత్తుపల్లిలో 3వ వార్డుకు నామినేషన్ వేసిన బిఆర్ఎస్ అభ్యర్థి కూసంపూడి మాధురి



సత్తుపల్లి జనవరి 28
(వుదయం ప్రతినిధి)

సత్తుపల్లి మున్సిపాలిటీలో ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైన సందర్భంగా మొదటగా బిఆర్ఎస్ పార్టీ బలపర్చిన మూడో వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా మున్సిపల్ మాజీ చైర్మన్ కూసంపూడి మహేష్ సతీమణి కూసంపూడి మాధురి నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో కూసంపూడి రామారావు వల్లభనేని పవన్ చాంద్ పాషా, నెల్లూరు అంకమరాజు తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు

# అందరు సహకరించాలి

### మున్సిపల్ ఎన్నికల కోడ్ నియమావళిని పాటించాలి...జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్




జగిత్యాల, జనవరి 28
(వుదయం ప్రతినిధి)

ఎన్నికల కోడ్ నియమావళిని అందరు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ అన్నారు బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని మిని సమావేశ హాల్ లో ఏర్పాటు చేసిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ తో పాటు జిల్లా అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) బి రాజ గౌడ్ పాల్గొని పలు సూచనలు చేశారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలకు సంబంధించిన గోడ రాతలు వాల్ పోస్టర్ ఫ్లెక్సీ బ్యానర్లు తొలగించాలని సూచించారు నామినేషన్ కేంద్రాలు పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల దూరం నిబంధన పాటించాలని కోరారు ఎన్నికలు జరుగు 5 మున్సిపాలిటీల్లో అనుమతులు లేకుండా సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు అన్ని రాజకీయ పార్టీల ప్రతి నిధులు ఎన్నికల నియమావళి పాటించాలని సూచించారు రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనలకు లోబడి ఎన్నికల ఖర్చును వినియోగించుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు ఎన్నికల ప్రచార కరపత్రాలపై తప్పనిసరిగా ప్రింటర్ల సమాచారం ఉండాలని రాజకీయ పార్టీలకు సూచించారు జిల్లాలో ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు సంహకరించాలని కోరారు ఈ సమావేశంలో జిల్లా నోడల్ అధికారులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు జిల్లా ఎన్నికల విభాగం తదితరులు పాల్గొన్నారు

### నామినేషన్ స్వీకరణ కేంద్రాలను

# పరిశీలించిన జిల్లా కలెక్టర్



నారాయణపేట టౌన్ జనవరి 28(వుదయం ప్రతినిధి)

నారాయణపేట జిల్లా కేంద్ర మున్సిపాల్టీ కార్యాలయంలో మున్సిపల్ వార్డు ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను బుధవారం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సిక్తా పట్నాయక్ పరిశీలించారు. ముందుగా ఫ్రీ స్క్రూటినీ, హెల్ప్ డెస్క్ ను సందర్శించి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఏమైనా అనుమానాలు ఉంటే హెల్ప్ డెస్క్ ద్వారా నివృత్తి చేయాలని సూచించారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 24 వార్డుల నామినేషన్ల స్వీకరణ కేంద్రాలలో ఆర్ వో ల మాట్లాడి నామినేషన్లు తీసుకునేందుకు ఏమేమి ఏర్పాట్లు చేశారని, అవసరమైన అన్ని పత్రాలు, వార్డు రిజిస్టర్ లు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ వేసేందుకు వచ్చేఅభ్యర్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కమిషనర్ కు సూచించారు. నామినేషన్ల స్క్రూటినీ సమయంలో ఎక్కువ మంది అభ్యర్థులు వస్తే ఎలా చేస్తారనీ ప్రశ్నించగా ఒక్కొక్కరిని పిలుస్తామని మిగతా వారు వేచి ఉండేందుకు బయట షామియానాలు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. ఫ్రీ స్క్రూటినీ ఉన్నందున నామినేషన్లు తిరస్కరణ కు గురయ్యే అవకాశం తక్కువగా ఉంటుందని ఆర్.వో చెప్పారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నారాయణ పేట, మక్తల్, కోస్గి, మద్దూర్ మున్సిపాలిటీల ఎన్నికలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఆయా మున్సిపాలిటీల్లో బుధవారం నుంచి నామినేషన్ల స్వీకరణ కోసం అన్ని రకాల సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు కల్పించినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ నామినేషన్లు స్వీకరించాలని అధికారులకు సూచించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నేటి నుంచి ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగుతుందని, నామినేషన్ల ఉప సంహరణ తర్వాత వచ్చే నెల 11న పోలింగ్ జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు.

### సంపూర్ణత అభియాన్ లక్ష్యాలను

# వంద శాతం సాధించాలి




గద్వాల జనవరి 28
(వుదయం ప్రతినిధి)

ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంలో నిర్దేశించిన సంపూర్ణత అభియాన్ లక్ష్యాలను వంద శాతం చేరుకునేలా సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ పిలుపునిచ్చారు.నీతి అయోగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం లో భాగంగా బుధవారం ఢిల్లీ నుంచి నీతి అయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం సంపూర్ణత అభియాన్ 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించి, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ కు ఎంపికైన దేశంలోని 112 జిల్లాలలోని 513 బ్లాక్ లకు చెందిన ఆయా జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఈవో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సంపూర్ణత అభియాన్ 2.0 కార్యక్రమం ఈనెల 28 నుంచి ఏప్రిల్ 14 వరకు మొత్తం 77 రోజులపాటు కొనసాగు తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఆయా బ్లాక్ లకు సంబంధించిన వివిధ శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. ఇందుకుగాను అధికారులు గ్రామస్థాయి సర్పంచుల నుంచి రాష్ట్ర స్థాయి ప్రజాప్రతినిధుల వరకు అందరి సహకారం తీసుకొని ముందుకెళ్లాలన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని గట్టు మండలం ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ కు ఎంపిక వడంతో ఐడిఓసీలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి వీసీలో పాల్గొన్నారు.

వీసీ అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఐసిడిఎస్ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి కేంద్రాల్లో 6 నెలల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేసేలా సంబంధిత అధికారులు తరచూ కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. మరుగుదొడ్లు లేని అంగన్వాడి కేంద్రాల్లో నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ విద్యార్థుల సంఖ్య ఆధారంగా అవసరమైనన్ని టాయిలెట్స్ నిర్మాణం చేపట్టాలన్నారు. పశువులకు టీకాల విషయంలోనూ 100% లక్ష్యాలను సాధించేలా పనిచేయాలని పశుసంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీఈవో విజయలక్ష్మి, గట్టు మండలం ఎంపీడీవో చెన్నయ్య, ఐసిడిఎస్ సిడిపిఓ హేమలత, పిఆర్ ఏఈ రాజ్ కుమార్, డా. వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ జెండా ఎగరాలి

### అశ్వారావుపేట నూతన మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరాలి




ఎమ్మెల్యే జారె ఆదినారాయణ
అశ్వరావుపేట జనవరి 28
(వుదయం ప్రతినిధి ):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నూతన మున్సిపాలిటీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గౌరవ శాసన సభ్యులు శ్రీ జారె ఆదినారాయణ ఎన్నికల ప్రచారాన్ని మరింత వేగవంతం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలతో ముఖాముఖీగా మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకుంటూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.ప్రచారంలో భాగంగా ఇంటింటి సందర్శనలు, కాలనీ స్థాయి సమావేశాలు, వార్డు కమిటీలతో చర్చలు నిర్వహిస్తూ ప్రజలతో నేరుగా మమేకమవుతున్న ఎమ్మెల్యే, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాహిత, సంక్షేమ పథకాలను ప్రజలకు విస్తృతంగా వివరిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కేవలం రెండు సంవత్సరాల వ్యవధిలోనే ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నదని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ,రైతులకు రైతు భరోసా, మహిళలకు ఆర్థిక భద్రత కల్పించే పథకాలు, పేదలకు ఉచిత వైద్యం, విద్యార్థులకు విద్యాసహాయం, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు వంటి పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం నిజమైన ప్రజాపాలన అందిస్తోందని తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా చేపట్టిన ఈ పథకాలు ప్రతి కుటుంబానికి నేరుగా ఉపయోగపడుతున్నాయని అన్నారు.అశ్వారావుపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి పనులు ఊపందుకున్నాయని, రహదారుల అభివృద్ధి, త్రాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, పారిశుధ్య కార్యక్రమాలు, పాఠశాలలు–ఆసుపత్రుల బలోపేతం వంటి అనేక పనులు చేపట్టామని ఎమ్మెల్యే వివరించారు. మున్సిపాలిటీగా ఏర్పడిన తరువాత పట్టణాభివృద్ధికి మరింత అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలంటే కాంగ్రెస్ పార్టీ నాయకత్వమే అవసరమని ఆయన స్పష్టం చేశారు.కాంగ్రెస్ పార్టీ పాలనపై ప్రజల్లో ఏర్పడిన విశ్వాసం కారణంగా ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, యువకులు కాంగ్రెస్ సిద్ధాంతాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని చెప్పారు. పార్టీలో చేరిన వారిని సాదరంగా ఆహ్వానిస్తూ, వారి అనుభవం, సేవలను పార్టీ బలోపేతానికి వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపాలిటీలో పోటీ చేస్తున్న 22 మంది కౌన్సిలర్లు కార్యకర్తలు, అభిమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో గెలుపు సాధించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు, కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. గత ఎన్నికల్లో ఎదురైన లోటుపాట్లను విశ్లేషిస్తూ, వాటిని సరిదిద్దుకునే దిశగా స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని ఎమ్మెల్యే సూచించారు.ప్రతి కార్యకర్త వార్డు స్థాయిలో ప్రజల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని, ప్రజల సమస్యలను పార్టీ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తే అశ్వారావుపేట నూతన మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు."ప్రజల నమ్మకమే మా బలం. ప్రజల కోసం పనిచేసే కాంగ్రెస్ పార్టీకి అశ్వారావుపేట ప్రజలు మరోసారి అవకాశం ఇవ్వాలి. అశ్వారావుపేట నూతన మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరడమే మన లక్ష్యం" అని పిలుపునిచ్చారు.

# కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలి

### వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలి

చాపర్తి కుమార్ గాడ్గే బీసీ జానాధికార సమితి రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



రాయపర్తి జనవరి 28
(వుదయం ప్రతినిధి

మండలం కిష్టాపురం గ్రామం జన్మస్థలం ఆనాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ దున్నే వాడిదే భూమి కోసం భుక్తి కోసం తెలంగాణ విముక్తి కోసం తన జీవిత కాలం అలుపెరగని పోరాటం చేసి నేడు ప్రపంచవ్యాప్తంగా గొప్ప స్ఫూర్తిని అందించారు 10 లక్షల ఎకరాల భూమిని పంచిన గొప్ప ఉద్యమ చరిత్ర తెలంగాణ తల్లి వీరనారి చాకలి ఐలమ్మ జీవితం ఇయ్యాలచరిత్రలోఉన్నది.తెలంగాణ స్వరష్ఠ ఏర్పాటు కోసం ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తి తోటే రాష్ట్రం సాధించాలని తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి టిఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుల చంద్రశేఖర రావు ఇన్నర్ వేదికల మీద ఐలమ్మ జీవిత పోరాటం అందరికీ ఆదర్శమని కొనియాడారు,పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సభలో పాలకుర్తి గడ్డమీద నేను ఐలమ్మ ఉద్యమం వారసురాల్ని ఆ తల్లి ఉద్యమ స్ఫూర్తితోనే పాలకుర్తి నియోజకవర్గంలో అభివృద్ధి చేస్తానని నిండు సభలో తెలియజేశారు, పాలకుర్తి నియోజకవర్గం రాయపర్తి మండలం కిష్టాపురం మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు స్వయాన ఐలమ్మ ఇంటికి వచ్చి ఇల్లు అంతా కూలిపోయి ఉన్నది ఈ ఇంటికి డబుల్ బెడ్ రూమ్ ఇస్తా ఇప్పటికైనా ఇందిరమ్మ ఇల్లుకట్టించాలి, ఐలమ్మ కుటుంబానికి ఇప్పటివరకు ఏ ప్రభుత్వాలు న్యాయం చేయలేకపోతున్నాయి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కోటి మహిళా యూనివర్సిటీ కాలేజీకి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చిట్యాల ఐలమ్మగా పేరు నామకరణం చేయడం జరిగినది,రవీంద్ర భారతి లో చిట్యాల ఐలమ్మ జయంతి నిండు సభలో ఐలమ్మ మనమడు చిట్యాల రామచందర్ కోడలు చిట్యాల శ్వేత ఐలమ్మకు మహిళా కమిషన్ మెంబర్ ఇస్తానని ప్రకటించడం తెలంగాణ ప్రజలకు అందరికీ తెలిసిన విషయమే రెండు సంవత్సరాలు గడుస్తున్న ఆ కుటుంబానికి ఆ పదవి ఇంకా ప్రమాణ స్వీకారం కూడా జరగలేదు ఐలమ్మ పుట్టిన ఇంటికి ఇందిరమ్మ ఇల్లు ప్రకటించి ఐలమ్మ వారసులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.ఈ సభ్య సమాజాన్నికి మనిషి మనుగడకు శుభ్రతను ఆరోగ్యాన్ని అందించిన వృత్తి రజక (చాకలి–ధోభి) కులం ఆనాదికాలంలో సౌదు మట్టి నుండి అంటూ ముట్టు మైల పట్టిన బట్టలను శుభ్రం చేసి ఈ ప్రపంచానికి సబ్బు సోడానందించిన మొట్టమొదటి శాస్త్రజ్ఞుడు రజకులు సమాజానికి మనిషి పుట్టిన నుండి చావు వరకు అనేక కార్యక్రమాలలో సేవ చేసే వృత్తి బట్టలు పిండే రజక కులాన్ని షెడ్యూల్ క్యాస్ట్ రిజర్వేషన్లు చేర్చాలని అలాగే బీసీ లకు 42% రిజర్వేషన్లు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో పెట్టిన అంశాన్ని చట్టబద్ధత కల్పించాలని గతంలో 17 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసిన చాపర్తి కుమార్ గాడ్గే రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో

చిట్యాల ఐలమ్మ కుటుంబ సభ్యులు ఓరుగంటి మదర్ ఓరుగంటి వెంకటమ్మ,కత్తి యాకాంత, ఓరుగంటి ఉప్పలయ్య, నర్సమ్మ పాల్గొన్నారు

## నామినేషన్ల కేంద్రాన్ని తనిఖీ : ఆర్డీవో, డీఎస్పీ




కోదాడ జనవరి 28
(వుదయం ప్రతినిధి

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ మొదటి రోజు సందర్భంగా కోదాడ పురపాలక కార్యాలయంలోని నామినేషన్ల కేంద్రాన్ని ఆర్డీవో సూర్యనారాయణ రావు, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి తనిఖీ చేశారు. నామినేషన్ల స్వీకరణ, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి ఎన్నికల నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.ఈ తనిఖీలో సీఐ శివశంకర్, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, తహసీల్దార్ వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా మారుతుందన్న దుష్ప్రచారాన్ని మానుకోండి



జయశంకర్ జిల్లా మారుతుందన్న దుష్ప్రచారాన్ని మానుకోండి
జిల్లా మారితే ఎమ్మెల్యే రాబోయే ఎన్నికల్లో పోటీ చేయను
భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధిపై అసత్యపు ఆరోపణలు మానుకోవాలి
ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

జయశంకర్ భూపాలపల్లి జనవరి 28
(వుదయం జిల్లా ప్రతినిధి):

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మారుతుందన్న దుష్ప్రచారాన్ని మానుకోండని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం భూపాలపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఉభయ కమ్యూనిస్టు నేతలు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోటరాజబాబు పట్టణ అధ్యక్షుడు ఇతర ముఖ్య నేతలతో విలేకరుల సమావేశంను నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ. గడిచిన రెండేళ్ల సమయంలో భూపాలపల్లి మున్సిపాలిటీ లోని అన్ని వార్డుల్లో సుమారు రూ.350 కోట్లకు పైగా నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే కొందరు నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మారుతుందని కొంతమంది నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఒకవేళ జిల్లా మారితే నేను ఎమ్మెల్యే గా రాబోయే ఎన్నికల్లో పోటీ చేయనని ఎమ్మెల్యే అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ ప్రజలు మీకు బుద్ధి చెప్పి, 30 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదించి, అత్యధిక మెజారిటీ ఇచ్చి గెలిపించుకోవడం ఖాయమన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంటే, మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. అభివృద్ధి పనులపై ఎవరికైనా సందేహాలు ఉంటే అధికారికంగా వివరాలు తెలుసుకోవచ్చని, కానీ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.

భూపాలపల్లి పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసే బాధ్యత తమదేనని, ప్రజలు రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు ఓట్లేసి గెలిపించుకోవాలని కోరారు. సిపిఎం సిపిఐ జిల్లా నాయకులు రాజ్ కుమార్, బందు సాయిలు, తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనకు మున్సిపల్ ఎన్నికలే తీర్పు: మల్లయ్య యాదవ్



కోదాడ జనవరి 28
(వుదయం)

కోదాడ మున్సిపల్ ఎన్నికలు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి రిఫరెండంలాంటివని బీఆర్ఎస్ కోదాడ నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలపై అన్యాయాలు పెరిగాయని, పోలీసుల పేరుతో అరాచకాలు జరుగుతున్నాయని విమర్శించారు. అవినీతిని ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కోదాడ అభివృద్ధి, భద్రత బీఆర్ఎస్‌తోనే సాధ్యమని, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేయాలని పిలుపునిచ్చారు.

### శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి సంస్థ 25 వ వార్షికోత్సవ వేడుకలు

హైదరాబాద్ జనవరి 28
(వుదయం జిల్లా ప్రతినిధి):

శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్యాత్మిక సామాజిక ధార్మిక సంస్థ 25 వ వార్షికోత్సవం సందర్భంగా నేరెడ్మెట్ దీన్ దయాళ్ నగర్ శ్రీ విజయ వినాయక దేవాలయంలో శుక్ర శని ఆదివారము మూడు రోజులు విశేషముగా సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమములు , గణపతి, నవగ్రహ, రుద్ర, సరస్వతి హోమములు అన్నదానం మరియు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం సాయంత్రం పుష్పగిరి మరియు శైవ మహాపీఠం ఆస్థాన పండితులు సంస్కృతాంధ్ర పండితులు ,డాక్టర్ ముదిగొండ అమరనాథ శర్మ మరియు ముత్యంపేట

## బ్రోచర్, ను ఆవిష్కరించిన సర్పంచ్

### ప్రతిభ పురస్కారం అవార్డు బ్రోచర్, ను ఆవిష్కరించిన సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకట గౌడ్




వెల్దండ జనవరి 28 (వు దయం ప్రతినిధి)

శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ అందిస్తున్న ప్రతిభ పురస్కారం అవార్డును పేద విద్యార్థిని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ కోరారుబుధవారం మండల కేంద్రంలో మోడల్ స్కూల్ లో శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్ ప్రవేశపెట్టిన ప్రతిభా పురస్కారం స్కీం బ్రోచర్ ను ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని. విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

పేద విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభ పురస్కారం లాంటి ఒక వినూత్న కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు..ఈ కార్యక్రమంలో సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ గారు, ఉప సర్పంచ్ శ్రీనివాసులు గారు, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజర్ శేఖర్, వార్డు మెంబర్లు కిష్టాల్, వెంకటేష్ గారు, రమేష్ , కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొయ్యల పుల్లయ్య , తిరుపతి రెడ్డి , యూత్ కాంగ్రెస్ నాయకులు రాహుల్,మోడల్ స్కూల్ ప్రిన్సిపల్, కస్తూర్బా గాంధీ స్కూల్ ప్రిన్సిపల్ మరియు పాఠశాల ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ దూకుడు




- జోగులాంబ గద్వాల జిల్లాలోని గద్వాల మున్సిపాలిటీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజకీయ వాతావరణం వేడి పెరుగుతుంది.

**గద్వాల జనవరి 28 (వుదయం ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లాలోని గద్వాల మున్సిపాలిటీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజకీయ వాతావరణం వేడి పెరుగుతుంది. బీఆర్ఎస్ పార్టీ ఈసారి దూకుడుగా ముందుకు సాగుతోంది. మాజీ మున్సిపాలిటీ ఛైర్మన్ బీఎస్ కేశవ్ ను ఛైర్మన్ అభ్యర్థిగా బీఆర్ఎస్ అధికారికంగా ప్రకటన చేసింది. గతంలో బీఆర్ఎస్ తరపున ఛైర్మన్గా పని చేసిన బీఎస్ కేశవ్ తాజాగా కాంగ్రెస్ పార్టీ నుంచి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ గద్వాలలో తన పాత పట్టును మళ్లీ బలోపేతం చేసుకోవడానికి పూర్తి సన్నద్ధత చూపిస్తోంది. మాజీ ఛైర్మన్ కేశవ్ చేరికతో పాటు పలువురు స్థానిక నాయకులు, మాజీ కౌన్సిలర్లు కూడా బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారని స్థానిక వర్గాలు తెలిపాయి. మరోవైపు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఛైర్మన్ అభ్యర్థి ఎంపిక విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఛైర్మన్ పోస్టు కోసం రెండు పార్టీల్లోనూ అంతర్గత విభేదాలు, గ్రూపిజం తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. కాంగ్రెస్ పార్టీలో రెండు గ్రూపుల మధ్య తీవ్ర పోటీ నెలకొనడంతో టికెట్ల కేటాయింపు ప్రక్రియ తలనొప్పిగా మారింది. ఇక బీజేపీ విషయానికొస్తే.. అన్ని వార్డుల్లోనూ బలమైన అభ్యర్థులను వెతకాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్థానిక స్థాయిలో పార్టీకి తగినంత బలం లేకపోవడం, అభ్యర్థుల కొరత వంటి సమస్యలు బీజేపీకి సవాలుగా మారాయి.

**కాంగ్రెస్లో గ్రూప్ విభేదాలు**

బీ ఫామ్లు ఎవరికి..? సరితా తిరుపతయ్యాకా? బండ్ల కృష్ణమోహన్ రెడ్డికా? మున్సిపాలిటీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు తీవ్రమవుతున్నాయి. పార్టీలో రెండు గ్రూపులుగా విడిపోవడంతో ఛైర్మన్ అభ్యర్థిత్వం, బీ ఫారమ్లు నామినేషన్ ఫారమ్లు కేటాయింపు విషయంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మాజీ జెడ్పి ఛైర్పర్సన్ సరితా తిరుపతయ్యకు బీ ఫామ్లు దక్కుతాయా? లేక భారత రాష్ట్ర సమితి బీఆర్ఎస్ నుంచి ఇటీవల కాంగ్రెస్లో చేరిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి దక్కుతాయా? అనేది పార్టీ అధిష్టానం ఇంకా నిర్ణయించాల్సి ఉంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్లో చేరిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తన రాజకీయ అనుభవంతో పార్టీలో, ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయన చేరికతో కాంగ్రెస్ బలోపేతమైనది. ఆయనకే బీ ఫారమ్లు దక్కుతాయని ఆయన మద్దతుదార్లు తెలుపుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఇంకా బి ఫార్మ్ విషయంపై అధికారిక నిర్ణయం తీసుకోలేదు. పార్టీ హైకమాండ్ మధ్య చర్చలు జరుగుతున్నాయి. గ్రూప్ విభేదాలు వల్ల పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తాయి. కాంగ్రెస్లోని ఈ అస్థిరత ఆ పార్టీ ఎన్నికల అవకాశాలపై ప్రభావం చూపవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

గద్వాల మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే దూరం..?

గద్వాల మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారం సమీపిస్తున్న నేపథ్యంలో, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో దూరంగా ఉంటారనేది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం ఆంటీడిఫెక్షన్ లా కింద ఆయనపై కేసు ఇంకా పెండింగ్లో ఉండటం, కోర్టు విచారణలు కొనసాగుతుండటం వల్ల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరపున బహిరంగ ప్రచారం నిర్వహించకపోవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున గెలిచిన బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తరువాత కాంగ్రెస్ పార్టీలో చేరడం, బీఆర్ఎస్ పార్టీ దాఖలు చేసిన ఫిరాయింపు పిటిషన్లపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ విచారణ జరిపి, ఆధారాల లోపం వల్ల ఐదుగురు ఎమ్మెల్యేలపై బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహా అనర్హత పిటిషన్లను కొట్టివేశారు. అయినప్పటికీ, కొన్ని కేసులు సుప్రీం కోర్టు ఆదేశాల నేపథ్యంలో ఇంకా పూర్తి కాలేదు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బహిరంగంగా ప్రచారంలో పాల్గొంటే చట్టపరమైన సమస్యలు ఎదుర్కోవచ్చని,అందుకే దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్టు తెలిపాయి. కాంగ్రెస్ పార్టీకి పెద్ద సవాల్ గా మారింది. గద్వాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రచారంలో లేకుండా మున్సిపాలిటీ ఎన్నికల్లో అభ్యర్థులకు ఇబ్బందికర పరిస్థితి. ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలకు అందివచ్చే అవకాశంగా మారింది.

**బీజేపీ సత్తా చాటాలని దూకుడు ప్రయత్నాలు**

గద్వాల మున్సిపాలిటీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బీజేపీ ఈసారి తన సత్తా చాటాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. మాజీ ఎమ్మెల్యే డీకే భరత్ సింహ రెడ్డి, ఎంపీ డీకే అరుణలు ఈ ఎన్నికలను పెద్ద సవాలుగా తీసుకుని, పూర్తి సన్నద్ధత చూపిస్తున్నారు. అన్ని వార్డుల్లో బలమైన, ప్రభావవంతమైన అభ్యర్థులను నిలబెట్టడానికి పార్టీ పావులు కదుపుతోంది. ఎలాగైనా ఈసారి మున్సిపాలిటీ ఛైర్మన్ స్థానాన్ని సాధించాలని బీజేపీ నేతలు తీవ్రంగా పనిచేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే డీకే భరత్ సింహ రెడ్డి స్థానిక స్థాయిలో పార్టీ కార్యకర్తలను ఏకం చేసి, అభ్యర్థి ఎంపికలో జాగ్రత్తగా పావులు కదుపుతున్నారు. ఎంపీ డీకే అరుణ కూడా ఈ ఎన్నికలను సవాలుగా తీసుకొని, వార్డు స్థాయిలో పార్టీ బలోపేతం కోసం వ్యూహాలు రూపొందిస్తున్నారు. బీజేపీ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలతో తీవ్ర పోటీ పడనుంది. బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే ఛైర్మన్ అభ్యర్థిగా బీఎస్ కేశవన్ను ప్రకటించి దూకుడుగా ప్రచారం చేస్తుండగా, కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు, ఎమ్మెల్యే ప్రచారంలో దూరం వంటి సమస్యలు ఉన్నాయి. ఈ పరిస్థితిని బీజేపీ తనకు అనుకూలంగా మలచుకోవాలని ప్రయత్నిస్తోంది. ఏదేమైనా ఈ సారి జరిగే మున్సిపల్ ఎన్నికలలో మూడు ప్రధాన పార్టీ లు సవాలుగా తీసుకొని ఛైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి.



## బీజేపీకి మున్సిపాలిటీ ఎన్నికలు ముఖ్యం కాదు

- తెలంగాణ రాష్ట్ర నాయకులు శ్రీధర్ రెడ్డి

**మధిర, జనవరి 28 (వుదయం ప్రతినిధి) :**

బిజెపి పార్టీకి మున్సిపాలిటీ ఎన్నికలు ముఖ్యం కాదని రాష్ట్ర నాయకులు, వరంగల్ జిల్లా ఇన్చార్జ్ కొండపల్లి శ్రీధర్ రెడ్డి అన్నారు.బుధవారం మధిర పట్టణంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ బిజెపి పార్టీ మధిర ప్రాంత ప్రజల అభివృద్ధి కొరకు మాత్రమే పనిచేస్తుందని మున్సిపాలిటీ ఎన్నికలు ముఖ్యం కాదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాటలకు చేతలకు పొంతనలేదనీ అన్నారు. అభివృద్ధి కావాలంటే పనులు చేసే నాయకులని గెలిపించాలని కోరారు. ముఖ్యంగా 20 సంవత్సరాలుగా చేసిన అభివృద్ధి చూపించి మున్సిపాలిటీ ప్రజలను ఓట్లు అడగాలని అన్నారు. మధిర ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఇబ్బంది పడుతున్న మధిర అండర్ పాస్ రైల్వే బ్రిడ్జి కోసం డి పి ఆర్ తీసుకోవటంలో జాప్యం కు కారణం మధిర ప్రజలకు తెలపాలని అన్నారు.మదిర నియోజకవర్గ శాసనసభ్యులుగా మీరు డిపిఆర్ ఇచ్చిన 48 గంటలలో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి అనుమతి తీసుకొస్తామని హామీ ఇచ్చారు.మధిర మున్సిపాలిటీ గెలిస్తే గతంలో జరిగిన అవినీతి ని వెలికితీస్తాం అన్నారు.బీజేపీ అభ్యర్థులను గెలిపించండి మధిర మున్సిపాలిటీ అభివృద్ధి చేసి చూపిస్తామని అన్నారు.మధిర ప్రజలకు అండర్ డ్రైనేజీ పనులు జాప్యం పై భట్టి వివరణ ఇవ్వాలని, భట్టి విక్రమార్క ఉప ముఖ్యమంత్రి అయినందుకు మధిర ప్రజలు ఆనందం లేక బాధ ఎక్కువ అనుభవిస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో గల్లా సత్యనారాయణ మాజీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు, జిల్లా రాష్ట్ర నాయకులు పట్టణ అధ్యక్షులు శివరాజు సుమంత్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




## వార్డుల్లో టికెట్లు ఎస్సీ వర్గాలకే ఇవ్వాలనే దిశగా బీఆర్ఎస్ పార్టీ

**మధిర,జనవరి 28, (వుదయం ప్రతినిధి):**

మునిసిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇన్చార్జ్ లింగాల కమల్ రాజ్ ఆధ్వర్యంలో పార్టీ అంతర్గత సమావేశాల్లో కీలక అంశాలపై చర్చ కొనసాగుతోంది.మధిర మునిసిపాలిటీలో1, 11, 12 ,21వ వార్డులుఓసి జనరల్ రిజర్వేషన్లో ఉన్నప్పటికీ,ఈ వార్డుల్లో సుమారు 80% ఎస్సీ జనాభా ఉన్న అంశంపై పార్టీ స్థాయిలో చర్చ జరుగుతోంది. ఎస్సీ జనాభా అధికంగా ఉన్న ఈ వార్డుల్లో టికెట్లు ఎస్సీ వర్గాలకే ఇవ్వాలనే దిశగా బీఆర్ఎస్ పార్టీ ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. అదే వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ జనరల్ అభ్యర్థులను నిలబెడితే, అలా చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా చెక్ పెట్టే విధంగా, బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ వర్గాలకు అవకాశం ఇవ్వాలనే ఆలోచనతో ముందుకు కదులుతున్నట్టుపార్టీ వర్గాల సమాచారం.ఇది పూర్తిగా అంతర్గత చర్చ మాత్రమే, తుది నిర్ణయం పార్టీ అధిష్ఠానం ద్వారా అధికారికంగా వెల్లడించనున్నారు.

## విత్తిన వరి ప్రాజెక్టు పై రైతులకు అవగాహన కార్యక్రమం



**మధిర, జనవరి 28(వుదయం)**

విత్తిన వరి ప్రాజెక్టు పై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఎస్బీఐ డీఎస్ఆర్ ప్రాజెక్ట్కు చెందిన రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ ఎస్ కవి రాజు నిర్వహించారు. బుధవారం మండలంలో ని మడుపల్లి, చిలుకూరు గ్రామంలో కేవీకే బ్రాంచ్ వైరా సహకారంతో నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూభారత వరి పరిశోధనా సంస్థ, హైదరాబాద్ ఎస్బీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమలవుతున్న నేరుగా విత్తిన వరి ప్రాజెక్టు పై రైతులకు నేరుగా విత్తిన వరి సాగులో భూమి తయారీ, విత్తన మోతాదు, కలుపు నియంత్రణ, పోషకాల నిర్వహణ, నీటి యాజమాన్యం, యాంత్రీకరణ ప్రాధాన్యత, ఖర్చు తగ్గించే శాస్త్రీయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.డీఎస్ఆర్ విధానంతో సాగు వ్యయాలు తగ్గి, నీటి వినియోగం తగ్గడంతో పాటు, దిగుబడులు నిలకడగా ఉండి రైతుల నికర ఆదాయం పెరుగుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో మధిర వ్యవసాయ అధికారి మాట్లాడుతూ మడుపల్లి మరియు చిలుకూరు గ్రామాలలో ఎక్కువగా వరిని ఎక్కువగా నాటు వేసే పద్ధతిలో సాగు చేస్తున్నారని దాని వల్ల కూలీ కొరత సమస్యతో ఇబ్బంది పడుతున్నారని ఈ వెదజల్లే పద్ధతిలో వరిని సాగు చేసుకోవడం ద్వారా రైతులకు అధిక లాభాలు రావచ్చని చెప్పారు. ఎస్బీఐ ఫౌండేషన్ ప్రాజెక్టు ద్వారా అందిస్తున్న శిక్షణలు, ఇన్పుట్ మద్దతుతో వరి సాగు మరింత సుస్థిరంగా మారుతుందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మడుపల్లి ఖమ్మంపాడు ఏఈవోలు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## నగరంలో మురికి కాల్వల సమస్యలకు శాశ్వత పరిష్కారం

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు
- 21వ డివిజన్ లో సిసి రోడ్లు, సైడ్ డ్రైన్ నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేసిన మంత్రి తుమ్మల



**ఖమ్మం, జనవరి -28,(వుదయం):**

ఖమ్మం నగరంలో మురికి కాల్వల సమస్యలకు శాశ్వత పరిష్కారం కొరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం 21 వ డివిజన్ లో రూ. 545.60 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఖమ్మం నగరంలో మురికి కాల్వల సమస్యలకు శాశ్వత పరిష్కారం అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణానికి రూ. 1250 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో కేంద్ర ప్రభుత్వ నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం చేపడతామని మంత్రి తెలిపారు. ఖమ్మం నగరంలో తాగునీటి సమస్య లేకుండా మరో 250 కోట్లతో తాగునీటి పథకం పనులు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. నగరంలో అన్ని మౌళిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధ చర్యలు చెప్పట్టిందని అన్నారు. ఖమ్మం నగరం క్లీన్ అండ్ గ్రీన్ గా ఉండేలా పౌర సహకారంతో అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. నగరం పచ్చదనంతో, పరిశుభ్రంగా ఉండేలా ప్రతిఒక్కరు తమ వంతు బాధ్యత నెరవేర్చాలన్నారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నిత్యజీవితములోని బోధనలో సమాచార భావ ప్రసార సాంకేతికతను జోడించండి చైతన్యజైని

- జిల్లా విద్యాశాఖ అధికారి

**ఖమ్మం, జనవరి 28(వుదయం):**



పీఎం శ్రీ పాఠశాలల్లో పనిచేసే ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులకు ఐసిటి అంశాల పైన రెండు రోజుల శిక్షణా తరగతులు జిల్లా విద్యా శిక్షణ సంస్థ మరియు సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ప్రారంభమైనాయి ఈ కార్యక్రమానికి కోర్స్ డైరెక్టర్గా వ్యవహరిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైని, ముఖ్యఅతిథిగా హాజరై

**శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిమాట్లాడుతూ**

కంటెంట్, పెడగాజి, అసెస్మెంట్ మరియు కమ్యూనికేషన్ అంశాలలో కూడా ఐసిటి వినియోగాన్ని పెంచడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ తద్వారా మెరుగైన అభ్యసన ఫలితాలను సాధించవచ్చని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ రెండు రోజులలో గూగుల్ అంశాల పైన అనగా గూగుల్ ఫామ్స్, గూగుల్ షీట్లు, గూగుల్ డాక్యుమెంట్లు, గూగుల్ స్లైడ్ లను ఎలా రూపొందించాలి, వాటిని ఎలా వినియోగించుకోవాలి, వాటి అవసరం ఏమిటి, వాటి ద్వారా పిల్లలకు మెరుగైన బోధన అభ్యసన ప్రక్రియలను ఏ విధంగా జరపవచ్చో తదితర అంశాల పైన ఇంటర్ ఆక్టివ్ గా వివరిస్తూ మరియు వచ్చిన ఉపాధ్యాయులతో అన్ని శిక్షణ అంశాలను సాధన చేయించడం జరుగుతుంది అని ఈ శిక్షణ చాలా ఉపయోగకరం సరస్వతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కూసుమంచి, ఖమ్మం ,కరోనా సమయంలో మరియు కరోనా అనంతరం జరిగిన మార్పుల నేపథ్యంలో విద్యాబోధనలో సాంకేతిక వినియోగం చాలా పెరిగింది. నిరంతరం పై అధికారుల నుండి గూగుల్ ఫార్మ్స షీట్లు, డాక్యుమెంట్లను పంపిస్తే వాటిని నింపడం వరకే చేస్తున్నాము కానీ వాటిని ఎలా తయారు చేసుకోవాలి? ఎలా వినియోగించుకోవాలి వాటి వలన మా విద్యార్థులకు ఏమి ఉపయోగం జరుగుతుందో ఈ శిక్షణ కార్యక్రమంలో స్పష్టంగా తెలుసుకున్నాం దీనివల్ల మా విద్యార్థులకు మేలు జరుగుతుంది.మొత్తం ఖమ్మం జిల్లాలోని 28 పీఎంశ్రీ పాఠశాలల్లోని 508 ఉపాధ్యాయులకు రెండు విడుతలగా సాంకేతిక వినియోగము, ఐసిటి అంశాల పైన శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. పీఎం శ్రీ పాఠశాలలుగా ఎంపికైన ఉన్నత పాఠశాలలో సాంకేతిక వినియోగం విస్తృతంగా పెరిగింది .దీని నేపథ్యంలో ప్రతి పాఠశాలకు ఒక లాప్టాప్ ను మరియు ఉపాధ్యాయులకు ట్యాబ్ లను అందజేశారు. ఈ ట్యాబ్లను ఉపయోగిస్తూ, సాంకేతిక అంశాల పైన విద్యార్థులకు నాణ్యమైన బోధన ఏ విధంగా అందించవచ్చు అనేది ఈ శిక్షణలో తెలియజేయడం జరుగుతుందని కోర్సు కోఆర్డినేటర్ గా ఉన్న జిల్లా AMO పెసర ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు



## జిట్టబోయిన యాదయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం

**వుదయం, శాలిగౌరారం:**

నల్లగొండ జిల్లా, శాలిగౌరారం మండల పరిధిలోని తుడిమిడి గ్రామానికి చెందిన పవన్ సాయి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్ అదే గ్రామానికి చెందిన జిట్టబోయిన యాదయ్య ఈ మధ్యనే మరణించారు.విషయం తెలుసుకున్న డాక్టర్ శ్రీనివాస్ గౌడ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి 5,000/ (అయిదు వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంభం రమేష్,బాకీ వెంకటయ్య,బండారు శేఖర్,అలేటి నర్సయ్య,జిట్టబోయిన పరుశరాములు,కొడిమల శంకర్,రాజు,నాగరాజు,గణేష్, నరేష్,యాదగిరి ,హరీష్,రాజశేఖర్,ప్రవీణ్,ఉప్పలయ్య,తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దిశా నిర్దేశం
- డిసిసి కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన ముఖ్యనేతల సన్నాహక సమావేశం

**ఖమ్మం , జనవరి 28(వుదయం):**

ఈ సందర్భంగా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ గారు మాట్లాడుతూ మన జిల్లాలో గతంలో మూడు (3) మున్సిపాలిటీలు ఉన్నాయని ఇప్పుడు రెండు మున్సిపాలిటీలు పెరిగి మొత్తం ఐదు(5) మున్సిపాలిటీలు అయ్యాయని ఈ ఐదు మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా విజయకేతనం ఎగురవేయాలని ఆ దిశగా ప్రజల వద్దకు మనప్రజాపాలన అందిస్తున్న ఫలాలు ఓటర్లకు వివరించాలని ముఖ్య నాయకులను కోరారు అదే విధంగా ముఖ్య నాయకులు ఈ ఐదు మున్సిపాలిటీ లలో పార్టీ విజయం కొరకు పాటు పడుతూ అన్ని వర్గాల నాయకులను సమన్వయ పరుస్తూ పని చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో శాసన సభ మాజీ సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, శాసనమండలి మాజి సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్, జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు వడ్డేబోయిన నరసింహారావు, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నాయకురాలు పగడాల మంజుల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ గౌస్, జిల్లా ఎస్ సి సెల్ అధ్యక్షులు బొడ్డు బొందయ్యలు మాట్లాడుతూ జిల్లా కాంగ్రెస్ కమిటీ సూచనల మేరకు జిల్లా లోని ఐదు మున్సిపాలిటీలలో అన్ని వర్గాల నాయకులను సమన్వయ పరుస్తూ పార్టీ అభ్యర్థుల విజయం కొరకు అహర్నిశలు కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా లోని ముఖ్య నాయకులు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ వార్డ్ అభ్యర్థిగా మాజీ మున్సిపల్ చైర్మన్



- కూసంపూడి మహేష్

**సత్తుపల్లి జనవరి 28 (వుదయం ప్రతినిధి):**

సత్తుపల్లి మున్సిపాలిటీ 14వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా బీఆర్ఎస్ తరపున మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ తన నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించారు.



## 35 వార్డులలో గెలుపే లక్ష్యం

- మంత్రి ఉత్తమ్

**కోదాడ, జనవరి 28 (వుదయం):**

కోదాడలో బుధవారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కోదాడ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 35 వార్డులలో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి వార్డులో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోదాడ శాసనసభ్యురాలు పద్మావతి రెడ్డి, టీపీసీసీ డెలిగేట్ లక్ష్మీ నారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్ రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మార్కెట్ చైర్మన్ సుధీర్ తిరుపతమ్మ, మహబూబ్ జానీ, బషీర్, ఎర్నేని బాబు, పారా సీతయ్య, ముత్తవరపు పాండురంగారావు, కందుల కోటేశ్వరరావు, చింతలపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేసాం



- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**మధిర,జనవరి 28 (వుదయం ప్రతినిధి):**

మున్సిపాలిటీలోనూ అత్యధిక స్థానాలు గెలుస్తాం రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకుపోతాం. ఎమ్మెల్యేలు అందరూ మున్సిపల్ ఎన్నికలను సీరియస్ గా తీసుకొని పార్టీ నేతలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలి నగరాల్లో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేసాం.దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలను ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుంది . మున్సిపల్ ఎన్నికల్లో పొత్తుల అంశం పిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్ నిర్ణయం తీసుకుంటారు.మా క్యాబినెట్ అంతా ఉమ్మడి కుటుంబంలో పనిచేస్తుంది రాష్ట్ర భవిష్యత్తు మా అందరి లక్ష్యం. ఫ్యూర్, క్యూర్,రేర్ సమగ్ర విధానంతో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం 2017 విజన్ డాక్యుమెంట్ విడుదల చేశాం సీఎం రేవంత్ రెడ్డి దేశంలో లేరు కాబట్టి మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నాకు కొన్ని సూచనలు చేశారు. మంత్రులు వారి సమస్యలు తెలియజేశారు, ఆ విషయాలను ముఖ్యమంత్రికి నేను వివరించాను. ప్రజాభవన్లో మంత్రుల భేటీపై కొందరు పిచ్చి భ్రమల్లో ఉండి పిచ్చి రాతలు రాస్తున్నారు. మంత్రులు డిప్యూటీ సీఎంను కలవకపోతే రాసే వారితో చూపించే వారితో కలుస్తారా అన్నారు.

## జాతరలో భక్తులకు మెరుగైన వైద్య సేవలందించాలి




- డాక్టర్ బి.రవీంద్ర నాయక్ ,డైరెక్టర్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ

**హనుమకొండ, జనవరి 28 (వుదయం ) :**

మేడారం సమ్మక్క సారలమ్మ జాతర, అగ్రంపహాడ్ జాతర వెళ్లే భక్తులకు ఎలాంటి వైద్య పరమైన సహాయం అవసరమైనా అందించడం మన బాధ్యత అని , చికిత్సకు అవసరమైన అన్ని మందులు అందుబాటులో ఉంచుకోవడంతో పాటు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ బి.రవీంద్ర నాయక్ సూచించారు. ఈరోజు ఆయన జాతర కోసం ప్రత్యేకంగా కటాక్ష పూర్ లోలఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరమును సందర్శించి ఆత్మకూరు వైద్యాధికారి డాక్టర్ స్పందనతో క్యాంపుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మేడారం ప్రధాన రహదారిలో ఉన్న ఆత్మకూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24/7 సేవలు అందించాలని ,108 మరియు ఇతర లైన్ డిపార్ట్మెంట్స్ తో సమన్వయంతోపనిచేయాలన్నారు. హనుమకొండ జిల్లాలోని మినీ సమ్మక్క సారలమ్మ జాతరతో పాటు బస్ స్టేషన్ రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేసిన (22) వైద్య శిబిరాలలో భక్తులకు మెరుగైన సేవలందించాలన్నారు. స్థానిక శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచన లకు అనుగుణంగా అన్ని చర్యలు తీసుకున్నట్లు డాక్టర్ స్పందన తెలియజేశారు. డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య అగ్రంపహాడ్ జాతరను సందర్శించి తగు సూచనలు అందించినట్లు అలాగే ఈరోజు డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ ప్రదీప్ రెడ్డి ఆత్మకూరు మండలంలోని (6) వైద్య శిబిరాలను సందర్శించినట్లు డైరెక్టర్ గారికి తెలియజేయడం జరిగింది. డి ఎం హెచ్ ఓ గారి ఆదేశాల మేరకు జాతరలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి భక్తులకు సూచనలు ఫ్లెక్సీల ద్వారా ప్రదర్శించినట్లు అలాగే అగ్రంపాడు ప్రధాన వైద్యశాలలో (10) పడకలు మరియు అన్ని అత్యవసర మందులతో పాటు ప్రజలకు అవగాహన కలిగించేందుకు ఆరోగ్య ప్రదర్శనశాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డాక్టర్ నర్సింగరావు,జిల్లా మాస్ మీడియా అధికారి వి అశోక్ రెడ్డి , కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ టీ మాధవరెడ్డి ,జునేడి, హెచ్ ఈ ఓ కే.సంపత్ లు కావలసిన ఏర్పాట్లలో పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## మెంతి కూర పవర్ తెలిస్తే వదలరు



ఎన్నో ఔషధ గుణాలు ఉన్న మెంతి ఆకు.. అనేక ఆరోగ్య సమస్యలను నివారించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. కాలేయ సమస్యలు, మధుమేహం నియంత్రణ, చర్మ వ్యాధుల నివారణకు తోడ్పడుతుంది. కాల్షియం, ఐరన్, ఫాస్ఫరస్, ప్రోటీన్లు, ఫైబర్ సమృద్ధిగా ఉండే ఈ ఆకు, జ్ఞాపకశక్తిని పెంచి, క్యాన్సర్ వంటి వ్యాధులను నిరోధించగలదు. మెంతి కూరలో ఎన్నో పోషకాలతో పాటు.. ఔషధ గుణాలు పుష్కలంగా దాగున్నాయి.. మన భారతీయ వంటకాల్లో సర్వసాధారణంగా ఉపయోగించే ఒక అద్భుతమైన ఆకుకూర. ఇది కేవలం రుచిని పెంచడమే కాకుండా, అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. దీనిని మెంతి లేదా మెంతి కూర అని కూడా పిలుస్తారు. రుచికి చేదుగా ఉన్నప్పటికీ, ఈ ఆకు అనేక పోషక విలువలను, అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. సాధారణంగా మెంతి ఆకులో చిన్న మెంతెం, పెద్ద మెంతెం అని రెండు రకాలుంటాయి. ఈ ఆకు శరీరానికి సంబంధించిన అనేక ఆరోగ్య సమస్యలను తగ్గించడంలో ఎంతగానో సహాయపడుతుంది. మెంతి ఆకులో కాల్షియం, ఇనుము, ఫాస్ఫరస్‌లతో పాటు ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. అంతేకాకుండా, ఫైబర్ పుష్కలంగా లభిస్తుంది. ఈ పోషకాలు శరీరానికి బలాన్ని చేకూర్చి, వివిధ వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయి. లివర్ ఆరోగ్యం, డయాబెటిస్ నియంత్రణ: మెంతి ఆకు ముఖ్యంగా కాలేయ సమస్యలను తగ్గించడంలో తోడ్పడుతుంది. మధుమేహం ఉన్నవారికి ఇది చాలా మేలు చేస్తుంది. రక్తంలో షుగర్ స్థాయిలను అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది. చర్మ సంరక్షణ: చర్మ ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడుతుంది. దీనిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. జీర్ణక్రియ, ఇతర సమస్యలు: మెంతి ఆకు ఆకలిని పెంచుతుంది. దగ్గు, మొలలు, వాంతులు, కీళ్ల వ్యాధులు వంటి అనేక సాధారణ వ్యాధులను నివారిస్తుంది. కడుపులోని నులిపురుగులకు ఇది మంచి ఔషధంగా పనిచేస్తుంది. అయితే, పప్పు దినుసులలో దీనిని అతిగా వేయకూడదు.. లేదంటే పప్పు చేదుగా మారుతుంది. రక్తహీనత నివారణ: ఇందులో ఐరన్ పుష్కలంగా ఉండటం వల్ల రక్తహీనతను దూరం చేయడంలో సమర్థవంతంగా పనిచేస్తుంది. కంటిచూపు మెరుగుదల: మెంతికూరలో అధికంగా ఉండే ఫైబర్ కంటిచూపును మెరుగుపరుస్తుంది. దృష్టి లోపాలు ఉన్నవారు ఈ ఆకును తమ ఆహారంలో ఎక్కువగా చేర్చుకోవడం మంచిది. శరీర ఉష్ణోగ్రత నియంత్రణ: శరీర ఉష్ణోగ్రత అధికంగా ఉండేవాళ్లు మెంతికూరను తీసుకోవచ్చు. ఇది శరీరానికి చలువనిస్తుంది.. వేడి వలన వచ్చే అలర్జీలను దూరం చేస్తుంది. కఫం, పిత్త, వాతం వంటి రోగాలను దరిచేరనివ్వకుండా చేస్తుంది. జ్ఞాపకశక్తి మెరుగుదల, క్యాన్సర్ నిరోధం: మెంతి ఆకు జ్ఞాపకశక్తిని పెంచుతుంది. ఇందులో ఉండే సఫోన్ మ్యూకలేట్ ధాతువులు క్యాన్సర్‌ను నిరోధించడంలో సహాయపడతాయి. హృదయ ఆరోగ్యం, ఇతర ప్రయోజనాలు: విటమిన్ ఎ సమృద్ధిగా ఉండటం వల్ల గుండెపోటు, అలర్జీలు, దృష్టి లోపాలు, రక్తహీనత వంటి వాటిని తొలగిస్తుంది. నరాల బలహీనతతో బాధపడేవారు కూడా మెంతి కూరను తమ ఆహారంలో భాగంగా చేసుకోవచ్చు. ఇంకా.. మెంతి ఆకులను పేస్ట్‌లా చేసి ఫేషియల్‌గా ఉపయోగించవచ్చు. ఇది నల్లగా ఉన్నవారికి చర్మకాంతిని పెంచి, ముఖంపై నల్ల మచ్చలు, ముడతలను తగ్గిస్తుంది. మెంతులను నానబెట్టి పేస్ట్‌లా చేసి జుట్టుకు అప్లై చేయడం వల్ల జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. మెంతి ఆకుతో, మెంతుల తోచేసే పప్పు ఆరోగ్యానికి మంచి పౌష్టికాహారం. మెంతి ఆకును ఎండబెట్టి పొడి చేసుకొని, అవసరమైనప్పుడు పప్పులు, కూరలలో వాడుకోవచ్చు. ఇది ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తుంది. మన ఇంటి పెరడులో మెంతి ఆకును సులువుగా పెంచుకోవచ్చు.. వారానికి కనీసం రెండు లేదా మూడుసార్లు మెంతులు లేదా మెంతి ఆకును ఆహారంలో చేర్చుకోవడం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఇది కేవలం ఒక ఆకుకూర మాత్రమే కాదు.. సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించే ఒక దివ్యఔషధం అంటున్నారు ఆయుర్వేద నిపుణులు.

## మనసు పెట్టి తింటున్నారా?



ఆహారం పైనే పూర్తి దృష్టి పెట్టాలన్నా, రుచిని ఆస్వాదించాలన్నా.. భోజనం చేసే క్రమంలో కొన్ని విషయాలు దృష్టిలో పెట్టుకోవాలంటున్నారు నిపుణులు. తినేటప్పుడు మొబైల్, టీవీ.. తదితర గ్యాడ్జెట్స్‌కి దూరంగా ఉండాలి. పనులున్నాయని గబగబా తినేయడం కాకుండా.. 20–30 నిమిషాల సమయం భోజనానికి కేటాయించాలి. ఎంత తింటామో, అంతా ఒకేసారి ప్లేట్లో పెట్టుకోవడం కాకుండా.. కొద్ది కొద్దిగా ఆహారం ప్లేట్లో వడ్డించుకోవాలి. ఎందుకంటే ఒకేసారి ఎక్కువ మొత్తంలో ఆహారం ప్లేట్లో కనిపిస్తే త్వరగా తినేయాలన్న ఆతృత పెరుగుతుంది. తద్వారా మనసు పెట్టి తినలేం. కాబట్టి తక్కువ మొత్తంలో.. ఓ ముద్ద తగ్గించి తినడం మంచిది. కొంతమంది ఆహారాన్ని నమలకుండా మింగేస్తుంటారు. దీనివల్ల ఆహారం రుచిని ఆస్వాదించలేకపోతారు. ఇదీ మనసు పెట్టకుండా తిన్నట్లేనట! అందుకే నోట్లో పెట్టుకున్న ముద్దను నెమ్మదిగా నములుతూ.. రుచిని ఆస్వాదిస్తూ తింటే ఆహారంపై ప్రేమ పెరుగుతుంది. తినే ముందు, మధ్యలో, తిన్నాక.. ఇలా ఎప్పటికప్పుడు ఆకలిని పరిశీలించుకుంటూ తినడం ముఖ్యం. తద్వారా శరీరానికి ఎంత ఆహారం అవసరమో అన్న విషయం అవగతమవుతుంది. ఫలితంగా ఎక్కువ ఆహారం తినకుండా జాగ్రత్తపడచ్చు. చాలామందికి కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడుతూ తినడం అలవాటు! ఈ క్రమంలో ఇతర విషయాలు కాకుండా.. మీరు తినే ఆహారం గురించే మాట్లాడుకోవడం, ఆరోగ్యకరమైన అప్షన్ల గురించి పంచుకోవడం, రుచుల్ని ప్రశంసించడం కూడా మైండ్‌ఫుల్ ఈటింగ్ కిందకే వస్తుంది.

## బరువును తగ్గించే మ్యాజిక్ బ్రేక్‌ఫాస్ట్

బరువు తగ్గాలనే లక్ష్యంతో చాలామంది చేసే మొదటి పని బ్రేక్ ఫాస్ట్ మానేయడం. కానీ అది ఆరోగ్యానికి మేలు కంటే కీడే ఎక్కువ చేస్తుందని కు తెలుసా? బరువు తగ్గడానికి బ్రేక్‌ఫాస్ట్ మానేయడం కాదు.. అసలు ఏం తింటున్నామన్నదే ముఖ్యం. ఉదయం పూట రు తీసుకునే ఆహారమే రోజంతటి వేగాన్ని, జీవక్రియను నిర్ణయిస్తుంది.నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది చేసే అతిపెద్ద తప్పు బ్రేక్ ఫాస్ట్ విషయంలో అశ్రద్ధ చూపడం. మరి కొందరు బరువు తగ్గాలనే ఉద్దేశంతో అసలు టిఫినే తినరు. అయితే బరువు తగ్గడానికి టిఫిన్ మానేయడం కాదు.. సరైన అల్పాహారం ఎంచుకోవడం ముఖ్యమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. శరీరానికి రోజంతా అవసరమైన శక్తిని ఇచ్చేది, జీవక్రియను వేగవంతం చేసేది అల్పాహారమే. మరి బరువు తగ్గడానికి ఎలాంటి బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవాలి? బరువు తగ్గాలనుకునే వారికి మొలకెత్తిన పప్పులు ఒక అద్భుతమైన ఎంపిక. ఇందులో ప్రోటీన్ మరియు ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. నానబెట్టిన పచ్చి పప్పు లేదా శనగలను మొలకలు వచ్చిన తర్వాత అందులో ఉల్లిపాయ, టమోటా, దోసకాయ ముక్కలు, కొంచెం నిమ్మరసం, చాట్ మసాలా కలిపి తీసుకోవాలి. ఇది తిన్న తర్వాత కడుపు నిండుగా అనిపిస్తుంది. తద్వారా అనవసరమైన చిరుతిళ్లు తినాలనే కోరిక తగ్గుతుంది. పీచు పదార్థం జీర్ణవ్యవస్థను శుభ్రం చేయడమే కాకుండా, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. ఓట్స్, చియా గింజలు, తాజా పండ్లు, బెర్రీలు, మల్టీగ్రెయిన్ బ్రెడ్ వంటివి అల్పాహారంలో భాగంగా ఉండాలి. ఫైబర్ వల్ల కేలరీలు త్వరగా ఖర్చవుతాయి. ఇది అతిగా తినకుండా మిమ్మల్ని నియంత్రిస్తుంది. ఆఫీసులకు వెళ్లే వారికి, విద్యార్థులకు ఇది బెస్ట్ ఆప్షన్. అల్పాహారానికి ముందే శరీరాన్ని లోపలి నుండి శుభ్రం చేసుకోవడం ముఖ్యం. ఉదయం లేవగానే ఒకటి లేదా రెండు గ్లాసుల గోరువెచ్చని నీరు తాగాలి. ఇది శరీరంలోని విషపూరిత వ్యర్థాలను బయటకు పంపివేస్తుంది. సాధారణ టీ, కాఫీలకు బదులుగా గ్రీన్ టీ లేదా హెర్బల్ టీలను ఎంచుకోండి. ఇది శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతూనే బరువు తగ్గడానికి సహకరిస్తుంది. బరువు పెరగడానికి ప్రధాన కారణం అల్పాహారంలో మనం వాడే నూనె, చక్కెర, అధిక కార్బోహైడ్రేట్లు. ప్యాక్ చేసిన తృణ ధాన్యాలు, నూనెలో వేయించిన పదార్థాలకు దూరంగా ఉండటం ఉత్తమం. సరైన సమయానికి, సరైన మోతాదులో పోషకమైన అల్పాహారం తీసుకోవడం వల్ల కేవలం బరువు తగ్గడమే కాకుండా రోజంతా ఉత్సాహంగా ఉండవచ్చు. కాబట్టి రేపటి నుండి బ్రేక్‌ఫాస్ట్ ప్లేట్‌ను ఆరోగ్యకరంగా మార్చుకోండి.



## ఆరోగ్యం కోసం పరగడుపున అదొక్కటి తింటే చాలు

చూడటానికి ఎంతో సుకుమారంగా కనిపించినా, వ్యాయామం విషయంలో మాత్రం ఆమె ఒక రోల్‌మోడల్. నిత్యం యోగా, జిమ్ వర్కవుట్లతో తన సోషల్ డియాలో స్ఫూర్తిని నింపే ఆ బాలీవుడ్ నటి, తాజాగా తన మార్నింగ్ రొటీన్‌కు సంబంధించిన ఒక వింత అలవాటును పంచుకుంది. సాధారణంగా ఉదయాన్నే నిమ్మరసం, తేనె లేదా గ్రీన్ టీ తాగుతుంటారు. కానీ ఈమె మాత్రం అందరికీ భిన్నంగా ఒక పచ్చి వెల్లుల్లి రెబ్బను నమిలి తింటోంది. ఆ ఘాన వాసన, మండే రుచిని సైతం భరిస్తూ ఆమె ఎందుకు వెల్లుల్లిని తీసుకుంటోంది? కేవలం కొన్ని వారాల నుంచి పాటిస్తున్న ఈ చిన్న మార్పు తన శరీరంలో ఎలాంటి మ్యాజిక్ చేసిందో ఆమె స్వయంగా వెల్లడించింది. ఇంతకీ సోహా అలీ ఖాన్ నమ్ముతున్న ఆ ప్రాచీన వైద్య రహస్యం ఏంటి? వెల్లుల్లి మంత్రం.. ప్రముఖ నటి సోహా అలీ ఖాన్ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక ఆసక్తికరమైన వీడియోను షేర్ చేశారు. గత కొన్ని వారాలుగా తను ప్రతిరోజూ ఉదయాన్నే పరగడుపున ఒక చిన్న పచ్చి వెల్లుల్లి రెబ్బను తింటున్నట్లు ఆమె తెలిపారు. ఇది ప్రాచీన జ్ఞానం అని, ఇప్పటికీ ఇది అద్భుతంగా పనిచేస్తుందని ఆమె నమ్ముతున్నారు. ఈ అలవాటు వల్ల తన రోగనిరోధక శక్తి పెరగడమే కాకుండా, జీర్ణక్రియ మెరుగుపడిందని సోహా వివరించారు. వెల్లుల్లిని ఊరికే మింగేయడం కంటే నమిలి తినడం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుందని సోహా చెబుతున్నారు. వెల్లుల్లిని నమిలినప్పుడు అందులో ఉన్న 'అల్లిసిన్' అనే సమ్మేళనం యాక్టివేట్ అవుతుంది. వెల్లుల్లిలో ఉండే శక్తివంతమైన ఆరోగ్య ప్రయోజనాలకు ఈ అల్లిసిన్ ప్రధాన కారణం. ఒకవేళ నమలడం కష్టంగా అనిపిస్తే, వెల్లుల్లిని ముక్కలుగాకోసి, దంచి ఒక 10 నిమిషాల పాటు పక్కన పెట్టి, ఆ తర్వాత నీటితో కలిపి తీసుకోవాలని ఆమె సూచించారు.



## జుట్టూడిపోకుండా.. ఈ జాగ్రత్తలు!

చిన్న వయసులోనే జుట్టూడిపోవడం ఈమధ్య కామనైపోయింది.. ఇందుకు కారణాలెన్నో. అయితే ఎవరికి వారు కొన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లయితే జుట్టూడిపోకుండా కొంతవరకు కాపాడుకోవచ్చంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో– జుట్టు ఆరోగ్యానికి పాటించాల్సిన కొన్ని చిట్కాల గురించి తెలుసుకుందాం రండి.. శరీరానికి ఆరోగ్యకరమైన జీవనశైలి ఎంత అవసరమో.. శిరోజాల సంరక్షణకు కూడా అంతే అవసరం. ఇందులో భాగంగా సరిపడినన్ని మంచినీళ్లు తీసుకోవాలి. దీనివల్ల శరీరంలో నీటి స్థాయిలు పెరగడమే కాకుండా మలినాలు, వ్యర్థాలు బయటకు వెళ్లిపోతాయి. ఫలితంగా జుట్టు కూడా ఆరోగ్యాన్ని సంతరించుకుంటుంది. అవసరమైతే వైద్యులను సంప్రదించి విటమిన్ సప్లిమెంట్స్ తీసుకోవాలి. ఇందులోని పోషకాలు జుట్టు ఆరోగ్యంగా ఉండడానికి సహకరిస్తాయంటున్నారు నిపుణులు. జుట్టు ఆరోగ్యంగా పెరగాలంటే క్రమం తప్పకుండా హెయిర్‌ను ట్రిమ్ చేసుకోవాలి. తలస్నానానికి బాగా వేడిగా ఉండే నీళ్లు ఉపయోగించడం వల్ల జుట్టు కుదుళ్లకు నష్టం కలుగుతుంది. కాబట్టి గోరువెచ్చని నీటినే తలస్నానానికి ఉపయోగించాలి. వెంట్రుకలు దృఢత్వాన్ని సంతరించుకోవాలంటే స్నానం తర్వాత కండిషనర్‌ను రాసుకోవడం తప్పనిసరని చెబుతున్నారు నిపుణులు.



## చిన్న ముక్క అల్లం తింటే ఇన్ని లాభాలా!

అల్లం కేవలం వంటకు రుచిని ఇవ్వడమే కాదు, అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. దీనిలోని యాంటీ ఇన్‌ఫ్లమెటరీ గుణాలు జలుబు, నొప్పులను తగ్గిస్తాయి. రోగనిరోధక శక్తిని పెంచి, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. బరువు తగ్గడానికి, కొలెస్ట్రాల్ నియంత్రణకు, రక్తంలో చక్కెర స్థాయిలను క్రమబద్ధీకరించడానికి అల్లం తోడ్పడుతుంది. రోజువారీ ఆహారంలో చేర్చుకుంటే మంచి ఆరోగ్యం సొంతం. అల్లం వంటలకు కేవలం మంచి రుచిని ఇవ్వడమే కాదు.. ఇంకా అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. అల్లంలో ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమెటరీ గుణాలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఎన్నో రకాల అనారోగ్య సమస్యలకు అల్లంతో చెక్ పెట్టొచ్చు. జలుబు, దగ్గు, తలనొప్పి, మైగ్రేన్, నడుంనొప్పి, వెన్నుపూస నొప్పి, మోకాలి నొప్పులు, జాయింట్ పెయిన్స్ వంటి సమస్యలను తగ్గించడానికి అల్లం మంచి మెడిసిన్. ఆకలిని పెంచడంలో అల్లం బాగా సహాయ పడుతుంది. ముఖ్యంగా కీమోథెరపీ, రేడియోథెరపీ, క్యాన్సర్ బాధితులకు ఆకలి తగ్గిపోతుంది. అల్లం రోగనిరోధక శక్తిని పెంచి, శరీరాన్ని వ్యాధుల నుండి రక్షిస్తుంది. చర్మాన్ని మెరిసేలా చేసి, జుట్టును బలంగా, ఒత్తుగా ఉంచుతుంది. ఒత్తిడిని తగ్గించి మనస్సును ప్రశాంతంగా ఉంచడంలో కూడా ఇది ఎంతో సహాయపడుతుంది. ఆరోగ్యాన్ని మెరుగుపరచే ఈ సహజ ఔషధాన్ని రోజువారీ జీవనశైలిలో చేర్చుకోవడం మంచిది. అలాగే ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడేవారికి కొన్నిసార్లు ఆకలిగా అనిపించదు. ఇందులో నొప్పి, వాపును తగ్గించే లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. రోజుకు 2 నుంచి 5 గ్రాముల అల్లంను రెండు వారాల పాటు తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. అల్లం జీర్ణక్రియను మెరుగుపరచి, మలబద్ధకం సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. అదనపు కొవ్వును కరిగించి బరువు తగ్గడంలో సహాయపడుతుందే కాకుండా, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించి డయాబెటిక్ రోగులకు మేలు చేస్తుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో అల్లం తినడం లేదా అల్లం నీరు తాగడం శరీర డిటాక్స్‌కు సహాయపడుతుంది. ఒక నెలపాటు ప్రతిరోజూ అల్లం తినడం వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. అల్లంలోని పదార్థాల వల్ల రక్తంలోని గ్లిజరైడ్‌ల పరిమాణం తగ్గుతుంది.



## అనాస పువ్వు..పవర్ ఫుల్ మెడిసిన్..!

అనాస పువ్వు (స్టార్ పువ్వు) వంటలకు రుచిని వ్వడమే కాకుండా, అద్భుత ఆరోగ్య ప్రయోజనాలనిస్తుంది. ఇది జీర్ణశక్తిని మెరుగు పరుస్తుంది, మలబద్ధకాన్ని నివారిస్తుంది. యాంటీవైరల్, యాంటీబ్యాక్టీరియల్ లక్షణాలతో రోగనిరోధక శక్తిని పెంచి, గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. రక్తంలో షుగర్ స్థాయిలను నియంత్రిస్తుంది. పీరియడ్స్ సమస్యలు, చర్మ సౌందర్యానికి కూడా మేలు చేస్తుంది. అనాస పువ్వు .. ఇది ఒకరకమైన సుగంధ ద్రవ్యం.. ప్రతి వంటింట్లోనూ తప్పనిసరిగా ఉంటుంది. దీనినే స్టార్ పువ్వు అని కూడా అంటారు. ఇది వంటలకు రుచిని ఇవ్వడంతో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలనూ అందిస్తుంది. ముఖ్యంగా మనం తీసుకున్న ఆహారాన్ని జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. పేగు కండరాల కదలికలను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం సమస్యను దరిచేరకుండా చేస్తుంది. అనాస పువ్వులో యాంటీవైరల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచి అనేక రకాల ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడతాయి. జీర్ణశక్తిని పెంపొందించడంలో అనాస పువ్వు సహాయపడుతుంది. కడుపులోగ్యాస్, కడుపుఉబ్బరం, అజీర్తి వంటి సమస్యలను సమర్థవంతంగా తగ్గిస్తుంది. అనాస పువ్వు తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. రక్తాన్ని శుద్ధి చేసి గుండెకు రక్త ప్రసరణను మెరుగుపర్చడం ద్వారా హృదయ సంబంధ వ్యాధులు రాకుండా కాపాడుతుంది. రక్తంలో షుగర్ లెవెల్స్ కంట్రోల్ చేయడంలో అనాస పువ్వు ప్రభావవంతంగా పనిచేస్తుంది. దీనివల్ల డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. మూత్రనాళ ఇన్ఫెక్షన్‌తో బాధపడేవారు అనాస పువ్వును తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఇన్ఫెక్షన్లు రాకుండా నివారిస్తాయి. మహిళల్లో పీరియడ్స్ సమయంలో వచ్చే హార్మోన్ల అసమతుల్యతను తగ్గించడంలో అనాస పువ్వు ఉపయోగపడుతుంది. నెలసరి సమయంలో వచ్చే నొప్పులను కూడా తగ్గిస్తుంది. అనాస పువ్వులోని యాంటీఆక్సిడెంట్లు అనేక రకాల ఇన్ఫెక్షన్ల నుంచి చర్మాన్ని కాపాడతాయి. చర్మ సౌందర్యాన్ని రెట్టింపు చేస్తాయి.



## ఈ సమయంలో అరటిపండు అస్సలు తినొద్దా

చలికాలం వచ్చిందంటే చాలు, పిల్లల ఆరోగ్యం విషయంలో తల్లులకు ఒకటే ఆందోళన. మారుతున్న వాతావరణం వల్ల పిల్లలు త్వరగా జలుబు, దగ్గు బారిన పడుతుంటారు. ఈ క్రమంలో తల్లులు పిల్లలకు దూరంగా పెట్టే ప్రధానమైన ఆహారం అరటిపండు. అరటిపండు తింటే కఫం పెరుగుతుందని, దగ్గు ఎక్కువవుతుందని చాలామంది నమ్ముతారు. చలికాలం వచ్చిందంటే చాలు.. చిన్న పిల్లల తల్లులకు ఒకటే ఆందోళన. మారుతున్న వాతావరణం వల్ల పిల్లలు త్వరగా జలుబు, దగ్గు బారిన పడుతుంటారు. ఇలాంటప్పుడు వారి ఆహారం విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. ఈ క్రమంలో తల్లులు పిల్లలకు దూరంగా పెట్టే ప్రధానమైన ఆహారం అరటిపండు. అరటిపండు తింటే శ్లేష్మం పెరుగుతుందని, దగ్గు ఎక్కువవుతుందని చాలామంది నమ్ముతారు. కానీ ఇందులో నిజమెంత? చలికాలంలో అరటిపండు పెట్టడం సురక్షితమేనా? నిజానికి జలుబు లేదా దగ్గు అనేవి వైరస్ల ద్వారా వచ్చే ఇన్ఫెక్షన్లు. ఏ పండు కూడా నేరుగా జలుబును కలిగించదు. అరటిపండు తినడం వల్ల శరీరంలో శ్లేష్మం పెరుగుతుందని నిరూపించడానికి ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవు. అరటిపండు తిన్నప్పుడు గొంతులో కొంచెం బిగుతుగా అనిపించడం సహజం. అది కేవలం ఆ పండు ఆకృతి వల్ల కలిగే అనుభూతి మాత్రమే తప్ప కఫం కాదు. పిల్లలు జలుబు, దగ్గుతో బాధపడుతున్నప్పుడు నీరసించి పోతుంటారు. ఏ తినడానికి ఇష్టపడరు. అలాంటి సమయంలో అరటిపండు వారికి ఒక వరంలా పనిచేస్తుంది. ఇందులో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండటం వల్ల పిల్లలకు తక్షణ శక్తిని ఇస్తుంది. అరటిపండు మెత్తగా ఉండటం వల్ల గొంతు నొప్పి ఉన్న పిల్లలు కూడా దీనిని సులభంగా తినగలరు. ఇందులోని విటమిన్ సి, విటమిన్‌6 రోగనిరోధక శక్తిని పెంచి వైరస్‌తో పోరాడటానికి సహాయపడతాయి. శరీరంలోని ఖనిజ లవణాల సమతుల్యతను కాపాడుతుంది. పిల్లలకు అరటిపండు పెట్టినప్పుడు ఒకవేళ విరేచనాలు అవుతుంటే మాత్రం తాత్కాలికంగా ఆపేయడం మంచిది. చలికాలంలో ఏ ఆహారమైనా మితంగా ఇవ్వాలి. రోజుకు ఒకటి లేదా సగం అరటిపండును మ్యాష్ చేసి ఇవ్వడం వల్ల ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఫ్రిజ్‌లో పెట్టిన అరటిపండ్లను నేరుగా పిల్లలకు ఇవ్వకండి. గది ఉష్ణోగ్రత వద్ద ఉన్న పండ్లను మాత్రమే ఇవ్వండి. అరటిపండు ప్రకృతి మనకిచ్చిన ఒక అద్భుతమైన సూపర్ ఫుడ్. అనవసరమైన అపోహలతో పిల్లలకు ఈ పోషకాలను దూరం చేయకండి. జలుబు చేసినప్పుడు ఆకలిగా లేని పిల్లలకు అరటిపండు ఒక మంచి ప్రత్యామ్నాయం.



## వీటితో మేకప్ లుక్ సొంతం!



బయటికి వెళ్లిన ప్రతిసారీ మేకప్ వేసుకోవడం కుదరకపోవచ్చు.. అలాగే తరచూ మేకప్ వేసుకోవడం కొందరికి నచ్చకపోవచ్చు. అయినా మేకప్ వేసుకున్న లుక్‌ని సొంతం చేసుకోవాలంటే..? ఈ చిట్కాలు పాటించాలంటున్నారు నిపుణులు. మేకప్ డీటాక్స్‌లో భాగంగా ప్రాథమిక చర్మ సంరక్షణను పాటించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో బయటికి వెళ్లడానికి 15 నిమిషాల ముందు సన్‌స్క్రీన్ లోషన్‌ను రాసుకోవాలి. ఇది ఎండ నుంచి చర్మానికి రక్షణ కల్పించడమే కాదు.. చర్మానికి ఒక రకమైన మెరుపును తీసుకొస్తుంది. డల్‌గా ఉన్న ముఖాన్ని ప్రకాశవంతంగా మార్చాలంటే టింటెడ్ మాయిశ్చరైజర్‌ను వాడాలి. ఇక ప్రత్యేక సందర్భాల్లో మాత్రం హై కవరేజ్ ఫౌండేషన్స్‌ను వాడితే ఫలితం ఉంటుంది. అయితే ఏది ఎంచుకున్నా చర్మతత్వాన్ని బట్టి ఎంచుకోవడం ముఖ్యం. చర్మంపై మృత కణాలు ఏర్పడడం, పొలుసులుగా ఊడిపోవడం వల్ల ముఖం డల్‌గా కనిపిస్తుంది. దీనికి ఎక్స్‌ఫోలియేషన్ పద్ధతి మంచి పరిష్కారం అంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో మీ చర్మతత్వాన్ని బట్టి స్క్రబ్‌ను ఎంచుకొని లేదంటే ఇంట్లోనే సహజ స్క్రబ్‌లను తయారుచేసుకొని స్క్రబింగ్ చేసుకోవాలి. దీనివల్ల చర్మం లోలోపలి నుంచి శుభ్రపడి సహజసిద్ధమైన మెరుపు వస్తుంది. మేకప్ వేసుకోకపోయినా ఆ మెరుపును పొందాలంటే ముఖం శుభ్రం చేసుకున్నాక టోనర్ వాడమంటున్నారు నిపుణులు. దీనివల్ల ముఖంపై పీహెచ్ స్థాయులు బ్యాలన్స్ అయి చర్మం తాజాగా కనిపిస్తుంది. పెదాలు మృదువుగా ఉన్నప్పుడే వాటి అందం ఇనుమడిస్తుంది. ఇందుకోసం రోజూ లిప్‌బామ్ రాసుకోవడం తప్పనిసరి! అలాగే ఆలివ్ ఆయిల్ వంటి నూనెలతో పెదాలపై మర్దన చేసుకోవడం వల్ల వాటికి సహజ మెరుపు వస్తుంది. ఫలితంగా లిప్‌స్టిక్ రాసుకునే అవసరమే ఉండదంటున్నారు నిపుణులు.

# ఒక్కరోజే రూ. 23 వేలు పెరిగిన వెండి

దేశీయ మార్కెట్లో వెండి ధరలు మరో కొత్త మైలురాయిని అధిగమించాయి. ఒక రోజు సెలవు తర్వాత ప్రారంభమైన ట్రేడింగ్ సెషన్‌లో ఎంసీఎక్స్ వెండి కిలో ఏకంగా రూ. 23 వేలకు పైగి రూ. 3.65 లక్షలకు కొత్త జీవితకాల గరిష్ఠానికి చేరాయి.



ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం, హైదరాబాద్ మార్కెట్లో మంగళవారం వెండి కిలో రూ. 22 వేలు పెరిగి రూ. 3.87 లక్షలకు చేరింది. ఇదే సమయంలో స్వచ్ఛమైన బంగారం 10 గ్రాములు స్వల్పంగా రూ. 770 తగ్గి రూ. 1,62,060కి చేరింది. ఆభరణాల తయారీ ఉపయోగించే 22 క్యారెట్ల పసిడి రూ. 700 తగ్గి రూ. 1,48,450 వద్ద ఉంది. ప్రపంచ ఆర్థిక, భౌగోళిక రాజకీయ అనిశ్చితి, పారిశ్రామిక డిమాండ్ వంటి పరిస్థితుల కారణంగా వెండి ధరలు ఈ నెలలో ఇప్పటివరకు 18 శాతం పెరిగాయి. సరఫరా పరిమితం కావడం, ఇన్వెస్టర్లలో రిస్క్ తీసుకునే సామర్థ్యం పెరగడం కూడా ఇందుకు మద్దతిచ్చాయి. గ్లోబల్ మార్కెట్లలోనూ వెండి ధరలు భారీగా పెరిగాయి. గతేడాది జనవరిలో ఔన్స్ వెండి 30 డాలర్లు ఉండగా, ప్రస్తుతం ఇది ఏకంగా 111 డాలర్లకు చేరింది. కేవలం ఏడాది వ్యవధిలో వీటి ధరలు 270 శాతం పెరగడం గమనార్హం. ఈ ఏడాదిలోనే ఇప్పటివరకు 50 శాతం పెరిగింది. స్పాట్ గోల్డ్ ఔన్స్ ధర 5,071 డాలర్లతో స్వల్పంగా దిగొచ్చింది. మరోవైపు, భారత ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి అందించ సానుకూల సంకేతాలతో పాటు ప్రతిష్ఠాత్మక ఇండియా-ఈయూ డీల్ లాభాలకు కారణమయ్యాయి. ఇదే సమయంలో భారత కరెన్సీ రూపాయి కొంత బలపడటం, ముడిచమురు ధరలు దిగి రావడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ పుంజుకుంది. దీంతో మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 319.78 పాయింట్లు పెరిగి 81,857 వద్ద, నిఫ్టీ 126.75 పాయింట్లు లాభపడి 25,175 వద్ద ముగిశాయి. అమెరికా డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ. 91.58 వద్ద ఉంది.

# హల్వా వేడుకలో పాల్గొన్న ఆర్థిక మంత్రి నిర్మలమ్మ



మరో మూడు రోజుల్లో కేంద్ర బడ్జెట్ వెలువడనున్న నేపథ్యంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారంనాడు సాంప్రదాయ 'హల్వా' వేడుకలో పాల్గొన్నారు.ఫిబ్రవరి 1న లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న 2026-27 కేంద్ర బడ్జెట్ తయారీకి ఇది చివరి దశను సూచిస్తుంది. కర్తవ్య భవన్-ఈలోని కొత్త ప్రాంగణంలో ప్రింటింగ్ ప్రెస్ లేకపోవడంతో ఆర్థిక మంత్రిత్వ శాఖ పాత కార్యాలయం రాయ్‌సినా హిల్‌లోని నార్త్ బ్లాక్‌లో ఈ వేడుక జరిగింది. ఆర్థిక మంత్రి, ఆమె బృందంలోని చాలా మందిని గతేడాది సెప్టెంబర్‌లో ప్రతిష్ఠాత్మక నార్త్ బ్లాక్ నుంచి కర్తవ్య భవన్‌లో ఉన్న కొత్త కేంద్ర సచివాలయ కార్యాలయానికి మారిన సంగతి తెలిసిందే. ఈ వేడుకలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు సహాయ మంత్రి పంకజ్ చౌదరీ, ఆర్థిక శాఖలోని పలు విభాగాల కార్యదర్శులు, బడ్జెట్ రూపొందించడంలో భాగస్వామ్యం ఉన్న అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం తర్వాత బడ్జెట్ ప్రెస్‌ను పరిశీలించిన ఆర్థిక మంత్రి, ప్రింటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. హల్వా వేడుక అంటే బడ్జెట్ లాక్-ఇన్?పీరియడ్. ఈ ప్రక్రియ బడ్జెట్ తయారీలో ప్రత్యక్షంగా పాల్గొనే అధికారులు, సిబ్బంది పార్లమెంట్‌లో వార్షిక పద్దును ప్రవేశపెట్టేవరకు ఆ నార్త్ బ్లాక్‌లోనే ఉంటారు. బడ్జెట్ ప్రకటన ముగిసేంతవరకు ఎవ్వరూ బయటకు వెళ్లేందుకు అవకాశం ఉండదు. అందరూ సీసీటీవీ కెమెరాలు, భద్రతా సిబ్బంది నిఘాలో ఉంటారు. పార్లమెంట్‌లో నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం పూర్తయిన తర్వాత వారందరూ బయటకు వస్తారు. ఐదు రోజులపాటు వారు నార్త్ బ్లాక్‌లోనే ఉంటారు. 1950లో బడ్జెట్ ముద్రణ ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో లీక్ అయిన ఘటన కారణంగా ఈ లాక్-ఇన్ ప్రక్రియ అమల్లోకి వచ్చింది. కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్నారు.

# కొత్త భారత్ యాత్ర ట్రావెల్ కార్డును విడుదల చేసిన క్విక్‌కామర్




ప్రముఖ క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ బ్లింక్‌ఇట్ కొత్త ట్రావెల్ కార్డును విడుదల చేసింది. తన ప్లాట్‌ఫామ్ ద్వారా భారత యాత్ర పేరుతో తెచ్చిన ఈ కార్డు నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్(ఎన్‌సీఎంసీ) ఆధారంగా పనిచేస్తుంది. బ్లింక్‌ఇట్ ఈ కార్డును ఢిల్లీ ఎన్‌సీఆర్, బెంగళూరు, ముంబై, చెన్నై, అహ్మదాబాద్‌లలో అందుబాటులోకి తెచ్చింది. దీని ధర రూ.50 ఉంటుందని, ఎలాంటి కేవైసీ ప్రక్రియ అవసరం లేదని కంపెనీ తెలిపింది. ఇదే సమయంలో ఒక్కో సిటీలో ఒక్కో ట్రావెల్ కార్డుల అవసరాన్ని కూడా తొలగిస్తుందని బ్లింకిట్ మాతృ సంస్థ ఎటర్నల్ గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా త్వరలో బాధ్యతలు స్వీకరించనున్న అల్బిందర్ దిండ్సా అన్నారు.ఇది రూపే ఆధారిత కార్డు, తక్షణం యూపీఐ టాప్-అప్ సౌకర్యంతో పనిచేస్తుంది. దేశంలో వివిధ నగరాల్లో మెట్రో, బస్సులు వంటి ప్రజా రవాణాలో కీలకంగా ఉంటుందని దిండ్సా వివరించారు. ఈ కార్డును భారత్ యాత్ర మొబైల్ అప్లికేషన్ ఉపయోగించి లింక్ చేయడం ద్వారా యాక్టివేట్ చేసుకోవచ్చు. ఇది ఐదేళ్ల కాలపరిమితితో వస్తుందని, వ్యాలెట్‌లో రూ.2,000వరకు యాడ్ చేసుకోవచ్చని బ్లింక్‌ఇట్ పేర్కొంది. ప్రస్తుత దీన్ని ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్‌లోని మెట్రోలకు, ముంబై, చెన్నైలోని బస్సు ప్రయాణాలకు ఉపయోగించవచ్చు. భారత్ యాత్ర కార్డ్ ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ ఫ్లిప్‌కార్ట్‌లో అందుబాటులో ఉంది.



# బిజినెస్



## కనిష్టానికి ఇరాన్ కరెన్సీ.. డాలరుకు 15 లక్షల రియాల్స్



ఇరాన్ కరెన్సీ అయిన ఇరానియన్ రియాల్ మళ్లీ భారీగా పడిపోయింది. ఓపెన్ మార్కెట్‌లో ఒక అమెరికన్ డాలర్‌కు ఆల్ మ్ కనిష్టంగా సుమారు 14.7 లక్షల నుంచి 15 లక్షల రియాల్స్ వరకు డౌన్ అయింది. ఇది ఇరాన్ చరిత్రలోనే అత్యల్ప స్థాయి కావడం గమనార్హం. 2025 చివరితో పోలిస్తే రియాల్ విలువ దాదాపు 20 నుంచి 30 శాతం వరకు పడిపోయింది. అయితే ఇరాన్ సెంట్రల్ బ్యాంక్ ప్రకటించే అధికారిక రేటు సుమారు 42 వేల రియాల్స్‌గా ఉన్నప్పటికీ, ఆ రేటును సాధారణంగా ఎవరూ ఉపయోగించరు. దేశంలో వాస్తవంగా జరిగే లావాదేవీలు అన్నీ ఓపెన్ మార్కెట్ రేటు ప్రకారమే జరుగుతున్నాయి. ఇరాన్ కరెన్సీ పతనానికి అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా అమెరికా సహా పశ్చిమ దేశాల ఆర్థిక ఆంక్షల వల్ల ఇరాన్‌కు చమురు ఎగుమతులు తగ్గాయి. విదేశీ కరెన్సీ దేశంలోకి రావడం బాగా తగ్గిపోయింది. మరోవైపు దేశంలో ద్రవ్యోల్బణం తీవ్రంగా పెరిగింది. 2025 డిసెంబర్ నాటికి ఇన్‌ఫ్లేషన్ 40 శాతానికి పైగా ఉండగా, ఆహార పదార్థాల ధరలు 70 శాతం కంటే ఎక్కువగా పెరిగాయి. ధరల పెరుగుదలతో ప్రజలు ఆందోళనకు గురై దేశవ్యాప్తంగా నిరసనలు కూడా చేశారు. ప్రభుత్వం తీసుకున్న కొన్ని ఆర్థిక నిర్ణయాలు, సబ్సిడీల తగ్గింపు, ఫారెక్స్ నియమాల్లో మార్పులు కూడా పరిస్థితిని మరింత దిగజారేలా మార్చాయి. ఇది సాధారణ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఒక డాలర్‌కు 15 లక్షల రియాల్స్ అంటే దిగుమతి చేసుకునే ఆహారం, మందులు, టెక్నాలజీ వస్తువుల ధరలు భారీగా పెరిగిపోయినట్టేనని నిపుణులు చెబుతున్నారు. బ్రెడ్, మాంసం, ఔషధాలు వంటి అవసరమైన వస్తువులు కూడా సామాన్యులకు అందని స్థితికి చేరుతున్నాయి. ఇరాన్ ఇప్పుడు హైపర్ ఇన్‌ఫ్లేషన్ దశకు చేరిందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అందుకే ప్రజలు తమ డబ్బు విలువ కాపాడుకోవడానికి డాలర్లు, బంగారం, క్రిప్టో కరెన్సీల్లో పెట్టుబడి పెడుతున్నారు. ప్రభుత్వం, సెంట్రల్ బ్యాంక్ మాత్రం దీనిని సహజ ప్రక్రియగా చెబుతున్నా, ఆర్థిక నిపుణులు ఇది తీవ్రమైన ఆర్థిక సంక్షోభమని, రాబోయే రోజుల్లో మరిన్ని నిరసనలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. మరోవైపు ఇరాన్ రియాల్ ప్రపంచంలోనే అతి తక్కువ విలువ గల కరెన్సీల జాబితాలో ఒకటిగా చేరింది.

## ఎఫ్‌టీఏతో యూరప్‌లో భారతీయ ఐటీ సంస్థలకు మెరుగైన అవకాశాలు

ప్రతిష్ఠాత్మక ఇండియా-యూరోపియన్ యూనియన్ (ఈయూ) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) జరగడం పట్ల ఐటీ పరిశ్రమల సంఘం నాస్కామ్ హర్షం వ్యక్తం చేసింది. ఈ ఒప్పందం ద్వారా దేశంలోని టెక్ పరిశ్రమకు మెరుగైన ఈయూ మార్కెట్ యాక్సెస్ లభిస్తుంది. ప్రస్తుతం యూరప్ భారతీయ ఐటీ సేవల సంస్థలకు ఆశాజనకమైన కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్ లాంటి సంస్థలు విస్తరిస్తున్నాయి. ఎఫ్‌టీఏ ద్వారా ఆయా కంపెనీలకు మరిన్ని ఒప్పందాలను సాధించడానికి సహాయపడుతుంది. వస్తువులపై గణనీయంగా సుంకాలు తగ్గనున్నప్పటికీ, సేవల రంగ లాభాల వల్ల మార్కెట్లో మరింత యాక్సెస్ లభిస్తుందని, నిబంధనల సడలింపు కలిసొస్తుందని నాస్కామ్ అభిప్రాయపడింది. ముఖ్యంగా ఎఫ్‌టీఏ ఖరారు కావడంతో భారతీయ ఐటీ ప్రొఫెషనల్స్‌కు అవకాశాలు మెరుగుపడతాయి. స్కిల్స్ ఉన్న ఉద్యోగులను సులభంగా బదిలీ చేయవచ్చని, సేవలను సజావుగా సరిహద్దు దాటేందుకు, సురక్షితమైన డేటా సరఫరాకు వీలవుతుంది. ఈ ఒప్పందంలో టెక్నాలజీ చిన్న భాగం కాదని




నిపుణులు అంటున్నారు. ఇది భారత్‌ను ప్రపంచ ఐటీ లీడర్‌గా గుర్తిస్తుంది. డిజిటల్ వాణిజ్యం, ఈ-సేవలు, డేటా భద్రత, డిజిటల్ అథంటికేషన్‌ను ప్రోత్సహిస్తుంది. భారతీయ టెక్ కంపెనీలు యూరప్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థతో మరింత లోతుగా కనెక్ట్ అవ్వడానికి సహాయపడుతుందని నాస్కామ్ పేర్కొంది.

## ఆర్థిక సర్వే అంచనాలను వాస్తవ వృద్ధి అధిగమిస్తోంది!



మనదేశ ఆర్థిక వృద్ధి గణాంకాలను పరిశీలిస్తే, ఆర్థిక సర్వేలో ప్రకటించిన అంచనాలను తరచుగా అధిగమిస్తున్నాయి. బడ్జెట్ ముందస్తు పత్రం (ప్రీ-బడ్జెట్ డాక్యుమెంట్)లో అంచనా వేసిన 6.3-6.8% వృద్ధికి మించి 2025-26 ఆర్థిక సంవత్సరంలో 7.4% వృద్ధిరేటు నమోదవుతుందని అంచనా. 2023-24 ఆర్థిక సర్వేలో జీడీపీ వృద్ధి 6-6.8 శాతమని అంచనా వేయగా, అది 9.2 శాతంగా నమోదైంది. 2024-25లో మాత్రం ఆర్థిక సర్వే అంచనా 6.5-7 శాతానికి అనుగుణంగా, 6.5 శాతంగా నమోదైంది. 2022-23లో లక్ష్యం నెరవేరలేదు. వాస్తవిక ఆర్థిక వృద్ధి 7.65% ఉండగా, ఆర్థిక సర్వే అంచనా 8-8.5 శాతంగా ఉంది. 2021-22లో కొవిడ్ కారణంగా ఆర్థిక సర్వే ఎలాంటి అంచనాలను వేయలేదు. కానీ బేస్ ప్రభావం కారణంగా 9.7% వృద్ధి నమోదైంది. 2020-21లో కొవిడ్ ప్రభావం, తదనంతర లాక్‌డౌన్‌ల కారణంగా 5.8% ప్రతికూల వృద్ధి నమోదైంది. ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుండగా, దీనికి ఒకరోజు ముందు ఆర్థిక సర్వేను వెల్లడిస్తారు.

# క్రీడలు

## రికార్డు పుటల్లో జోస్ బట్లర్



ఇంగ్లండ్ వికెట్ కీపర్, విధ్వంస బ్యాటర్ జోస్ బట్లర్ రికార్డుపుటల్లోకెక్కాడు. ఇంగ్లండ్ తరఫున 400 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన రెండో ఆటగాడిగా బట్లర్ రికార్డుల్లోకెక్కాడు. కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో మంగళవారం శ్రీలంకతో ప్రారంభమైన వన్డేల్లో ప్రాతినిధ్యం వహించిన బట్లర్ ఈ రికార్డును లిఖించాడు. ఇంగ్లండ్ తరఫున అత్యధిక అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన రికార్డు జేమ్స్ ఆండర్సన్(401మ్యాచ్‌లు) పేరిట ఉండగా.. 35ఏళ్ల బట్లర్ ఆ రికార్డుకు మరొక్క మ్యాచ్ దూరంలో ఉన్నాడు. ఆండర్సన్ మూడు ఫార్మాట్‌లలో కలిసి 401అంతర్జాతీయ మ్యాచుల్లో 991 వికెట్లు పడగొట్టాడు. ఇక వికెట్ కీపర్, బ్యాటర్ అయిన ఆండర్సన్ మూడు ఫార్మాట్‌లలో కలిపి 12,291పరుగులుచేశాడు. ఇందులో 14సెంచరీలున్నాయి. 57టెస్టుల్లో 2,907పరుగులు, 198వన్డేల్లో 5,515పరుగులు, 144 టి20ల్లో 35.89సగటుతో 3,869 పరుగులుచేశాడు. ఐసిసి టి20 ప్రపంచకప్‌కు ఇంగ్లండ్‌ప్రకటించిన జట్టులో జోస్ బట్లర్ చోటుదక్కించుకోవడంతో అతడు ఆండర్సన్ రికార్డును బ్రేక్ చేయనున్నాడు.

## వరల్డ్‌కప్‌లోకి ఇలా రావాలనుకోలేదు.. ట్విస్ట్ ఇచ్చిన స్కాట్లాండ్

టీ20 ప్రపంచ కప్ 2026 టోర్నమెంటులో చివరి క్షణంలో ఛాన్స్ దక్కించుకుంది స్కాట్లాండ్. భద్రతా కారణాల వల్ల ఐసీసీ నిర్వహిస్తున్న టీ20 ప్రపంచ కప్ 2026 నుంచి బంగ్లాదేశ్ తప్పుకుంది.అయితే బంగ్లాదేశ్ తప్పుకున్న తరుణంలో ర్యాంకింగ్స్ ను ఆధారం చేసుకుని,



స్కాట్లాండ్ జట్టును తెరపైకి తీసుకువచ్చింది ఐసీసీ. అయితే ఈ నేపథ్యంలోనే క్రికెట్ స్కాట్లాండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ట్రూడీ లిండ్ బ్లేడ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అసలు ఈ అడ్డదారిన ప్రపంచ కప్ 2026 టోర్నమెంట్ లోకి రావాలని అస్సలు అనుకోలేదని వివరించారు. అర్హత సాధించేందుకు ఒక ప్రక్రియ ఉంటుందని వెల్లడించారు.

## రిర్మెంట్ పై కేఎల్ రాహుల్ షాకింగ్ కామెంట్స్

టీమిండియా స్టార్ క్రికెటర్ కేఎల్ రాహుల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన రిర్మెంట్ గురించి పేర్కొంటూ, అభిమానులకు షాక్ ఇచ్చాడు. తన రిర్మెంట్ కు ఇంకా సమయం ఉందని కేఎల్ రాహుల్ వెల్లడించారు. ఇక ఆ సమయం వచ్చినప్పుడు దిగిపోవడమేనని, అస్సలు వెనకడుగు వేయబోనని సంచలన ప్రకటన చేశారు. రిర్మెంట్ గురించి ఇప్పటికే ఆలోచించాను.. అది అంత కష్టమైనది కాదని వెల్లడించారు. నన్ను నేను సూపర్ స్టార్ అని అస్సలు అనుకోను.. టీమిండియాలో స్టార్ ఆటగాడిని అని కూడా అనుకోవట్లేదు అంటూ క్లారిటీ ఇచ్చారు కేఎల్ రాహుల్.

## పాకిస్థాన్ తప్పుకుంటే మళ్లీ బంగ్లాదేశ్ ఎంట్రీ?



పొట్టి ఫార్మాట్ వరల్డ్ కప్ 2026లో పాకిస్తాన్ ఆడేది ఇంకా క్లారిటీ రాలేదు. ఇప్పటికే ఈ టోర్నమెంట్ నుంచి బంగ్లాదేశ్ తప్పుకోగా, పాకిస్తాన్ కూడా అదే బాటలో నడిచే ఛాన్సులు కనిపిస్తున్నాయి. ఈ వరల్డ్ కప్ ఆడేందుకు ఇప్పటికే తమ జట్టును పాకిస్తాన్ ప్రకటించింది. కానీ ఈ టోర్నమెంట్ బాయ్ కాట్ చేస్తామంటూ పరోక్షంగా హింట్ ఇస్తోంది. అయితే పాకిస్తాన్ డ్రామాలు చేస్తున్న నేపథ్యంలో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ప్లాన్ బీ సిద్ధం చేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. టీ20 ప్రపంచ కప్ 2026 నుంచి పాకిస్తాన్ కూడా వైదొలిగితే, బంగ్లాదేశ్ డిమాండ్లను పరిష్కరించేందుకు ఐసీసీ సిద్ధమవుతోందట. ఇండియాలో కాకుండా శ్రీలంకలో తమ మ్యాచ్ లను నిర్వహించాలని పదేపదే బంగ్లాదేశ్ కోరిన సంగతి తెలిసిందే. అయితే ఈ టోర్నమెంట్ నుంచి పాకిస్తాన్ తప్పుకుంటే, కచ్చితంగా బంగ్లాదేశ్ కు అవకాశం ఇవ్వనుందట ఐసీసీ. వాళ్లు అడిగినట్లుగానే శ్రీలంకలో బంగ్లాదేశ్ మ్యాచ్ లు నిర్వహించేందుకు సంసిద్ధం అవుతోందట. ఇదే జరిగితే పాకిస్తాన్ కు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం పొంచి ఉంది. మరి దీనిపై పాకిస్తాన్ ఎలా ముందుకు వెళ్తుందో చూడాలి. వచ్చే సోమవారం లోపు తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామని ఇప్పటికే పాకిస్తాన్ క్రికెట్ బోర్డు వెల్లడించింది. కాగా ఈ టోర్నమెంట్ నుంచి బంగ్లాదేశ్ ఇప్పటికే బయటకు వెళ్లగా, కొత్తగా స్కాట్లాండ్ బరిలోకి దిగింది.

## గంభీర్ కు అగ్ని పరీక్ష.. అదే జరిగితే, పదవి పోవడం గ్యారెంటీ !



భారత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పై మనోజ్ తివారీ సంచలన వ్యాఖ్యలు చేశారు. టీ 20 ప్రపంచ కప్ 2026 టోర్నమెంట్ గౌతమ్ గంభీర్ అగ్ని పరీక్ష అంటూ హాట్ కామెంట్స్ చేశారు. ఈ టోర్నమెంట్ లో భారత జట్టు అట్టర్ ఫ్లాఫ్ అయి, ఇంటి దారి పడితే, గౌతమ్ గంభీర్ పదవి పోవడం గ్యారెంటీ అంటూ హెచ్చరించారు మనోజ్ తివారీ. ఈ విషయాన్ని గుర్తు పెట్టుకుని, ముందుకు వెళ్లాలని సూచనలు చేశారు. టీ20 ప్రపంచ కప్ టోర్నమెంటు గ్రూప్ స్టేజిలోనే భారత జట్టు ఎలిమినేట్ అయితే వెంటనే గౌతమ్ గంభీర్ రాజీనామా చేయాల్సి వస్తుందని కూడా వార్నింగ్ ఇచ్చాడు. అందరి కన్ను ఇప్పుడు గౌతమ్ గంభీర్ పైన ఉందని గుర్తు చేశారు. ఇక హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పై వేటు పడితే, వీవీఎస్ లక్ష్మణ్ కు అవకాశం రాబోతున్నట్లు మనోజ్ తివారీ అంచనా వేశారు. అదే సమయంలో భారత జట్టును తక్కువ అంచనా వేయకూడదని కూడా ప్రత్యర్థులకు వార్నింగ్ ఇచ్చారు. సూర్య కుమార్ యాదవ్ ఆధ్వర్యంలోని భారత జట్టు చాలా బలంగా ఉందన్నారు. భారత్ ను ఓడించడం చాలా కష్టమని తెలిపారు.

## వరల్డ్ కప్‌లో భారత అండర్-19 జట్టు హవా..



ఐసీసీ అండర్-19 వరల్డ్ కప్‌లో యువ భారత్‌కు ఎదురులేకుండా పోయింది. అడ్డొచ్చిన జట్టునల్లా చిత్తు చేస్తూ ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. సూపర్-6 రౌండ్‌లో మంగళవారం బులవాయోలో జరిగిన మ్యాచ్‌లో జింబాబ్వేపై 204 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. టోర్నీలో యువ భారత్‌కు ఇది వరుసగా నాలుగో గెలుపు. ముందుగా బ్యాటింగ్ చేసిన ఇండియా 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 352 పరుగులు చేసింది. విహాన్ మల్హోత్రా(109 నాటౌట్) అజేయ శతకంతో సత్తాచాటాడు. అతనికితోడు వైభవ్ సూర్యవంశీ(52), అభిగ్యాన్ కుండు (61) హాఫ్ సెంచరీలతో రాణించారు. అనంతరం బంతితోనూ భారత జట్టు అదరగొట్టింది. ఛేదనకు దిగిన జింబాబ్వే 37.4 ఓవర్లలో 148 పరుగులకే ఆలౌంది. ఆ జట్టు చివాలా (62) మాత్రమే పోరాటం చేశాడు. బౌలర్లు ఉద్ధవ్ మోహన్, ఆయుశ్ మాత్రమే చెరో 3 వికెట్లు పడగొట్టి జింబాబ్వే పతనాన్ని శాసించారు. అంబ్రీష్‌కు కూడా 2 వికెట్లు తీశాడు. ఫిబ్రవరి 1న పాకిస్తాన్‌తో భారత్ తలపడనుంది.

## అతడు.. క్రిస్ గేల్ కన్నా విధ్వంసకర ఆటగాడు

భారత టీ20 స్పెషలిస్ట్ బ్యాటర్ అభిషేక్ శర్మ.. క్రిస్‌గేల్ కన్నా విధ్వంసకరమైన ఆటగాడని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ అభిప్రాయపడ్డాడు. 'సాధారణంగా దూకుడుగా ఆడే ఆటగాళ్లలో నిలకడ ఉండదు. నేను చాలామంది పెద్ద ఆటగాళ్లను గమనించాను. క్రిస్ గేల్ ఇలాగే పెద్ద పెద్ద షాట్లు కొడతాడు. కానీ అతడు చాలా తెలివిగా క్రికెట్ ఆడతాడు. గేల్.. మెయిడిన్ ఓవర్లూ ఆడతాడు. అతడు తన మొదటి ఓవర్లో చాలా జాగ్రత్తగా బ్యాటింగ్ చేస్తాడు. ముఖ్యంగా బెంగళూరు లాంటి పిచ్‌ల ద చాలా నెమ్మదిగా బ్యాటింగ్ ప్రారంభిస్తాడు. తర్వాత వేగం పెంచుతాడు' అని కైఫ్ అన్నాడు. 'అయితే అభిషేక్ శర్మ దీనికి పూర్తి విరుద్ధం. అతడు క్రీజులో సెటిల్ కావడానికి సమయం తీసుకోడు. వచ్చీరాగానే బౌలర్ల ద ఎదురుదాడికి దిగుతాడు. అలా బ్యాట్‌తో విధ్వంసం సృష్టించే బ్యాటర్లలో నిలకడ ఉండదు. కానీ అభిషేక్ శర్మకు ఈ విషయంలో మినహాయింపు. అతడు ప్రతి మ్యాచ్‌లోనూ తనను తాను నిరూపించుకుంటున్నాడు. అతడు కేవలం 12, 14 బంతులే ఎదుర్కొంటున్నప్పటికీ వాటి నుంచే 60 నుంచి 70 పరుగులు రాబడుతున్నాడు. అదే అతడిని మ్యాచ్ విన్నర్‌గా నిలబెడుతోంది. ఒకవేళ అభిషేక్ శర్మ మ్యాచ్‌లో రాణిస్తే.. టీమ్ఇండియానే కచ్చితంగా విజేతగా నిలుస్తుంది' అని కైఫ్.. అభిషేక్ శర్మను కొనియాడాడు. అభిషేక్ శర్మ న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో బ్యాట్‌తో విజృంభించిన విషయం తెలిసిందే. కేవలం 20 బంతుల్లోనే దాదాపు 340 స్ట్రైక్‌రేట్‌తో 68 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచాడు. ఇందులో ఏడు ఫోర్లు, అయిదు సిక్సులు ఉన్నాయి. అలాగే 14 బంతుల్లోనే హాఫ్‌సెంచరీ సాధించాడు. యువరాజ్ సింగ్ గతంలో 12 బంతుల్లోనే చేసిన హాఫ్‌సెంచరీ రికార్డ్‌ను బ్రేక్ చేసే అవకాశాన్ని తృటిలో కోల్పోయాడు.



# ఉదయం సినిమా

## ప్రముఖ దర్శకుడు ఎన్ శంకర్‌కి మాతృవియోగం



టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు ఎన్ శంకర్ అమ్మ నిమ్మల సక్కుబాయమ్మ (78) బుధవారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆమెకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. గురువారం హైదరాబాద్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నారని దర్శకుడు ఎన్.శంకర్ తెలియచేశారు. గురువారం ఉదయం 11 గంటలకు చిత్రపురి కాలనీలోని హెచ్.ఐ.జి బ్లాక్ 11లో ఆమె సందర్శనార్థం బాడిని ఉంచనున్నారని తెలియచేశారు.

## మర్దానీ3తో రాణీ ముఖర్జీ 30 ఏళ్ల ఐకానిక్ సినీ లెగసీని సెలబ్రేట్ అద్భుతం

### బాలీవుడ్ సూపర్‌స్టార్ రణ్‌భీర్ కపూర్



బాలీవుడ్ సూపర్‌స్టార్ రణ్‌భీర్ కపూర్ తన ఇష్టమైన నటి రాణీ ముఖర్జీ 30 వసంతాల ప్రస్థానాన్ని మర్దానీ 3 సినిమాతో సెలబ్రేట్ చేయటానికి భారతీయ సినీ పరిశ్రమ కలిసి ముందుకు రావటం చూసి చాలా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. రణ్‌భీర్ కపూర్ డెబ్యూ మూవీ సావరియాలో రాణీ ముఖర్జీతో కలిసి నటించారు. ఈ సినీ ప్రయాణంలో క్లిష్ట సమయాల్లో ఆమె అతనికి తోడుగా నిలిచింది. అందుకనే రాణి ప్రయాణంలో, ప్రతి సినిమా సక్సెస్ కావాలని రణ్‌భీర్ కోరుకుంటుంటాడు.

ఈ సందర్భంగా రణ్‌భీర్ కపూర్ మాట్లాడుతూ "రాణీ ముఖర్జీ సావరియా చిత్రంలో నాతో కలిసి నటించారు. నేనెంతో కష్టపడి నటించానని నాకు చెప్పి ప్రోత్సహించిన మొదటి వ్యక్తి తనే. నాకు, ఆమె జరిగిన సంభాషణను నేను మరచిపోలేను. నాకు అవసరమైన సమయంలో ఆమె మాటలు నాలో ఆత్మ విశ్వాసాన్ని నింపాయి. నేను ఆమెను దగ్గరగా గమనించాను. నేను ఆమె వర్క్‌ను చాలా దగ్గరగా గమనించాను. ఆమె గ్రేస్, ఛార్మ్, తెలివితేటలకు ముగ్ధుడినయ్యాను. రాణీ ముఖర్జీ తన 30 ఏళ్ల సినీ ప్రయాణాన్ని సెలబ్రేట్ చేసుకోవటం నిజంగా అద్భుతం. ఆమె ఎప్పటికీ ప్రత్యేకమైన వ్యక్తిగా నేను భావిస్తాను. భారతదేశంలోని గొప్ప నటీమణుల్లో ఆమె ఒకరు. మన ఇండస్ట్రీ ఏంటో ఆమె తన పనితనంతో నిర్వచించారు. ఆమె ఎంచుకునే సినిమాలు, పాత్రలు ఇప్పుడు స్క్రీన్‌పై మహిళలను చూపించే విధానాన్ని మార్చాయి. రాణీ తన సినిమాలతో ప్రేక్షకులను మెప్పించాలనుకున్నారు. ఆమె మనకు అందించిన సినిమాలు, వాటి తీపి గుర్తులను మనం మరచిపోలేం. అందుకు ఆమెకు ధన్యవాదాలు. మనల్ని నటనతో మెప్పించటానికి, సంతోషపరచటానికి జీవితాన్ని ఇచ్చిన ఎంటరటైనర్ ఆమె. ఆమె సినిమాలు నాపై చూపిన ప్రభావాన్ని మాటల రూపంలో చెప్పలేను" అన్నారు.

రాణీ ముఖర్జీ మర్దానీ 3 ఇప్పుడు సోషల్ మీడియాలో, నెట్టింట తెగ వైరల్ అవుతోన్న సినిమా, అందరి నోట ఆ సినిమా గురించే. మర్దానీ ఫ్రాంచైజీ విషయానికి వీటిలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను చూపించారు. ఇప్పుడు పేద కుటుంబాల్లోని 8 నుంచి 9 ఏళ్ల చిన్నమ్మాయిలను కొందరు ఓ కారణంతో కిడ్నాప్ చేస్తున్నారనే అంశాన్ని చూపించబోతున్నారు. అభిరాజ్ మినావాల దర్శకత్వంలో, ఆదిత్య చోప్రా నిర్మించిన మర్దానీ 3 సినిమా సామాజిక సమస్యలను చూపించే సినిమాల పరంపరను కొనసాగిస్తోంది. తొలి భాగం మనకు హ్యూమన్ ట్రాఫికింగ్ యొక్క భయంకర నిజాలను చూపిస్తే.. మర్దానీ 2 సీరియల్ రేపిస్ట్ మానసికతను, వ్యవస్థను సవాళ్లు ఇచ్చే పరిస్థితిని ఆవిష్కరించింది. ఇప్పుడు మర్దానీ 3 మన సమాజంలో మరో చీకటి, భయంకర నిజాన్ని చూపించబోతున్న పవర్‌ఫుల్ కథాంశంతో మన ముందుకు రానుంది.

## షూటింగ్ పూర్తి చేసుకున్న హ్రీం..



తెలుగు భీజాక్షరాల్లో 'హ్రీం' అనే అక్షరానికి ఎంతో ఉన్నతమైన విలువలతో కూడిన అర్థం ఉంది. 'హ్రీం' అనే ఒక్క భీజాక్షరంలో 'హ', 'ర', 'ఈ', 'మ' అనే అక్షరాలున్నాయి. హ అంటే ధర్మం, ర అంటే అర్థం, ఈ అంటే కామం, మ అంటే మోక్షం..'హ్రీం' అంటే దర్మార్థ కామ మోక్షాలు కలగలిసిన భీజాక్షరం. ఇప్పటివరకు ఎక్కడా చెప్పని ఒక యదార్థ గాథను ఆధారంగా తీసుకుని ఈ చిత్రానిన తెరకెక్కించారు. శివమ్‌మీడియా పతాకంపై 'హ్రీం' అనే భీజాక్షరంతో తయారైన ఈ సినిమాలో నూతన నటీనటులు పవన్ తాత, డాక్టర్ చమిందా వర్మ జంటగా నటించారు. హారర్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం వరంగల్, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేసుకుంది. 'హ్రీం' చిత్రానికి రాజేష్ రావూరి దర్శకుడు. శ్రీమతి సుజాత మల్లాల సమర్పిస్తున్న ఈ చిత్రానికి శివమల్లాల నిర్మాత. వరంగల్ దగ్గరలోని పెద్ద పెండ్యాల గ్రామంలో తొలి షెడ్యూల్, హైదరాబాద్ హెచ్‌యంటీ కాలనీలోని ఫారెస్ట్ లొకేషన్స్‌లో సెకండ్ షెడ్యూల్‌ని పూర్తి చేసుకుంది చిత్రం. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. కీలక పాత్రల్లో ప్రముఖ నటులు తనికెళ్ల భరణి, రాజీవ్ కనకాల, బెనర్జీ, భద్రం, అనింగి రాజశేఖర్ (శుభోదయం సుబ్బారావు), త్రిపురనేని శ్రీవాణి, పూజారెడ్డి, వనితా రెడ్డి తదితరులు నటించారు. కథ–కథనం–దర్శకత్వం – రావూరి రాజేష్, నిర్మాత– శివ మల్లాల, కెమెరా– అరవింద్, సంగీతం– మార్కస్.ఎం, ఎడిటింగ్–డిఐ– వైఎస్ఎస్ శివప్రకాశ్ ఆర్ట్ – సుధీర్ మాచర్ల 'క' ఫేమ్ వీ.ఎఫ్.ఎక్స్ డైరెక్టర్– రాజ్ పవన్ కొమ్మోజు, పి.ఆర్.వో – మూర్తి మల్లాల.

## ఓం శాంతి శాంతి శాంతి: ఫ్యామిలీతో కలిసి ఎంజాయ్ చేసే సినిమా




### ప్రీరిలీజ్ ఈవెంట్‌లో హీరో తరుణ్ భాస్కర్

మల్టీ ట్యాలెంటెడ్ తరుణ్ భాస్కర్ లీడ్ రోల్‌లో నటిస్తున్న హిలేరియస్ విలేజ్ కామెడీ ఎంటర్ టైనర్ 'ఓం శాంతి శాంతి శాంతిః. ఈషా రెబ్బా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఏఆర్ సజీవ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ బ్యానర్స్‌పై సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనుప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్, నవీన్ సనివరపు ఈ వెంచర్‌ను నిర్మిస్తుండగా, కిషోర్ జాలాది, బాల సౌమిత్రి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే విడుదలై ప్రమోషనల్ కంటెంట్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఓం శాంతి శాంతి శాంతిః జనవరి 30న వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు.

ప్రీరిలీజ్ ఈవెంట్ లో హీరోయిన్ ఈషా రెబ్బా మాట్లాడుతూ... అందరికీ నమస్కారం. 'ఈ నగరానికి' బాయ్స్ అందరు వచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. సృజన్ నాకు చాలా ఏళ్లుగా తెలుసు. తను ఎప్పుడు కూడా కొత్త కంటెంట్ ని ప్రోత్సహిస్తారు. నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ఆయనకి థాంక్స్. నన్ను ఈ క్యారెక్టర్ లో బిలీవ్ చేసినందుకు సజీవ్ కి థాంక్యూ. సజీవ్ ఈ సినిమాని డిజైన్ అద్భుతంగా చేశారు. నందు చాలా చక్కని డైలాగ్స్ రాశారు. ప్రతి క్యారెక్టర్ రిలేట్ అయ్యేలా ఉంటుంది. ఇందులో చాలా మీనింగ్ ఫుల్ మ్యూజిక్ మ్యూజిక్ వుంటుంది. తరుణ్ డైరెక్షన్ లో వర్క్ చేయాలని ఉండేది. ఆయన యాక్టింగ్ కూడా చక్కగా చేస్తారని తెలుసు. కానీ ఆయనకి గోదావరి యాస రావడం చాలా చాలా కష్టం. దాని కోసం చాలా ప్రిపేర్ అ య్యారు. అంబటి ఓంకార్ నాయుడు పాత్రకి ప్రాణం పోశారు. ఆయనతో వర్క్ చేసినందుకు ఆనందంగా ఉంది. ఆయన డైరెక్షన్లో కూడా పని చేస్తాననే నమ్మకం ఉంది. ఇందులో నా క్యారెక్టర్ తో ప్రతి అమ్మాయి రిలేట్ అవుతుంది. ఫ్యామిలీ అందరికీ నచ్చే సినిమా ఇది. ఈ సినిమా పని చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు. జనవరి 30న తప్పకుండా అందరూ థియేటర్స్ కి వెళ్లి ఈ సినిమా చూడాలని కోరుకుంటున్నాను.

హీరో తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ. అందరికీ నమస్కారం. అందరికంటే చివర్లో హీరోనే మాట్లాడాలి. ఇందులో మా హీరో ఈషా. తనే చివర్లో మాట్లాడుతుంది (నవ్వుతూ) డైరెక్టర్ సజీవ్ చాలా మంచి మనిషి. తనకు కావాల్సింది వచ్చేంతవరకు హార్డ్ వర్క్ చేస్తూనే ఉంటాడు. ఇందులో గోదారి యాస చక్కగా పలికాను. దానికి కారణం తనే. రాత్రి నిద్రలో కూడా నాకు ఆ గోదారి యాస, ఆ ప్రాంతమే కలలోకి వచ్చేద( నవ్వుతూ) నందు చక్కని మాటలు రాశాడు. డైరెక్షన్ టీమ్ అందరికీ థాంక్యూ. ఈ సినిమాకి చాలా మంది హీరోలు ఉన్నారు. ఈ సినిమా అందరూ రిమేక్ అంటున్నారు. కానీ ఈ కథని ఒరిజినల్ గా ప్రజెంట్ చేయడానికి నిదర్శనమే ఆ పాట. జై క్రిష్ వజ్రం లాంటి సాంగ్ ఇచ్చాడు. ధీరజ్ బ్రహ్మాజీ గారు అందరు కూడా పాత్రలో ఇమిడిపోయారు. ఈ నగరానికి ఏమైంది బాయ్స్ అందరికీ థాంక్ యూ. వాళ్ళకి షూటింగ్ అని చెప్పాను. అందుకే వచ్చారు (నవ్వుతూ) ఫ్యామిలీ అంతా కలిసి ఒక సినిమా చేసిన ఫీలింగ్ కలుగుతుంది. సృజన్ నా జూనియర్. తనని ఎప్పుడు చూసినా నాకు అదే ఫీలింగ్ ఉంటుంది. తనకి సినిమా అంటే చాలా పాషన్. ఈ రోజుల్లో సినిమాలు నిర్మించడం చాలా కష్టమైన పని. ఏ సినిమా ఎప్పుడు ఆడుతుందో తెలీదు. ఇలాంటి సమయంలో ప్రొడ్యూసరే హీరో. ఈ సినిమా నిర్మాతలు అందరికీ హాట్సాఫ్. ఇంతమంది హీరోల మధ్యలో నేను చిన్న క్యారెక్టర్ ఆర్టిస్ట్ నే. ఈషా అంటే నాకు చాలా ఇష్టం. నెట్ ఫ్లిక్స్ లో రాములు చేసినప్పుడు కూడా తనని సంప్రదించాను. అప్పుడు తను వేరే ప్రాజెక్టులో భాగమై ఉన్నారు. శాంతి క్యారెక్టర్ కు తన ప్రాణం పోశారు. తను రియల్ లైఫ్ లో కూడా ఎన్ని ఎలాంటి పరిస్థితులు కూడా చాలా శాంతిగా ఉంటారు. ఈ సినిమాకి హీరో ఈషా. ఈ సినిమా తప్పకుండా మిమ్మల్ని అందరిని ఎంటర్టైన్ చేస్తుందని నమ్మకం ఉంది అందరూ థియేటర్స్‌లో వెళ్లి సినిమా చూడండి. చాలా ఎంజాయ్ చేస్తారు

డైరెక్టర్ సజీవ్ మాట్లాడుతూ.. అందరికీ థాంక్యూ సో మచ్. సృజన్ కథలు ఎంపిక చాలా నిజాయితీగా ఉంటుంది. నన్ను నమ్మి ఈ అవకాశం ఇచ్చిన ఆయ నకి థాంక్యూ. నా డైరెక్షన్ డిపార్ట్మెంట్ అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ప్రొడక్షన్ డిజైన్ విషయంలో చాలా కేర్ తీసుకున్నాం. సినిమా చాలా ఫ్రెష్ గా కనిపిస్తుంది. జై క్రిష్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. సినిమాని మరో స్థాయికి తీసుకువెళ్లారు ఈ సినిమాల్లో బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అదిరిపోతుంది. ఈ సినిమాకి సూపర్ స్టార్ ఈషా. శాంతి పాత్ర జీవితాంతం గుర్తుండిపోతుంది. తరుణ్ భాస్కర్ నా లైఫ్ లో హీరో. ఆయన సినిమాకి అసిస్టెంట్ డైరెక్టర్ జాయిన్ అయితే చాలు అనుకునేవాడిని. ఆయన్ని డైరెక్ట్ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. ఇందులో తరుణ్ భాస్కర్ ఓంకార్ నాయుడు పాత్రలో గుర్తుండిపోతారు. చాలా నిజాయితీగా తీసిన సినిమా ఇది. కచ్చితంగా ఈ సినిమా మీ అం దరికీ ఒక కొత్తదనం ఇస్తుంది. తప్పకుండా ఈ సిని మాని థియేటర్స్ లో చూడాలని కోరుకుంటున్నాను.

బివిఎస్ రవి మాట్లాడుతూ.. తరుణ్ నాకు చాలా ఇష్టమైన డైరెక్టర్. తను సైన్మా అనే షార్ట్ ఫిలిం తీసిన ప్పుడు నుంచి తనని ఫాలో అవుతున్నాను. తెలుగు సినిమాకి ఒక రెవల్యూషన్ తీసుకొచ్చిన డైరెక్టర్ తను. తన నటన కూడా చాలా విలక్షణంగా ఉంటుంది. ఇప్పటివరకు తను చేసిన పాత్రలన్నీ కూడా అద్భుతంగా ఉంటాయి. ఈశా లాంటి అద్భుతమైన నటి. తను బతికున్నంత కాలం తెలుగు సినిమా పరిశ్రమలో ఉంటుంది. సృజన్ మంచి కంటెంట్ ఉన్న సినిమాలు చేసే నిర్మాత. చాలా మంచి టీం తోస్తున్న సినిమా ఇది. తప్పకుండా ఈ సినిమా చాలా పెద్ద సక్సెస్ అవుతుంది.

హీరో విశ్వక్సేన్ మాట్లాడుతూ.. అందరికీ గుడ్ ఈవెనింగ్. గత ఏడాదిగా పబ్లిక్ అపీరియన్స్ డిటాక్స్ అని అండర్ గ్రౌండ్ లో తిరుగుతుండే(నవ్వుతూ) కానీ ఇది ఫ్యామిలీ ఫంక్షన్. డిటాక్స్ కుదరదు. ఫలక్ నామదాస్‌లో సైదులు క్యారెక్టర్ ని తరుణ్‌తో చేయించడానికి చాలా కష్టపడ్డాను. ఏదో రకంగా ఒప్పించి చేయించాను. అయితే తర్వాత చాలా బాధపడ్డాను. ఎందుకంటే తన యాక్టర్‌గా చాలా బిజీ అయిపోయాడు. ఈ నగరానికి ఏమైంది 2 స్టార్ట్ చేస్తారా లేదా అనే టెన్షన్ వచ్చింది. అజయ్ భూపతి సినిమాలో తను ఐటెం సాంగ్ చేసినప్పుడు నాకు చాలా ఆనందంగా అనిపించింది. నేను పరిచయం లేని రోజుల్లో నా కోసమైనా బలంగా నిలుచున్నాడు. మోస్ట్ హానెస్ట్ పర్సన్ తను. నా బ్లడ్ బ్రదర్. ఇది నాకు హోం ఫంక్షన్. సినిమా ఈ కథ తెలుసు. ఈషా క్యారె క్టర్ గుర్తుండిపోతుంది. సృజన్ కి మంచిగా డబ్బులు రావాలని కోరుకుంటున్నాను. అందరు ఈ సినిమాని థియేటర్స్ లో చూడాలని కోరుకుంటున్నాను.

హీరో ప్రియదర్శి మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. తరుణ్ ని యాక్టర్‌గా చూస్తుంటే చాలా ముచ్చటగా ఉంది. తన ఒక నదిలా ఫ్లోలో ఉంటాడు. ఈ సినిమా ధైర్యంగా ముందుకు తీసుకెళుతున్న సృజన్ గారికి అభినందనలు. ఈ సినిమా పూర్తి అయిన తర్వాత మనందరికీ గుర్తుండిపోయే పేరు ఈషా. తనని ఇలాంటి క్యారెక్టర్ లో చూడడం చాలా కొత్తగా ఉంది. తప్పకుండా ఈ సినిమాని అందరూ జనవరి 30న థియేటర్స్‌కి వచ్చి చూడాలని కోరుకుంటున్నాను. అందరూ థియేటర్స్ లో కలిసి ఈ సినిమాని ఆస్వాదిస్తుంటే దాని ద్వారా వచ్చే ఎనర్జీ చాలా పాజిటివ్ గా ఉంటుంది.

అభినవ్ మాట్లాడుతూ.. ఈ సినిమా ట్రైలర్ టీజర్ సాంగ్స్ అందరికీ రీచ్ అయ్యాయి. నటుడిగా డైరెక్టర్గా తరుణ్ చాలా ఇష్టం. నాకు ఈ సినిమా టీజర్ ట్రైలర్ మ్యూజిక్ చాలా నచ్చాయి. గోదావరి చాలా ఫ్రెష్ గా ఉంది. ఫ్యామిలీ ఆడియన్స్ అందరికీ నచ్చే సినిమా ఇది. తప్పకుండా ఈ సినిమా మరో బ్లాక్ బస్టర్ కావాలని కోరుకుంటున్నాను.

శ్రీనాథ్ మాగంటి మాట్లాడుతూ... తరుణ్‌తో వర్క్ చేస్తున్నప్పుడు పని చేస్తున్నామా పార్టీ చేసుకుంటున్నామా అర్థం కాదు. చాలా మంచి టీం తో చేసిన సినిమా ఇది. తప్పకుండా పెద్ద బ్లాక్ బస్టర్ అవుతుంది. ట్రైలర్ చూసి చాలా ఎంజాయ్ చేశాను. అందరూ థియేటర్స్ లో చూసి ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాను.

వెంకటేష్ మాట్లాడుతూ.. ఈ సినిమా నేను చూశాను. చాలా ఎంజాయ్ చేశాను. మీరు కూడా థియేటర్స్ లో పడి పడి నవ్వుతారు. తరుణ్ గారికి ఇషా గారికి అందరికీ ఆల్ ద వెరీ బెస్ట్. తప్పకుండా ఈ సినిమా అందరూ థియేటర్స్ లో చూడాలని కోరుకుంటున్నాను.

ప్రొడ్యూసర్ సృజన్ మాట్లాడుతూ.. ఒక బ్యాక్ గ్రౌండ్ లేని ప్రొడ్యూసర్ కి సినిమా చేసే ఒత్తిడి కంటే ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి గెస్ట్‌ని పిలవడంలో చాలా ఒత్తిడి ఉంటుంది. ఇలాంటి సమయంలో ఒక్క ఫోన్ కాల్ తో మా ఈ నగరానికి ఏమైంది టీమ్ అందరు కూడా ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉంది. అలాగే ఒక ఫోన్ కాల్‌తో దర్శి రావడం కూడా చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఇది రీమేక్ అని మేమే చెప్పాము. రీమేక్ అంటే మనం చూసిన కథని ఇంకొక లాగా చెప్పడం. రామాయణం ఎన్ని రకాలుగా చెప్పుకున్నా కథ అదే. కానీ ఒక్కొక్క కోణంలో ఒక్కోలా కనిపిస్తుంది. ఈ సినిమా కూడా ఇంటింటా రామాయణం. ఎన్నిసార్లు చూడాలనుకున్నా మళ్లీ చూడొచ్చని నమ్మి చేసిన సినిమా. జనవరి 30న మీరు థియేటర్స్ కి వెళితే కచ్చితంగా ఎంటర్టైన్ చేస్తాం.మమ్మల్ని నమ్మి అందరూ థియేటర్స్ కి రావాలని కోరుకుంటున్నాం.

ప్రొడ్యూసర్ అనూప్ మాట్లాడుతూ.. ఈ సినిమాలో భాగమవడం చాలా ఆనందంగా ఉంది. తరుణ్ భాస్కర్ చాలా ప్రతిభ ఉన్న దర్శకుడు నటుడు. మంచి హ్యూమన్ బీయింగ్. చాలా నిజాయితీగా ఉంటాడు. తనతో మాట్లాడుతున్నప్పుడు ఒక బ్రదర్ తో మాట్లాడుతున్నట్టుగా ఉంటుంది. తప్పకుండా తనని తమిళ్లో కూడా తీసుకువెళ్లాలని ఉంది. తను నెక్స్ట్ సూపర్ స్టార్. చాలా ప్రేమతో ఈ మాట చెప్తున్నాను. అందరూ కష్టపడి పని చేశారు తప్పకుండా ఈ సినిమా మీ అందరిని అలరిస్తుంది.

ప్రొడ్యూసర్ వివేక్ మాట్లాడుతూ... అందరికీ నమస్కారం. ఈవెంట్ కి వచ్చిన అందరికీ స్వాగతం. సృజన్ తో కలిసి ఈ సినిమాని నిర్మించాం. తెలుగు సినిమా ఒక ఎమోషన్. రాజమండ్రిలో షూట్ చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఓం శాంతి అందరికీ కనెక్ట్ అయ్యే కథ. అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న ఫ్యామిలీ ఎంటర్టైనర్. జనవరి 30న అందరు ఈ సినిమా వెళ్లి థియేటర్స్ కి వెళ్లి చూడాలని కోరుకుంటున్నాన. నచ్చితే మీ ఫ్యామిలీ గ్రూప్స్‌లో ఒక మెసేజ్ పెట్టండి. అది మాకు ఎంతగానో ఉపయోగపడుతుంది. మీ ప్రేమ, మీ సినిమా, మీ ఫుడ్.. ఆల్ బ్లాక్ బస్టర్'. ఈ వేడుకలో మూవీ టీం అందరూ పాల్గొన్నారు.

## ఈటీవీ విన్ ప్రేక్షకుల హృదయాలు గెలుచుకుంటున్న ముళ్ళపూడి వరా గొల్ల రామవ్వ

స్వర్గీయ భారత ప్రధాని పి.వి.నరసింహారావు రాసిన తెలంగాణ సాయుధ పోరాటగాథకు దృశ్యరూపంగా ముళ్లపూడి వరా దర్శకత్వంలో తెరకెక్కిన రోమాంఛిత వీరగాథ "గొల్ల రామవ్వ"కు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. జనవరి 25 నుంచి ఈటీవీ విన్ లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ చిత్రానికి అసాధారణ స్పందన లభిస్తోంది. ఈ చిత్రాన్ని సుచేత డ్రీమ్ వర్క్స్ ప్రొడక్షన్ – వర్మ డ్రీమ్ క్రియేషన్స్ పతాకాలపై... రామ్ విశ్వాస్ హనూర్కర్ – రాఘవేంద్రవర్మ (బుజ్జి) సంయుక్తంగా నిర్మించారు. అజహర్ షేక్ ఈ చిత్రానికి కార్యనిర్వాహక నిర్మాతగా కీలక బాధ్యతలు నిర్వహించడంతోపాటు... సాహిత్యం సమకూర్చారు.

ఇంతకుముందు ఈటీవీ విన్ కోసం "మౌనమే నీ భాష" చిత్రాన్ని నిర్మించి, వీక్షకుల నుంచి విశేష ఆదరణ పొందిన టీమ్ నుంచి వచ్చిన "గొల్ల రామవ్వ" రెట్టింపు స్పందన రాబడుతుండడం విశేషం . "తెలుగు సీతామాలక్ష్మి" తాళ్ళూరి రామేశ్వరి టైటిల్ పాత్రలో తెరకెక్కిన ఈ చిత్రంపై కురుస్తున్న ప్రశంసల వర్షంపై చిత్ర దర్శకుడు ముళ్ళపూడి వరా హర్షం వ్యక్తం చేశారు. నిర్మాతలు రామ్ విశ్వాస్ హనూర్కర్ – రాఘవేంద్రవర్మ (బుజ్జి)లతోపాటు... ఈ చిత్ర రూపకల్పనలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. పి.వి.నరసింహారావు కుమారుడు పి.వి.ప్రభాకర రావు, కుమార్తె సురభి వాణీ దేవిలకు కూడా ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు!!



అల్లు గీత, అన్విత్, మణి మంతెన ఇతర ముఖ్యపాత్రలు పోషించిన ఈ చిత్రానికి పి.ఆర్.ఓ: ధీర జ్– అ ప్పాజీ, గానం : వరం, సంగీతం: సాయి మధుకర్, ఛాయాగ్రహణం: గంగమోని శేఖర్, కూర్పు: రాఘవేంద్ర వర్మ, రచన: బయ్యవరపు రవి, కార్యనిర్వాహక నిర్మాత & సాహిత్యం: అజహర్ షేక్, నిర్మాతలు: రామ్ విశ్వాస్ హనూర్కర్ – రాఘవేంద్రవర్మ (బుజ్జి), చిత్రానువాదం – దర్శకత్వం: ముళ్ళపూడి వరా!!

## ఫిబ్రవరి 20న హే భగవాన్

### హీరో సుహాస్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్ 'హే భగవాన్' టీజర్ విడుదల




ఇటీవల లిటిల్‌హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి, ఈషా వంటి బ్లాక్‌బస్టర్స్ చిత్రాలను అందించిన బన్నీవాస్, వంశీ నందిపాటిల సక్సెస్‌ఫుల్ ద్వయం తాజాగా నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై 'హే భగవాన్' అనే ఫుల్‌లెంగ్త్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకరానున్నారు. ఫిబ్రవరి 20న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. వైవిధ్యమైన చిత్రాల కథానాయకుడు సుహాస్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో 'లిటిల్‌హార్ట్స్' ఫేమ్ శివానీ నగరం నాయిక. సీనియర్ నటుడు నరేష్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో యాంకర్ స్రవంతి చొక్కారపు ఓ ప్రముఖ పాత్రలో కనిపించనుంది. గోపీ అచ్చర దర్శకత్వంలో త్రిశుల్ విజనరీ స్టూడియోస్ పతాకంపై బి.నరేంద్ర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఈ చిత్రం గ్లింప్స్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది. కాగా బుధవారం ఈచిత్రం టీజర్‌ను విడుదల చేయడంతో పాటు ఫిబ్రవరి 20న చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఈ సందర్భంగా జరిగిన ఈ చిత్ర వేడుకలో చిత్ర నిర్మాత బి.నరేంద్ర రెడ్డి. దర్శకుడు గోపీ అచ్చర, ప్రొడక్షన్ డిజైనర్ రామ్‌కుమార్, ఎడిటర్ విప్లవ్, డీవోపీ మహిరెడ్డి, వంశీ నందిపాటి, స్రవంతి చొక్కారపు, హీరో అఖిల్‌రాజ్, హీరోయిన్ తేజస్వీరావు, హీరో సుహాస్, హీరోయిన్ శివానీ నగరం, దర్శకుడు సాయి మార్తండ్, నటుడు సుదర్శన్, నిర్మాత రమణా రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హీరో సుహాస్ మాట్లాడుతూ "టీజర్ లాంచ్ అనగానే నాకు మేసేజ్‌లు వచ్చాయి. ఈ సినిమాలో నాది గత సినిమాలతో పోలీస్తే చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఈ సినిమాలో ఎంటర్‌టైన్‌మెంట్ పాత్రను చేశాను. అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైన్‌మెంట్ విత్ కంటెంట్. ఇక నుంచి నా సినిమాలు అందర్ని అలరిస్తాయి. ఈ సినిమాకు వంశీ నందిపాటి, బన్నీవాస్ యాడ్ అయిన తరువాత మా టీమ్‌కు మంచి బూస్ట్ వచ్చింది. నరేంద్ర రెడ్డి ఎక్కడా రాజీ పడకుండా నిర్మించారు. ఈ సినిమా నా కెరీర్‌లో బెస్ట్‌ఫిలింగా నిలుస్తుంది. నాకు ఈ సినిమా బ్లాక్‌బస్టర్ అవుతుందనే నమ్మకం ఉంది' అన్నారు.

నిర్మాత నరేంద్రరెడ్డి మాట్లాడుతూ " మా మొదటి ప్రయత్నం. నా కెరీర్‌లో ఇది ఇంపార్టెంట్ సినిమా. ఎంతో ఎఫర్ట్ పెట్టి చేసిన సినిమా ఇది. ప్రేక్షకులు సక్సెస్ ఇస్తారనే నమ్మకం ఉంది' అన్నారు.

వంశీ నందిపాటి మాట్లాడుతూ " ఆరు నెలల ముందు ఈ కథ విన్నాను. ఒక సంవత్సరంలో సినిమా రెడీ అవుతుంది అనుకున్నాను. కానీ అనుకున్న కొద్ది రోజుల్లోనే చిత్రీకరణ పూర్తి చేసి బెటర్‌అవుట్‌పుట్‌తో వచ్చారు. ఈ సినిమాలో టీజర్ ఉన్నట్లుగా ఆడియన్స్ ఎవరైనా బిజినెస్ ఏదో గెస్ చేసి బహుమతి అందుకోవచ్చు. ఈ సినిమా నరేంద్ర కోసం టేకప్ చేసిన ఈ సినిమాలో ఎంతో పొటెన్షియల్ ఉంది. ఈ సినిమాతో నిర్మాత నరేంద్ర రెడ్డి పేరు గట్టిగా వినిపిస్తుంది. సుహాస్ నుంచి ఆడియన్స్ ఎటువంటి కంటెంట్ కావాలని అనుకుంటున్నారో. ఇందులో అటువంటి కంటెంట్‌ను సుహాస్ డెలివరీ చేశాడు. సుహాస్ ఎంతో బాగా నటించాడు. ఈ సినిమాలో కొత్త సుహాస్‌ను చూడబోతున్నారు. శివానీకి ఈ సినిమా మూడో బ్లాక్‌బస్టర్. ఆమె పాత్ర కూడా సినిమాలో ఎంతో ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుంది. ఎడిటర్ విప్లవ్ కంటెంట్ ప్రొటెక్షన్ కోసం ఓ మంచి యాప్‌ను రెడీ చేశాడు. అది అందరికి ఎంతో ఉపయోగపడుతుంది. ఓ మంచి సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకరాబోతున్నాం. హిట్ కొట్టబోతున్నామనే నమ్మకం ఉంది' అన్నారు.



శివానీ నగరం మాట్లాడుతూ "వంశీ, బన్నీ వాస్‌లు ఈ సినిమాను మరో బ్లాక్‌బస్టర్‌గా నిలుపబోతున్నారు. వా ళ్లు చేస్తున్న ప్రతి సినిమా బ్లాక్‌బస్టరే. దర్శకుడు గోపీ ఈ సినిమా విషయంలో చాలా సపోర్ట్ చేశారు. ఈ సినిమా లో ప్రేక్షకులకు కావాలసినంత వినోదం ఉంది. సెట్ అంతా నవ్వుల మయంగానే ఉండేది. రేపు థియేటర్స్ కూడా నవ్వుల మయం కాబోతున్నాయి. సుహాస్‌తో మరో సినిమా చేయడం ఎంతో స్పెషల్‌గా ఉంది. ఫుల్ పవర్ ప్యాకడ్ ఎంటర్‌టైనర్ ఇది. ఫిబ్రవరి 20 ఈ సినిమా థియేటర్‌లో బ్లాస్ట్ కాబోతుంది' అన్నారు.

చిత్ర దర్శకుడు గోపీ అచ్చర మాట్లాడుతూ "టీజర్ అందరికి నచ్చింది. ఫిబ్రవరి 20న మా నిర్మాతకు ఈ సినిమా రూపంలో బ్లాక్‌బస్టర్ ఇస్తున్నాను. సుహాస్ నాకు వ్యక్తిగతంగా బాగా తెలుసు. ఎంతో ఫ్రెండ్లీ పర్సన్. ఎంతో డేడికేషన్ ఉన్న నటుడు. శివానీ చాలా ప్రొఫెషనల్ ఆర్టిస్ట్. నటుడు సుదర్శన్ ఈ ప్రాజెక్ట్‌కు ఎంతో ప్లస్ అయ్యాడు. ఈ సినిమాతో యాంకర్ స్రవంతి నటిగా కూడా మంచి పేరు తెచ్చుకుంటుంది. వంశీ నందిపాటి గురించి, ఆయన పాషన్ కూడా అందరికి తెలుసు. సినిమా మీద ఎంతో ఎఫర్ట్ పెడతారు. నాకు ఈ అవకాశం ఇచ్చిన నిర్మాతకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను' అన్నారు.

స్రవంతి చొక్కారపు మాట్లాడుతూ "ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న తరుణమిది. యాంకర్‌గా పేరు తెచ్చుకున్న నేను నటిగా కూడా గుర్తింపు వస్తుందనే నమ్మకం ఉంది. నేను వెండితెరపై నటిగా హే భగవాన్‌తో పరిచయం అవుతున్నాను. ఈ సినిమా వంశీ, బన్నీవాస్‌లు తీసుకున్నారు అనగానే ఈ సినిమా బ్లాక్‌బస్టర్ అవుతుందనే నమ్మకం వచ్చింది' అన్నారు. సుహాస్, శివానీ నగరం, నరేష్, వెన్నెల కిషోర్, సుదర్శన్, అన్నపూర్ణమ్మ, అజయ్ ఘోష్, స్రవంతి చొక్కారపు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి మహి రెడ్డి సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు. వివేక్ సాగర్ స్వరాలను అందించారు.

## గాబరా గాబరా.. లిరికల్ సాంగ్ రిలీజ్

సంతోష్ శోభన్ హీరోగా నటిస్తున్న సినిమా "కపుల్ ఫ్రెండ్లీ". ఈ చిత్రంలో మానస వారణాసి హీరోయిన్ గా నటిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ గా నిర్మిస్తోంది. అజయ్ కుమార్ రాజు.పి కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యూజికల్ రొమాంటిక్ లవ్ స్టోరీ గా తెరకెక్కిన "కపుల్ ఫ్రెండ్లీ" సినిమా వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 14న తెలుగు, తమిళంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ రోజు "కపుల్ ఫ్రెండ్లీ" సినిమా నుంచి 'గాబరా గాబరా' లిరికల్ సాంగ్ ను రిలీజ్ చేశారు. ఈ పాటకు రాకేందు మౌళి లిరిక్స్ రాయగా, ఆదిత్య రవీంద్రన్ కంపోజ్ చేశారు. సంతోష్ నారాయణన్ పాడారు. 'గాబరా గాబరా' పాట ఎలా ఉందో చూస్తే – 'గాబరా గాబరా సోదరా లైఫ్ మొత్తం, కాలమే తన్నెరా లక్ ని ఆమడ దూరం, బంతి భోజనంలో బంతిని వడ్డిస్తారా, చేపను వేపాక చెరువులో వేస్తారా, సంబంధం లేని పనులనే, చేస్తున్నాం సిగ్గే పడకనే, చెత్త చేరింది లోనే, 'గాబరా గాబరా సోదరా లైఫ్ మొత్తం, కాలమే తన్నెరా లక్ ని ఆమడ దూరం, జానెడుగా పైనకి ఎక్కుదమంటే, బారెడుగా జీవితం కిందకు జారిపోతుందే...' అంటూ కలిసి రాని లైఫ్ కు ఫేట్ ఇచ్చే ట్విస్ట్ లు, ఎంత ప్రయత్నించినా ఎదురయ్యే రెడ్ లక్ లు ఎలా ఉంటాయో చూపిస్తూ ఈ పాట సాగుతుంది. నటీనటులు – సంతోష్ శోభన్, మానస వారణాసి, తదితరులు.

### టెక్నికల్ టీమ్..

ఆర్ట్ – మైఖేల్ బీఎఫ్ఏ, ఎడిటర్ – గణేష్ శివ, డీవోపీ – దినేష్ పురుషోత్తమన్, మ్యూజిక్ – ఆదిత్య రవీంద్రన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ – ఎస్ఎస్ వర్మ, సమర్పణ – యూవీ క్రియేషన్స్, నిర్మాణం – యూవీ కాన్సెప్ట్స్, అజయ్ కుమార్ రాజు. పి., పీఆర్ఓ – జీఎస్ కే మీడియా (సురేష్ – శ్రీనివాస్), రచన, దర్శకత్వం – అశ్విన్ చంద్రశేఖర్.



Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sai Sree Offset Printers, # 7-17-166, 3rd line, Srinagar, Guntur - 522002 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Maria, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.